
ఆంధ్ర సచిత్ర వార పత్రిక

21-9-84
రు. 2/-



క్రొత్త

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం



అధిక రుచికరం అధిక సంపూర్ణం



ప్రేమతో మీరు పెట్టే ప్రతి చెంచాడు పాపాయి పెరుగుదలకు మంచిది.

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.

కలపడం సులభం. పాపాయికి తినిపించడం సులభం.


పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.

పాపాయి పెరుగుదలకు అత్యావశ్యకమైన ప్రోటీన్‌తో సమృద్ధం. ఆరోగ్యవంతమైన రక్తంకోసం అదనంగా ఐరన్ కలిగినది. గట్టి పళ్లు, ఎముకలకోసం సరియైన నిష్పత్తిలో కాల్షియం మరియు ఫాస్ఫరస్ కలిగినది. పాపాయి సున్నిత జీర్ణశక్తికి అనువుగా ముందుగానే పచనం చేయబడినది.

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.

పతి చెంచాలో అధిక సంపూర్ణ ఘన ఆహారం.

CLARION/B/GX/3/234 Tel



Imageads M-1783

ముఖచిత్రం

24–8–84 వారపత్రిక ముఖచిత్రం ఏమంత బాగోలేదు.

పక్కి రాధా గోపాలకృష్ణ, బల్లిగూడ,(ఒరిస్సా).

అంజలి

నింగికెగసిన తన కీర్తి చూసుకుని ఆనంద-పడుతున్న 31–8–84 సంచిక ముఖచిత్రం – జయసుధ చాలా బాగుంది

అనంత, మచిలీపట్నం.


ముఖచిత్రం

"గుండెలు తీసే గూండా, దమ్ములున్న దాదా, డిస్కో డైనమిక్ హీరో చిరంజీవి ముఖచిత్రము అందముగా ప్రచురింపగలరని కోరుచున్నాను.

వేముల సురేందర్‌రావ్, గద్వాల.

శివాజి – ఔరంగజేబు

17–8–84 సంచికలో "దుబాషి వ్యాఖ్యలు" అనే శీర్షిక క్రింద ప్రకటింపబడిన శ్రీ జవహర్‌గారి లేఖ చదివాను.



శివాజీ మతోన్మాది కాడా? అని లేఖకులు ప్రశ్నించారు. దీని అర్థమేమిటో తెలుసుకొనే ప్రయోగించడం జరిగిందా? మహమ్మదీయ మతంతో బాటు అన్ని మతాలను శివాజి గౌరవించాడని చరిత్ర చాటి చెబుతోంది. గెరిల్లా యుద్ధం చేసినంతమాత్రాన ఆయనను మతోన్మాదిగా చిత్రంచ తగునా? యుద్ధ తంత్రంలో అదొక పద్ధతి. అపారమైన సైనిక సామర్థ్యం కల్గిన గొప్ప శత్రువుని ఎదుర్కొనేందుకు అవలంభించిన విధానం. స్వీయ మత సంస్కృతులను కాలరాచివేస్తూ స్వదేశ స్వాతంత్ర్యాన్ని

(66వ పేజీ చూడండి)

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు:

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం: 1908

శివలెంక శంభు ప్రసాద్

సంపాదకుడు:

(1938-1972)

శుక్రవారం: 21-9-'84

శ్రీ రక్తాక్షినామ సం. భాద్రపద బ. ఏకాదశి

సంపుటము 77 : సంచిక 3

సంపాదకుడు:

శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు. 2-00
ఆరు మాసాల చందా	రు. 55-90
పోస్టులో ఏడాది చందా	రు. 111-80

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం, విజయవాడ-520 003.

విషయానుక్రమణిక


అసలు ఇది రామ్‌లాల్ వ్యవహారమా ?

"అధికారం నా జన్మహక్కు. అది నాకు ఉండితీరాలి." బాలగంగాధర్ తిలక్ స్వరాజ్యాన్ని గురించి చెప్పిన మాటలని శ్రీమతి గాంధి ఇలాగే మార్చి చెబుతున్నారనిపిస్తుంది. తిలక్ స్వరాజ్యం ఎందుకు కావాలంటున్నారో బ్రిటిషు వాళ్ళకి అర్థం అయింది – ఆయనకి స్వరాజ్యం లేదుకదా? శ్రీమతి గాంధి సంగతి వేరు. ఆవిడ అధికారానికి ఏమి తక్కువ? కాని, కొందరికి ఏది ఎంత ఉన్నా చాలదు. అవతల వాళ్ళ దగ్గర ఉన్న కొద్దిపాటిదీ తనకేకావాలంటారు.

రామ్‌లాల్ వ్యవహారం ఒక అద్భుత మయిన వింత వ్యవహారం. అసలు అది రామ్‌లాల్ వ్యవహారమా? వట్టి బుద్ధి మాలినవాడే – ఇలాంటి వాళ్ళకేమి కొరతలేదు- అది రామ్‌లాల్ వ్యవహారం అనుకుంటాడు. ఉత్తరాది అడవుల ప్రాంతాలనుంచి వచ్చిన ఒక వ్యక్తి దక్షిణాదిలో బ్రహ్మాండంగా గెలిచిన ఒక వ్యక్తిమీద కక్షసాధిస్తాడా? జరిగిన దానిని గురించి ఏదో పత్రికలో చదివామని శ్రీమతి గాంధీ. ఇదే నిజమయితే ఆవిడ వేరే పత్రికలు చదవటం మంచిది. రామ్‌లాల్‌కి లెక్క పెట్టటమే సరిగ్గారాదని కొందరంటారు. అలాంటి మనిషి టెలిఫోన్‌మీద ఏమి విని ఏమి చేశాడో! ఎన్. టి. రామారావు అదృష్టం బాగా ఉండి ఇంతకన్నా ఏమి జరగలేదు. అసలు సఫాచేసెయ్యమన్నారని రామ్‌లాల్ అనుకుని వుంటే? ఒక పిష్యాని పట్టుకురమ్మంటే ఆదేశం అర్థంకాక ఆ పిష్యాని చంపివేశారుట. అత్యవసర పరిస్థితిలో ఎందరు సఫా కాలేదు?

అసలు శ్రీమతి గాంధి ఎందు కిలాగ చేశారు నాకు అర్థం కావటంలేదు. కాశ్మీరు సంగంతి వేరు. అక్కడి మనిషి అంత నిజాయితీ పరుడుకాదు. రామారావు అలాంటి మనిషి కాదు కదా? ఆయన ఆంధ్రప్రదేశ్ చూపిన ఉత్తమ ముఖ్య మంత్రి కాదే అనుకోండి. ఆ మాటకి వస్తే శ్రీమతి గాంధి భారతదేశం చూపిన ఉత్తమ ప్రధాన మంత్రి కూడా కారుగా! భాస్కరరావుని గద్దె ఎక్కించి ఆవిడకి కాని ఆవిడ పార్టీకి కాని కలిగే ప్రయోజనం ఏమిటి? పోయినసారి రామారావు గెలిచినప్పుడు కాంగ్రెసు (ఇందిర)వారే అధికారంలో ఉన్నారు. అయినా గెలిచాడు. ఆయనది శాసనసభలో మెజారిటీ లేదే అనుకోండి- అసలు ఇది నిజం కాదేమో- కాని తన బలాన్ని నిరూపించుకునేందుకు ఆయనకి అవకాశం ఇవ్వాలికదా? రామారావు మీద వేసిన అస్త్రం బెడిసికొట్టింది. ఆయనకి అన్యాయం జరిగిపోయిందన్న భావం బాగా బలపడిపోయింది. దీనివల్ల శ్రీమతి గాంధీకి కలిగిన లాభం ఏమిటి?

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

జయప్రకాశ్ నారాయణ్‌కీ, ఆయన అనుచరులకి అన్యాయం జరిగిందనే కదా 1977 లో ఉత్తరాదిన శ్రీమతి గాంధీ ఓడిపోయింది? మళ్ళీ అదే జరగవచ్చు. రామారావు ఆంధ్ర ప్రదేశ్‌కి శాశ్వతంగా ముఖ్యమంత్రి అయ్యేందుకు వీలు కల్పించారు శ్రీమతి గాంధీ.

ఆవిడ కాశ్మీరులో పొరపాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా పెద్ద పొరపాటు చేశారు. కర్ణాటకలో కూడా ఇటువంటి తప్పుడు పనే చేసి శ్రీమతి గాంధీ తమ ఘనత చూపించుకుంటారేమో!ఒక దేశం ప్రధానమంత్రి చెయ్యవలిసిన మంచి పనులు ఎన్నో ఉన్నాయి. ఇలాగ ముఖ్య మంత్రులని పడగొడుతూ కూర్చుంటే వాటికి తీరిక ఎక్కడ? ఈ రకం పనులు చేస్తూ కూర్చుంటే మన సంపద పెరగదు కదా? మనది అసలే బీద దేశమాయె! యూరోపు జనాభాని మించిన సంఖ్యలో భారతీయులు రోజుకి రెండు పూటలా తినలేక పోతున్నారు. ఒలింపిక్ ఆటలో మన వాళ్ళకి స్థానమే లేకపోయింది. చదువూ, దుస్తులూ, గృహ వసతీ సంగతి సరేసరి!

వేరే సమస్యలు లేవనా? ఉన్నాయి! జియా అణ్వస్త్రాలని తయారు చేసుకుని బంగళాదేష్ అవతరణ మూలాన కలిగిన అవమానానికి ప్రతీకారం సాధిద్దా మనుకుంటున్నాడు. రేపు జియా ఆటమ్ బాంబు చూపిస్తే మనం రామ్‌లాల్‌లనీ, భాస్కరరావులనీ, దక్షిణాది రాష్ట్రాల శాసన సభ్యులతో ఫిరాయింపుదారులనూ పంపుతామా? మన ప్రాణాలకే ముప్పు వస్తూ ఉంటే ఈ తమాషా లేమిటి? ప్రతి దేశానికీ ఆ దేశానికి తగిన నాయకులు వస్తారుట. కాని మనం ఏమి పాపం చేశామని ఇలాంటి వాళ్ళు దాపురించారు?

సమస్య ఏమిటో నాకు తెలిసింది. సమస్య మనది కాదు, శ్రీమతి గాంధీది. నేను ఈమధ్యనే సర్వేపల్లి గోపాల్ రాసిన నెహ్రూ – జీవిత – చరిత్ర మూడవ సంపుటం చదవటం మొదలు పెట్టాను. అంత గొప్ప పుస్తకం కాదు కాని అది వేరే సంగతి. నెహ్రూకి కూడా ఇలాంటి సమస్యే ఉండేది. ఆయనకి వంటరితనం వచ్చేసింది. ఆయన ఈ దేశ ప్రజల జీవన స్రవంతికి దూరం అయ్యాడు. నెహ్రూకి ఇలాంటి సమస్యా? అనిపించవచ్చు కాని చుట్టూరా అవకాశవాదులూ, సుత్తి వేసే వాళ్ళూ, సాష్టాంగ పడేవాళ్ళు ఉంటే ఇలాగే అవుతుంది. చీనాయుద్ధం అప్పుడు నెహ్రూ చుట్టూ ఉన్న వాళ్ళు ఎవరు? కృష్ణమీనన్, కె. కె. మాలవీయా, ధర్మతేజా, ప్రతాప్‌సింగ్ కైరాన్ లాంటి దొంగలు! వీళ్ళంతా వచ్చి నెహ్రూ తలమీద కూర్చున్నారా? లేదే! ఆయనే వాళ్ళని పట్టుకువచ్చి తన చుట్టూ ఉంచుకున్నాడు. కృష్ణమీనన్ ఆయనని ఎన్నో విధాలుగా వినియోగించుకున్నాడు. ధర్మతేజ తనకి తోచినట్లు దేశాన్ని కొల్ల గొట్టుకున్నాడు. ఆయన నెహ్రూతో భౌతిక శాస్త్రాన్ని గురించి మాట్లాడేవాడు. ఈ శాస్త్రాన్ని గురించి నెహ్రూకి ఏమి తెలుసు?నెహ్రూ బాగాచదివేవాడు కాదు. ఆయనది బయాలజీ గ్రూపు. వచ్చినదేమో మూడవ క్లాసు. కాని "సైన్స్" అంటే మోజు ఎక్కువ. 1958 తరువాత నెహ్రూ చేసిన ప్రయత్నాలన్నీ విఫలం అయ్యాయి. ఆయన భగ్న హృదయుడయి మరణించాడు. తేజ, మీనన్‌లాంటి వాళ్ళు మాత్రం బాగు పడ్డారు.

శ్రీమతి గాంధీ చుట్టూ ఉన్న మనుష్యులని తీసుకుందాము. వాళ్ళు మాత్రం తక్కువ వాళ్ళా? తేజ బదులు స్వరాజ్ పాల్. కైరాన్ బదులు అంతూలే, మీనన్ బదులు కావలిసినంత మంది శాల్‌లూ, పార్థసారధిలూనూ. రామ్‌లాల్ లాంటి విదూషకులకి కొదువ లేదనుకోండి! రామ్‌లాల్‌ని వెయ్యమని ప్రధానమంత్రి చెబితే రాష్ట్రపతి రామ్‌లాల్‌ని గవర్నరుగా వేశారు. రాష్ట్రపతి చేసిన ఈ తప్పుని దేవుడే క్షమించాలి! రామ్‌లాల్‌ని గవర్నరుగా వెయ్యమని చెప్పే వాళ్ళు ప్రధానమంత్రి పదవికి తగిన వాళ్ళు కానే కాదు. రామారావు బలవంతపు బర్తరఫ్ కన్నా రామ్‌లాల్ నియామకమే విషాద-

ఆనవాయితీ



డాక్టర జయప్రద

"ఆడపిల్ల తొలి కాన్పు చేయాల్సింది పుట్టింటోళ్ళు. మాకేంబట్టింది''పదోసారి అంది కామాక్షమ్మ.

''నిజమే కావమ్మొదినా ! నేను కాదనడం లేదు. వుంటే బిడ్డకు పురుడు పోసుకునేది — మాకు కష్టమా ?''

''వుంటే. వుంటే, వుంటే అంటావే ఎంతసేపటికీ — ఆడపిల్లకు పెళ్ళిచేసాక కడుపొస్తుందని తెలీదూ ? కాన్పు సమయానికి డబ్బు దాచుకోవాలని తెలీదూ ?''

''వీలుంటే కడుపుకట్టుకోనైనా దాచుకోక పోయానా ?'' అని మనసులోనే గొణుక్కుని మరలా ప్రాధేయపడసాగింది సరోజనమ్మ.

''ఏం చేయను చెప్పు వదినా నీకు తెలియందేవుంది? వాడుచేసేది గుడ్డలంగడిలో రెండొందల గుమస్తా ఉద్యోగం — బిడ్డ అడ్డంగా వుందనీ, ఆపరేషన్ కాన్పవుద్దనీ తెలిస్తే నలుగురేమనుకున్నాసరే నాలుగిళ్ళల్లో పాచి పని చేసయినా దాచుకుందును. ఇప్పుడయినా మించిపోయింది లేదు. నువ్విప్పుడు ఖర్చుపెట్టే డబ్బు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను. అది నీ బిడ్డే అనుకో. నీ కడుపులో పెట్టుకో ఇవి చేతులు కావనుకో.''

''నా బిడ్డే అనుకోవాలా ? ఇది మరీ బాగుంది. బిడ్డల్ని కనగానే సరికాదమ్మా వాళ్ళకు పెళ్ళిళ్ళు, పురుళ్ళు చేసుకోవాలి.''

''చేసుకోవాలమ్మా నేను కాదంటానా ? డబ్బు లేకగానీ...''

కామాక్షమ్మకు చాలా కోపం వస్తోంది. పిల్లకు పురుడు చేసుకోను డబ్బు లేదంటుందే. ఆమాత్రం తెలీదూ పుట్టింటోళ్ళ పురుడు పోయాలని.

''కావమ్మ వదినా ! ఈసారికి మల్లికి మీరే పురుడుపోసి పుణ్యం కట్టుకోండి ఆ తర్వాత మా పరిస్థితి మెరుగయితే మిగతా కాన్పులన్నీ మేమే చేస్తాం. నీ కాళ్ళు పట్టుకుంటాను వదినా !''

వియ్యపురాలి చేతులు విసిరి కొట్టింది కామాక్షమ్మ.

''భలే కిలాడిదానివే నువ్వు. నన్ను ఉబ్బించి బుట్టలో వేసుకోవాలని చూస్తున్నావా ? ఈ ఆటలన్నీ నా దగ్గరసాగవు. పురుడే పోసుకుంటావో, బావిలోకే తోస్తావో నీ ఇష్టం. నీ పిల్లను నువ్వు తీసికెళ్ళిపో.''

''నీ కొడుక్కి సర్వ సౌఖ్యాలు ఇస్తూ నీ ఇంటికి సర్వ చాకిరీ చేస్తున్న నా కూతురు నీకేమీ కాదా ?— నా చేతిలో డబ్బు లేనప్పుడు నీ చేతిలో డబ్బున్నప్పుడు, దాని ప్రాణం మీదికి వస్తే నీ కొడుకు భార్య ప్రాణాల్ని నిలుపుకోవాల్సిన కనీస బాధ్యత నీకు లేదా? అదే అల్లుణ్ణయితే పారేసుకుంటావా ? నీ కూతురి పసుపు–కుంకుమల కొరకు. నీ చేతిలో డబ్బు ఖర్చుపెట్టి బాగుచేయించుకోవూ ?'' అని అడగలేదు జయమ్మ. అసలలా అడగాలనే ఊహే రాలేదామెకు.

''నిజమే. మొదటి కాన్పు పుట్టింటోళ్ళు చేయాల్సిందే. కానీ ఎలా ?'' అని దిగులుపడి మనసును కాల్చుకుంటోంది.

''చూడు వదినా ! నా ఒంటి మీద కానీ, కోడలి వంటి మీద గానీ పిసరంత బంగారున్నా అమ్మి దాని కాన్పు చేద్దును. కానీ నీకు తెలీందేముంది చెప్పు.''

విసురుగా ముఖం తిప్పుకుంది కామాక్షమ్మ.

''వదినా !''

విసుగ్గా చూసి ఉచిత సలహా ఇచ్చింది కామాక్షమ్మ.

''నీ కోడలు కూడా ఎనిమిదవ నెలనుకుంటాను. కడుపు సారె తేవాలిగా. దాని బదులు డబ్బిమను'' వియ్యంకురాలి సలహా విని నిట్టూర్చింది జయమ్మ.

''వాళ్ళు మా కంటె గర్భదరిద్రులు. వాళ్ళేం పెడ్తారు ? అడగడం నోరు నొప్పి కానీ–పురుడు కూడా మమ్మల్నే పోసుకోమంటారో ఏమో !''

తమాషా ఏమంటే ఇప్పుడు వియ్యంకురాల్ని తన కూతురి కాన్పు చేయమని ప్రాధేయపడుతున్న జయమ్మ తన కోడలి పుట్టింటి దరిద్రం తెలిసినాకూడా వాళ్ళే ఈ కాన్పు చేయాల్సింది అనే భావాన్ని మాత్రం గుండెలనుండి తీసేసుకోలేదు. కాకపోతే కొద్దిగా కరుణ చూపిస్తోందంతే.

''ఏం చేసుకుంటావో నా కనవసరం —

రేపే వచ్చి తీసుకుపో — 'కడుపు సారెలు ఆ అదృష్టాలు మాకేడ్చాయి గనకనా ?'

మరీ కృంగిపోయింది జయమ్మ.

"తొమ్మిదో నెల పూర్తయ్యే టైముకు తీసుకెళ్తాములే వదినా. ఇప్పుడు నాతోపాటు దీన్నికూడా పోషించాలంటే వాడి శక్తికి మించిన పనయిపోతుంది."

"ఏం చెల్లెలికి నాలుగు రోజులు తిండి పెట్టలేని గతిలేని స్థితిలో వుండాడా నీ కొడుకు."

ఆమె ఎన్ని అడుగుతున్నా జయమ్మ సహనాన్ని కోల్పోవడంలేదు. కారణం ఆమె ఆడపిల్ల తల్లి — కన్నబిడ్డ కాన్పు చేయలేని నిస్సహాయ స్థితిలో వున్న స్త్రీ తను. అప్పు యిచ్చిన వ్యక్తి నిలదీస్తుంటే అప్పు తీసుకున్న తను తీర్చలేని స్థితిలో నిస్సహాయంగా నిల్చున్నట్టు నిల్చోనుందామె.

'నిజమే మరి. ఆడపిల్ల మొదటి కాన్పు పుట్టింటోళ్ళే చేయాలి' మరొక్కసారి మనసులోనే మననం చేసుకుని నిట్టూర్చింది.

*   *   *

"దాని అత్తగారు ఇలా అంటున్నారురా నన్నేం చేయమంటావు ?" అంటున్న తల్లికి —

"మీరంతా నా నెత్తినెక్కి ఊరేగండి" అని విసుక్కున్నాడు జయమ్మ కొడుకు రాఘవయ్య.

అతని విసుగులోనూ అర్థముంది. అతని పరిస్థితి అలాటిది. అప్పులివ్వాల్సిన వాళ్ళంతా ఇచ్చేసారు. అప్పు ఇవ్వడానికి ఇంకెవ్వరూ మిగల లేదు. అతను చేసేది గుడ్డలంగడిలో గుమస్తా ఉద్యోగం. జీతం రెండొందలు—పచ్చడిమెతుకులు ఒక పూట తిన్నా అది చాలడంలేదు. వున్న అప్పు తీర్చని అతనికి ఇంకా అప్పులిచ్చే నాధుడు లేడు.

తనకు తెలిసిన ప్రతి ఒక్కరి కాళ్ళా పట్టుకుంది జయమ్మ — ఎవ్వరూ దయ చూపలేదు. గవర్నమెంటు ఆస్పత్రికి తీసుకెళ్ళ మని సలహా ఇచ్చారు.

డాక్టరుగారు బిడ్డ అడ్డంగా వుంది అని చెప్పినప్పటినుండీ ఆలోచిస్తోంది జయమ్మ. ఎలా. ఎలా ? ఎంతలేదన్నా ఆపరేషన్ అంటే ఎనిమిదొందలన్నా అవుతుంది. పోనీ గవర్నమెంటు హాస్పిటల్‌కు తీసుకెళ్ళమని సలహాకూడా ఇచ్చింది డాక్టరమ్మ. గవర్నమెంటు ఆస్పత్రి అంటేనే తనకు భయం: తన భర్త చచ్చిపోయింది అక్కడ కాదూ !

ఆరోజు ఇంటికొస్తూనే ఒక నిర్ణయాని కొచ్చింది. ఇంకా పది రోజులుంది నెలలు నిండను. ఎవరింట్లోనైనా పాచిపనికి కుదిరితే— తిండి, గుడ్డ అవసరంలేదని చెప్తే నెలకు వంద రూపాయిలిస్తారు. తనింట్లో పనిచేసే మనిషి బిడ్డకు ఆపరేషన్ అంటే జాలిపడి సహాయం చేయకపోతారా ?

కానీ జయమ్మ ఆలోచన ఆదిలోనే అబద్ధమని తేలిపోయింది.

ఆ పల్లెటూరిలో వున్న నాలుగు పెద్దిళ్ళ వాళ్ళూ తిరస్కరించారు.

మధ్య తరగతి కుటుంబంలో వాళ్ళను పనికి పెట్టుకుంటే వాళ్లను ఒక మాట అనడానికి లేదు. పైగా కూతురు కాన్పుకు ఏదో అడక్క పోదు. ఎందుకొచ్చిన తద్దినం అనుకుని మర్యాదగా అవసరం లేదని చెప్పేసారు.

ఆ తర్వాత ఇంకేం చేయాలో తోచని నిరామయ స్థితిలోస్తబ్ధుగా వారం రోజులు గడిపే సింది. ఈ వారం రోజులు తన బిడ్డ అక్కడ ఎన్ని ఆరళ్ళు పడుతోందో అని అప్పుడప్పుడు గుండెను మండించుకుంటోంది. ఆ మంట ఇంకెన్ని రోజులో తల్లికివ్వదల్చుకోనట్టు పురిటినొప్పులతో పుట్టింటి కొచ్చింది మల్లీశ్వరి.

"ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకపోవాల" అనుకున్నప్పుడల్లా కొన్ని పచ్చనోట్ల వెలితి కళ్ళ ముందు కన్పించేది. గవర్నమెంటు ఆస్పత్రికి తీసుకెళ్లాలనుకుంటే— చచ్చిపోయిన తన భర్త గుర్తుకొచ్చేవాడు.

మల్లీశ్వరి నొప్పుల కేకలతో ఇల్లు ప్రతి ధ్వనిస్తుండగా ఏ ఆలోచనా తెగక పన్నెండు గంటలు గడిచిపోయాయి.

ఆఖరున చెల్లెలు కళ్ళు తేలవేసేసరికి, చెల్లెలి ఒళ్ళు చల్లబడేసరికి స్పృహ తెచ్చుకున్న రాఘవయ్య తల్లిని కాదని బస్సులో గవర్నమెంటు ఆస్పత్రికి తీసుకొచ్చాడు.

*   *   *

'గర్భసంచి పగిలిపోయింది. ఆపరేషన్ చేయాలి. బిడ్డ బ్రతకదు!' పరీక్షచేసి చెప్పింది డాక్టరు కరుణ.

"అలాగే మీ ఇష్టం. బిడ్డ పోయినా ఫరవాలేదు. మా చెల్లెల్ని బ్రతికించండి. మీకు ఏమీ ఇచ్చుకోలేని బీద స్థితిలో వున్నాను. మీ కెంతో ఋణపడి వుంటాను."

కళ్ళెత్తి ఒక్క క్షణం చూసి—

"ఇది గవర్నమెంటు హాస్పిటల్. మా శ్రమకు జీతం గవర్నమెంటు ఇస్తుంది." అనేసి థియేటర్ రెడీ చేసుకోవడంలో పడిపోయిందామె

కానీ ఆపరేషన్ చేసే శ్రమ మల్లీశ్వరి ఆమె కివ్వలేదు. వచ్చిన పదినిముషాల్లో ఆమె గుండె చలనం ఆగిపోయింది.


*   *   *

"ఇది చాలా ఘోరం. మీ అత్తగారికి డబ్బుంది కదా! అంత దయలేకుండా ఎలా ప్రవర్తించింది ?" అంది మల్లీశ్వరి తోడికోడలు నోటివెంట తన పేషెంటు కథ విన్న డాక్టరు కరుణ కోపంగా.

"ఆడపిల్ల మొదటి కాన్పు పుట్టింటోళ్ళు చేయాలి కదండీ."

చాలా అసహ్యమేసింది కరుణకు. ఆ అసహ్యం మల్లీశ్వరి తోడికోడలుమీద కాదు. ఆమె మౌఢ్యంమీద — ఆమెలాటి కొన్ని కోట్లమంది ఆచారాల మైకంమీద.

వీళ్ళ యింట్లో ఓ ఆడపిల్ల దయనీయ మైన మృతికూడా వీళ్ళ ఆచారాల మైకాన్ని దింపలేదా ? మన ఆచారాలు మనకింత విషాదాన్ని అందిస్తుంటే అదే ఆచారాలకు ఎంత ఘనమైన స్వాగతం పలుకుతున్నాం మనం ! ★



వ్యక్తిగతం



జేన్ సీమూర్ అనే టి.వి. సినిమాల నటికి తన 30నెలల కూతురు కేటీ అంటే ప్రాణం. తను ఎక్కడికి వెళ్ళినా తన కమార్తెని తీసుకువెడుతుంది. తన సినిమాలు చూపిస్తుంది. అయితే, ఆవిడ తను మొండిమొలగా వేసే దృశ్యాల సంగతి ఏమిటని ఆలోచిస్తోందిట......



ఆడా? మగా? ఏ బిడ్డ కావలిస్తే ఆ బిడ్డ పుట్టేట్టు చేసుకోవచ్చు నని రోనాల్డ్ ఎరిక్సన్ అనే శాస్త్రజ్ఞుడు అంటున్నాడు ఎలాగ? ముందు పురుషుడి వీర్యాన్ని తీసుకుని అల్యుమిన్ అనే పదార్థంకల ఒక గాజు గొట్టం పయి భాగంలో ఉంచుతారుట. ఒక గంట కాలంలో మగ పిల్లలని పుట్టించే వీర్య కణాలు ఎక్కువగా కిందికి దిగుతాయట. ఎందుకు? అంటే ఈ కణాలు ఆడబిడ్డలని పుట్టించే వీర్య కణాలకన్నా చురుకుగా ఉంటాయిట.

ఎక్కువ 'మగ' కణాలు కల కింది వీర్యాన్ని రెండు మూడుసారులు పయి విధంగానే అల్యుమిన్ ద్వారా పంపించి ఎవరికి అత్యధికంగా 'మగ' కణాలుకల వీర్యాన్ని కృత్రిమంగా కాబోయే తల్లి గర్భకోశంలోకి పంపుతారు....

ఈ విధంగా 146మంది ఆడవారికి కృత్రిమంగా వీర్యాన్ని ఇప్పిస్తే వాళ్ళలో 112మందికి పురుష సంతానం కలిగింది- అని శ్రీ ఎరిక్సన్ అంటున్నారు.......

ఆడబిడ్డలే కావలసినవారు "సెఫాడెక్స్" అనే పదార్థం ద్వారా(అల్యుమిన్ బదులు అన్నమాట) వీర్యాన్ని పడపోస్తే 'ఆడ' కణాలు ముందు కిందికి దిగుతాయని కొందరు అంటున్నారు....

ఈ పద్ధతిని గామెట్రిక్స్ అనే సంస్థ వాళ్ళు వెలకి అమ్ముతారు. ఒక ప్రయోగానికి 225-350 డాలరులు వాళ్ళ ఫీజు. ఒక డాలరు 10 రూపాయలు అనుకోవచ్చు.

గర్భం దాల్చటానికి ఒకసారి వీర్యం ప్రయోగిస్తే (సాధారణంగా) చాలదుట. మూడు, నాలుగు సారులయినా ప్రయోగించాలిట.....

ఇదంతా మోసం, అనే శాస్త్రజ్ఞులకి కొదువ లేదని వేరే చెప్పనక్కరలేదు!

వారఫలం

21-9-1984 శుక్రవారం మొదలు 27-9-1984 గురువారం వరకు

★ **మేషం :** వ్యాపారం సుకరంగా సాగిపోగలవారం. స్థిరాస్తి పెంపు చేసే ప్రయత్నాలు, నూతన వ్యాపారమందు శ్రమించే అవకాశం, అప్పులు వసూలు చేసికొనే యత్నమందు నిమగ్నులు కాగలుగుతారు. స్త్రీలకు : ధనలబ్ధి, కుటుంబానందం సంభవం.

★ **వృషభం :** మీ సహాయం అర్థించి బంధువులో మిత్రులో దాపునకు రాగలరు. వస్తు వాహన సంపాదనయందు నిమగ్నత కొందరకు, రాజకీయంగా పెంపు, కొందరకు, సారస్వత రంగాన అభివృద్ధి కొందరకు చెప్పదగిన అంశాలు. స్త్రీలకు : దూర ప్రాంతాలకు బంధువుల చూచుటకో, విద్యాభివృద్ధికో ప్రయాణించనున్నారు.

★ **మిథునం :** నూతన వ్యాపారంగాని, ఉన్నదాని అభివృద్ధి చేసికొనుటగానీ వస్తు విక్రయమందు లాభార్జనముగాని, కళారంగాన ఆదాయం పొందుటకుగాని అవకాశములున్నవి, శ్రమించుట అవసరం. స్త్రీలకు : కుటుంబానందం, ఉద్యోగాభివృద్ధిగల వారం.

★ **కర్కాటకం :** చేసిన పనినే మరలా చేయవలసి వస్తుంది. పరుల చేత చిక్కిన ద్రవ్యం రాబట్టుకొను ప్రయత్నాలు బాగా సాగుతాయి, శ్రమ లోపం చేయకండి. రంగ స్థల, చిత్ర రంగాన మెలకువతో యత్నిస్తే మేలు చేకూరుతుంది. స్త్రీలకు: కళాసాహితీ రంగాలందు సదవకాశాలుంటాయి

★ **సింహం :** అన్ని విధాలా మేలు చేకూరుతుంది, యత్నకార్యానుకూలతకు లోపం లేదు. విరామం ఎరుగని కృషి ఉంటుంది. స్తోత్ర ప్రియులను. ఒక కంట కనిపెట్టండి. 'రోడ్డు ప్రమాద' మున్నది, జాగ్రత్త అవసరం. స్త్రీలకు: సాధ్యమైనంతలో ప్రయాణాలు ఆపుకోవటం శ్రేష్ఠం.

★ **కన్య :** అప్పులివ్వటంగాని, అధికంగా పెట్టుబడులు పెట్టటం గాని, 'జాయింటు' వ్యాపారం చేయటంగాని, నూతన వ్యాపారమందు ప్రవేశించుటగాని ఈ వారం ఎంత మాత్రం తగదు. గ్రంథ రచనయందు, పత్రికాలేఖనయందు, కొందరకు సదవకాశాలు లభ్యం కాగలవు. ఉద్యోగరీత్యా కించిత్తు మేలు సంభవించుటలో ఆక్షేపణ లేదు, స్త్రీలకు : చుట్టు ప్రక్కల వారితో నో, అధికారులతో నో గొడవలు రాకుండా చూచుకోవాలి.

★ **తుల :** అప్రయత్న ధనాదాయమున్నది. 'లాటరీ' లాంటి విషయాలలో విజయం సాధింపగలరు. వ్యాపారనిమిత్తం ఎవరినైనా డబ్బు అడగటం, సాధించుకొనుటకు యిది సమయంగాదు. కొంత ఓపిక పట్టటం అవసరం. స్త్రీలకు : చికాకులు, అనవసర వ్యయం.

★ **వృశ్చికం :** క్రితం చేసిన వ్యాపార యత్నాలు సానుకూలం కాగలవు. వ్యాపారమందు లాభం గడించుటకు అనువైన వారం. ఇల్లు మారటం గాని, ఉద్యోగమందు మార్పు రావటంగానీ మీరే గ్రహింపనున్నారు. ఒకరో యిద్దరో మిత్రులు సహాయానికి సాయపడగలరు గమనించండి. స్త్రీలకు. ఇంట శుభ కార్యాలోచనలు, ఉద్యోగమందు అభివృద్ధి.

★ **ధనుస్సు :** సరి సమానస్కులతోగాని మిత్రులతోగాని, బంధు వర్గీయులతోగాని, మాట పట్టింపులు రాగలవు. మేలు కోరిన వారు యింటికి రానున్నారని గ్రహించాలి. స్త్రీలకు వ్యవహార రంగాన, ఉద్యోగ రంగాన అభివృద్ధి సూచికం క్రయ విక్రయమందు మేలున్నది.

★ **మకరం :** మీకుగల వ్యవహార జ్ఞానం యితరులకు ఉపకరించగలదు. అలాగని కాలమంత వ్యయించకండి. కాలం అమూల్యం గదా! రాజకీయంగా చిక్కులుంటే పరిష్కరింపబడగలదు. గ్రహించండి. స్త్రీలకు: ఉద్యోగమందుగాని, వృత్తియందుగాని మార్పు రాగల అవకాశాలున్నాయి.

★ **కుంభం :** వ్యవహార రంగాన మేలున్నది. అప్రయత్నంగా ధనలబ్ధి, క్రయ విక్రయ లాభం, ధనవంతుల సహాయ సంపత్తులు, వృత్తియందు అనుకూలం, ప్రయాణ మూలక లాభం చేకూరగల సమయం. స్త్రీలకు : సుఖం, ఆనందం, ఆదాయం, సర్వ రంగానుకూలతగల వారం.

★ **మీనం :** నలుగురిలో మీకు ప్రతిష్ఠ రానున్న సమయం. పత్రికా రంగాన అధికావకాశాలుండగలవు. రాజకీయంగా, ఆటపాటలందు, నటనయందు ప్రావీణ్యం గల వారికి మేలు చేకూరుతుంది. విలువగల వస్తు సేకరణకు అవకాశమున్నది. శ్రమించుటలో ఏమాత్రం అశ్రద్ధ తగదు. స్త్రీలకు : నూతనాంశాలు గ్రహించటం, శుభ కార్యానుకూలత. కించిత్తు ద్రవ్యాదాయానికి అవకాశం గల వారం.

—విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి

సీరియల్

ఓ కోడలమ్మ కథ — అన్నపూర్ణ

(గత సంచిక తరువాయి)

మధు ఎలాంటి కోవకు చెందిన వ్యక్తో చిన్నతనంనుంచీ తెలుసు సుందరరామయ్యకు. నీతి నిజాయితీలకు నిలబడతాడు. అన్యాయాన్ని ఖండిస్తాడు. న్యాయం కోసం పోరాడుతాడు. ఆ సంగతి తెలిసే తన పునర్వివాహం గురించి ముందు వాడికి తెలియజేయలేదు. ఇంటికి వచ్చి ఒక కన్నె పిల్లకు జరిగిపోయిన అన్యాయం గురించి వాడు ఎంత వాపోయిందీ కళ్ళారా చూశాడు. అలాంటి కొడుకు ఉచ్ఛనీచాలను మరిచిపోతాడంటే తను నమ్మలేదు. అయినా తల్లిపోరు పడలేక అనుమానించి వెళ్ళి చూశాడు. నిజా నిజాలు తెలిసిపోయాయి.

ఇప్పుడు చదువులోకి దిగమని సలహా ఇస్తున్నాడు మధు అమృతకు. ఆ చదువు ఆమె జీవితానికి ఎంతో ఉపయోగకారిగా పనిచేస్తుందని ఉద్బోధిస్తున్నాడు... వాడి ఆలోచన, మాట్లాడే ప్రతిమాట ఎంతో విలువైనవిగా తోస్తున్నాయ్. రేపు ఎటువచ్చి ఎటుపోయినా చదువుకొనివుంటే అది అమృతను తప్పక ఆదుకొంటుంది... అదీగాకుండా ఆమె ఎప్పుడూ తన కళ్ళముందే మసలుతుంటే 'అయ్యో... అనవసరంగా ఓ కన్నె బ్రతుకు బలితీసుకున్నానేమో ?' అన్న బాధ తనని అనుక్షణం పట్టి పీడిస్తూంటుంది. అలా కాకుండా అమృత దూరంగా ఉంటుంటే తనకూ కొంత ఆవేదన తప్పుతుందేమో ?

మరి అమృత ఈ సలహాకు అంత సులభంగా అంగీకరిస్తుందా ? సంప్రదాయం, స్త్రీ ధర్మం, లోకం అంటుంది .. అది నిజమే. కాపురం చేసే భార్యను చదువులకని పట్నం పంపితే ఊళ్ళోవాళ్ళు తప్పు పడతారు. సుందర రామయ్యకు పిచ్చి పట్టింది అని హేళన చేస్తారు. వాళ్ళకు తమ ఇంటి పరిస్థితి, ద్వితీయ వివాహం చేసుకొని తను అనుభవిస్తున్న నరకయాతన అర్థం కాదు. సంగతి ఇది అని తను విడమరచి చెప్పనూలేడు... ఎవరు ఏ విధంగా ఊహాగానాలు చేసినా— చేసిన తప్పును పరిహరించుకోవాలన్నా, తను కొంత మనశ్శాంతిగా బ్రతకాలన్నా మధు మాట ప్రకారం అమృతను చదివించటమే ఉత్తమం.

అలా ఆలోచించాక సుందరరామయ్య మనసు ఎంతో తేలికపడినట్లైంది. ఆ వెంట మరేదో అనుభూతి లాంటిది— ఇలాంటి హాయిని ఈ మధ్య కాలంలో ఏనాడూ అనుభవించలేదు ఆయన.

అంతలో అమృత గదిలోకి వచ్చి రోజూలానే వేరే పక్కమీద పడుకొంది. మెలకువతోనేవున్నా ఆమెను మందలించకుండా కళ్ళు మూసుకొని పడుకున్నాడు సుందరరామయ్య.

మర్నాడు ఉదయం లేవగానే తనమనసులోని మాటను బయట పెట్టేద్దామనుకున్నాడు. ఐతే తను లేచే సరికే అమృత గదిలోంచి బయటికి వెళ్ళి నిత్య కార్యక్రమంలో నిమగ్నమైపోయింది. దాదాపు ఉదయం ఎనిమిది గంటలవేళ దైవ మందిరం ముందు నుంచీ లేచి— మందుగ్లాసు తీసుకొని భర్త దగ్గిరికి వచ్చింది.

ఆ సమయంలో నాంచారమ్మ బావిదగ్గర ఉంది. మధు షికార్‌కు వెళ్ళాడు. తన మాటను అమృత చెవిన పడెయ్యటానికి అదే మంచి అదునుగా భావించుకున్నాడు సుందరరామయ్య.

"అమృతా ! ఇప్పుడు నీ వయసెంత ?" అడిగాడు మందుగ్లాసు అందుకొంటూ.

"పదహారు వెళ్ళిపోయాయి..." చెప్పింది సందేహించకుండానే.

"మా మధు వయస్సెంతో తెలుసా ?"

"... ... ..."

"పంథొమ్మిది వెళ్ళి ఇరవై వచ్చాయి."

"అలాగా... మీరు మందు త్రాగండి"— ఆమె గుర్తు చేసేసరికి టక్కున గ్లాసులోని మందు నోట్లో వంపుకున్నాడు సుందరరామయ్య. ఖాళీ గ్లాసును క్రిందపెట్టి,

"అమృతా! నామీద నీకు విశ్వాసముందా?" అడిగాడు సూటిగా చూస్తూ.

"మీమీద నాకు పరిపూర్ణ విశ్వాస ముందండీ" అంది అమృత నిండు కంఠంతో.

"ఐతే నా మాట విని మధు సలహా ప్రకారం నడుచుకో... నువ్వు పట్నం వెళ్ళి ఫలానందుకు చదువుకోవాలని నేను ఉపన్యాసా లివ్వలేను. కానీ, నువ్వు చదువుకోవాలి. ఈ వాతావరణం, అనవసర వ్యాపకాలు— వీటినుంచీ దూరమైతే నీకూ మనశ్శాంతిగా ఉంటుంది. నీ గురించిన వ్యాకులత నాలోనూ తగ్గిపోతుంది. నువ్వు చదువు వ్యాపకంలోపడి కులాసాగా తిరుగుతుంటే చూడాలని ఉంది అమృతా !... ఇక నా అనారోగ్యం— అది సర్వసాధారణంగా మారిపోయింది. వండి పెట్టటానికి అమ్మ ఉంది. ఇంటి చాకిరీ చెయ్యటానికి పని మనుషులు ఉన్నారు. కాబట్టి నువ్వు నన్ను గురించీ, ఈ ఇంటిని గురించీ ఆలోచించవలసిన పనిలేదు... కాకపోతే లోకం— దాని ఇష్టం వచ్చినట్లు అది

జరిగిన కథ—3 : మూర్తి భార్య బలవంతంపై భార్య మణి, కుమారుడు ఉదయ్‌లో కలిసి కొండపాడు 'అమ్మ' ఆశ్రమానికి వెళతాడు. అక్కడ 'అమ్మ' భక్తుల ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు అతనికి నచ్చాయి. తన అనారోగ్యం గురించి ఆమెకు నివేదించుకొని ఆమె సలహా ప్రకారం ఆ ఆశ్రమంలోనే కొద్ది రోజులు ఉండను నిశ్చయించుకున్నాడు. పై విషయాలన్నీ స్నేహితుడు జగన్‌కు ఉత్తరం ద్వారా తెలియపరచి అతనిని ఒకసారి వచ్చి ఆశ్రమం దర్శించమని రాసాడు. ఆశ్రమానికి వచ్చిన జగన్ అమ్మను అమృతగా గుర్తిస్తాడు. అమృత తన విచిత్ర కథను మూర్తి దంపతుల కోరికపై చెప్పసాగింది — వేణుగోపాలస్వామి గుడిలో అర్చకుడు గోవిందయ్య కూతురు అమృత. ఊరి పెద్దల సలహాపై కూతురిని ఒక రెండవ పెళ్లివాడికి ఇచ్చి పెళ్లి జరిపించను అంగీకరిస్తాడు గోవిందయ్య. అమృత వివాహం రోగిష్టి అయిన సుందరరామయ్యతో జరిగిపోతోంది. చవితి కొడుకు మధుకి అమృతంటె జాలి. అతను ఆమెను చదువుకోమని ప్రోత్సహిస్తాడు. మధు, అమృత మాటలు చాటు నుంచి విన్న సుందరరామయ్య ఆలోచనలో పడ్డాడు.

అనుకోనీ మనలో మనకు కల్మాషాలు లేనప్పుడు ఎవరు ఏమనుకొంటే మాత్రం ఏం?''— అంటూ సర్వవిధాలా నచ్చచెప్పాడు సుందర రామయ్య.

అమృత భర్త మాటలు విని ఆలోచనలో పడినట్లు ఊరుకుంది. భార్య నిర్లిప్తత వహించ టంతో మరికొన్ని హామీలు ప్రకటించాడు సుందరరామయ్య.

పట్నంలో ఉండే ఏర్పాట్లు స్వయంగా తనే చేస్తానన్నాడు. నెలనెల అవసరమైనంత డబ్బు పంపుతానన్నాడు. ఆఖరికి పూర్వాచారపరాయణు లైన అమృత తండ్రి గోవిందయ్యకు, తన తల్లి నాంచారమ్మకు నచ్చచెప్పే బాధ్యతకూడా తనే నెత్తిన వేసుకున్నాడు.

అయినా పెదవి విప్పలేదు అమృత. ఆ మౌనం ఆమె అంగీకారానికి సూచనగా భావించు కున్నాడు సుందరరామయ్య.

విషయం తెలిసిన మధు ఆనందానికి అవధులే లేవు. తండ్రిది ఎంతటి ఔన్నత్య హృదయమో అప్పుడే తెలిసింది అతడికి ... కాకపోతే పెద్ద ఘటం నాంచారమ్మ మాత్రం ఈ సందర్భంలో కొడుకు, మనవడు ఎంత నచ్చచెప్పినా రాజీకి రాలేకపోతోంది.

లోకం, వంశం, పరువు, ప్రతిష్ఠ, ధర్మం అంటూ కంఠశోష వచ్చేట్లు వల్లెవేస్తూనే ఉంది వాట్నే. ఎంతైనా తన నిర్ణయం మార్చే ప్రసక్తిలేదని ఖండితంగా చెప్పేశాడు సుందర రామయ్య. తండ్రికి వత్తాసు పలికాడు మధు. ఎటూ మాట్లాడలేని నిస్సహాయ స్థితిలో పడి పోయింది అమృత.

చివరికి విసిగిపోయిన నాంచారమ్మ, ''ఏదో పెద్దదాన్ని. నాకు తోచిందేదో నేను చెప్పాను. తర్వాత మీ ఇష్టం. ఎవరు ఎందులో దూకినా నాకు నిమిత్తంలేదు'' అని అనేసి ఊరుకొంది. తర్వాత కోడలు, చదువు— ఆ విషయంలో కలుగ జేసుకోనేలేదు ఆవిడ.

9

అమృత పుట్టింది ఒక పల్లెటూళ్ళో. పెరిగింది ఛాందసవైదిక కుటుంబంలో. అక్కడి వాతావరణము, కట్టుబాట్లే ఆమెకు తెలుసు. పట్టణాల పేర్లు విన్నదేగాని ఎక్కడికీ వెళ్ళలేదు, ఆ హడావిడీ జీవితాన్ని చూడలేదు. తమ ప్రక్క గ్రామంలోనే ఒక టూరింగ్ టాకీసు ఉండటం మూలాన కొన్ని సినిమాలు మాత్రం చూసింది. పూర్తిగా గ్రాహ్యకం రాకముందే తల్లి చనిపోవటంతో ఇంటి పనులలో రాటు తేలింది. అన్ని పనులు చేసుకుంటూనే తమ ఊళ్ళో ఉన్నంతవరకు చదువుకుంది. తర్వాత అక్కడ చదువు లేకపోవడం ఈలోగా పెద్దమనిషి కూడా అవటంతో దానికి అంతటితో ఫుల్‌స్టాప్ పడింది. చిత్రమేమిటోగానీ అమృతకు చిన్నతనం నుంచీ దేవుడంటే తగని భక్తి. తల్లి చనిపోయిన దగ్గర్నుంచీ ఆమె మనసుకు ఒకటే అశాంతి. దాన్నుంచీ తప్పుకోవటం కోసం ప్రతిరోజూ సాయంకాలం పూట తండ్రితోపాటే కొండమీదికి వెళ్ళి — గంటల తరబడీ కూర్చునేది. మనసుకు ఇంకా అశాంతిగా తోచినప్పుడు వెళ్ళి ఆలయ మంటపంలో కళ్ళు మూసుకొని కూర్చొని ఈ లోకాన్నే మరిచిపోయేది. అప్పుడు ఆమె కళ్ళ ముందు వేణుగోపాలస్వామి నర్తిస్తున్నట్లు, తను ఆయనతో తాదాత్మ్యం చెందుతున్నట్లు అనుభూతి చెందేది. అది వేరే విషయం.

ఇప్పుడు పట్నంలో ఉంటూ, ట్యుటోరియల్ కాలేజీలో చేరి చదువుకొంటూ — సిటీ వాతావరణానికి అలవాటు పడుతున్నా అమృతలో ఆ దైవ భక్తి అంతరించిపోలేదు ... ఈ విషయంలో మాత్రం ఆమెతో ఏకీభవించలేక పోతున్నాడు మధు.

''పిన్నీ! తెల్లవారుఝామునే లేస్తున్నావ్. చన్నీళ్ళతో స్నానం చేస్తున్నావ్. హెల్త్



పాయింటాఫ్‌వ్యూలో చూస్తే అంతవరకు మంచిదే. ఐతే ఆ దైవమంటపం ముందు గంటల తరబడీ కూర్చోవటమేమిటి ?... నా మాటేమో గాని ఎవరైనా చూస్తే మాత్రం పగలబడి నవ్వు కుంటారు. నువ్వు ఛాందసాలన్నీ వదిలేసుకోవాలి పిన్నీ.''

''ఛాందసాలకు పోవటానికి నేనేమీ మీ బామ్మగార్ని కాదులే మధుబాబూ.''

''మా బామ్మ ఛాందసాలకు పోయినా అందులో అర్థం ఉంది పిన్నీ. ఎందుకంటే ఆవిడ వెనుకటి తరానికి చెందిన మనిషి. మరి నువ్వు ? పట్నంలో ఉంటూ, పదిమంది మధ్య మసలు కుంటూ కూడా— భక్తి ముక్తి అంటూ మూఢ త్వానికి పోతావేమిటి ?''

''దైవాన్ని స్మరించుకోవటం ఛాందసము కాదు. మూఢత్వం అంతకంటే కాదు... మనిషి తనని తాను అదుపులో పెట్టికోవాలంటే ఏకాగ్రత, దృఢచిత్తం అవసరమని నేను భావిస్తాను. వాట్ని సంపాదించటానికి భగవంతుణ్ణి నమ్ముకోవటం వినా ప్రత్యామ్నాయం లేదన్నది నా విశ్వాసం... అదీ కాకుండా దైవ ధ్యానంవల్ల మనసునకు ఎంత ప్రశాంతత లభించేదీ నీకు తెలియదు మధుబాబూ.''

ఆమె వాదనతో ఏకీభవించక పోయినా అంతటితో వదిలేసి ఊరుకున్నాడు ఆ విషయాన్ని.

ఇక చదువు విషయంలో అమృత మేధాశక్తిని

ఒక అమ్మ కథ

చూస్తుంటే మధుకే ఆశ్చర్యం కలుగుతోంది. రాత్రి పది గంటలయ్యేసరికి అతడికి ఆవలింతలు మొదలుపెడతాయ్ గానీ, అమృత ముఖంలో అలసట అనేదే కనిపించదు... మార్చి పరీక్షలో పిన్ని తప్పకుండా ప్యాసౌతుంది—ఈ విషయంలో మాత్రం గట్టి నమ్మకం ఏర్పడింది మధుకు.

సుందరరామయ్య అమృతకు మాట ఇచ్చిన ప్రకారమే నడుచుకున్నాడు. ఆమె తండ్రి గోవిందయ్యకు నచ్చచెప్పాడు. స్వయంగా తనే వచ్చి పట్నంలో అన్ని సౌకర్యాలు ఉన్న ఇల్లు చూసిపెట్టి— ఎలాంటి సంకోచం లేకుండానే మధుతోపాటు ఆమెనూ ఉండమన్నాడు ఆ ఇంట్లో. తను ఒక వారంరోజులపాటు అక్కడ ఉండి మరీ తన స్వగ్రామం వెళ్ళిపోయాడు ... అమృతను మంచి ట్యుటోరియల్ కాలేజీలో చేర్పించాడు మధు.

10

ఆరోజు ఆదివారం.

''ఏదైనా పిక్చర్‌కు వెళ్దామా పిన్నీ ?'' అడిగాడు మధు ఉదయం పూట.

పట్నం వచ్చిన తర్వాత ఒక్క సినిమానే చూసింది అమృత ఇంతవరకు. అదీ సుందర రామయ్య ఉన్నప్పుడు మధుతో కలిసి ముగ్గురూ వెళ్ళారు. ఇప్పుడు అతడు అడిగేసరికి కాదనలేక ''సరేలే మధుబాబూ'' అంది.

''మ్యాట్నీకి వెళ్దాం. రాత్రి మన చదువుకు ఇబ్బంది ఉండదు'' అంటే ''అలాగే'' అంది అమృత.

సినిమా టైమ్‌కు రిక్షా తీసుకువచ్చాడు మధు వెళ్ళి... అమృత దానిలో ఎక్కి కూర్చున్న తర్వాత ఏమిటో టక్కున గుర్తువచ్చినట్లు ఆగి పోయాడు. తను ప్రక్కన కూర్చుంటే పిన్ని ఎలా అర్థం చేసుకుంటుంది ? చూసేవాళ్ళు ఏమను కుంటారు ?... థియేటరు దూరమని అనాలో చితంగా రిక్షాను పిలిచాడు. ఇద్దరూ సరదాగా నడిచిపోయినా ఇబ్బంది ఉండకపోవును...

''కూర్చో మధుబాబూ ...'' అంటూ రిక్షాలో తన పక్కసీటు చూపించింది అమృత.

దాంతో అన్ని సందేహాలనూ ప్రక్కకునెట్టి చటుక్కున తనూ రిక్షా ఎక్కాడు మధు.

వీళ్లిద్దరూ రిక్షాలో ప్రక్క ప్రక్కన కూర్చొని ఎటో వెళుతూండటం ఇరుగు పొరుగు కొందరు చూశారు.

టిక్కెట్లు తీసుకొని థియేటర్ లోపలికి వెళ్ళేసరికి న్యూస్‌రీలు మొదలైంది. అక్కడా పక్కపక్క సీట్లలోనే కూర్చున్నారు అమృత, మధు.

రిక్షాలో ప్రయాణం చేస్తున్నప్పుడేమిటి, థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు కూడా

మధు ఆలోచిస్తూనే ఉన్నాడు. 'ప్రక్కప్రక్కనే కూర్చున్న తనను, పిన్నిని అన్నాచెల్లెళ్ళు అనుకున్నా పరవాలేదు కానీ ప్రేయసీప్రియులు అనుకొంటేనే ప్రమాదం ... అదేమిటో పిన్ని ప్రక్కనే కూర్చోని, ఆమె స్పర్శ తగులుతుంటే, తన శరీరం అదోలా ప్రవర్తన చెందుతోంది ... మొత్తానికి నరకయాతనే ... సినిమా త్వరగా ఐపోతే బావుణ్ణు ... ఇంటికి వెళ్ళేటప్పుడు మాత్రం నడిపించే తీసుకువెళ్ళాలి పిన్నిని' అని అనుకున్నాడు. మధు తన ప్రక్కన కూర్చొని ఇబ్బంది పీలవటాన్ని ఒక కంట గమనిస్తూనే ఉంది అమృత.

సినిమా ఐపోయాక "చల్లగాలికి... నడిచి వెళ్తేనే బావుంటుంది పిన్నీ" అన్నాడు మధు.

అభ్యంతరం చెప్పలేదు అమృత.

కొంతదూరం నడిచాక, "ఏయ్ అమృతా!" అన్న ఎవరిదో పిలుపు వినపడి టక్కున ఆగిపోయి అటు చూశారు ఇద్దరూ.

చూస్తే – రాజారావు! స్టైయిలిష్‌గా సిగరెట్ పట్టుకొని దగ్గిరికి వచ్చాడు.

"నేను గుర్తున్నానా మరిచేపోయావా ?" అడిగాడు ఎగతాళిగా చూస్తూ.

"మన ఊరు గుర్తున్నంతవరకూ నిన్ను మరిచిపోవటం జరగదు" అంది అమృత.

"నువ్వు పెళ్ళిచేసుకుంది ముసలివాణ్ణి కద ? ... మరి ఇతడు ? ... ఓ ! మిమ్మల్ని ఎక్కడో చూసినట్లు జ్ఞాపకం."

"మనం చదివేది ఒక కాలేజీలోనే. నేను బి. ఎ. ఫైనలియర్ స్టూడెంటును. మిమ్మల్ని నేను చూస్తూనే ఉన్నాను ... కానీ, మిస్టర్ ! మీరు మాట్లాడేది ఎడ్యుకెటెడ్ లాంగ్వేజి కాదనుకుంటాను ?"

"ఓకె ! నేను పొరబాటుగా మాట్లాడితే క్షమించు. ఇంతకూ ఈ పిట్టను ఎక్కణ్ణుంచీ కొట్టుకువచ్చావ్ ?"

"ఏంకూశావురా, మా పిన్నిని పట్టుకొని" అంటూ రాజారావు షర్ట్‌కాలర్ పట్టుకోబోయాడు మధు.

"న డి బ జా రు లో ఏమిటిది ? ఆగు మ ధు బా బూ" అని మధును వారించి, "తెలిసిందిగా రాజా, అతడెవరో, నేనెవరో – ఇద్దరం ఎవరికి ఏమౌతామో ?... మరెప్పుడూ ఎవరి విషయంలోనూ తొందరపడి మాట్లాడకు. అది నీకే మంచిది కాదు." అంటూ హెచ్చరించి ముందుకు అడుగువేసింది అమృత. ఆమెను అనుసరించాడు మధు.

రాత్రి భోజనాలకు కూర్చున్నప్పుడు ఆరోజు గాము చూసిన సినిమాలోని ఒక సన్నివేశాన్ని ప్రస్తావించింది అమృత. "నువ్వు చెప్పిన సంఘటన మనం చూసిన సినిమాలో ఎక్కడ ఉంది పిన్నీ ?" అని టక్కున అడిగేశాడు మధు.

దాంతో పెద్దగా నవ్వింది అమృత. ఉడికి పడ్డాడు మధు.

"నాకు తెలుసు మధుబాబూ ... నువ్వు ఈ రోజు కాన్సంట్రేట్‌గా సినిమా చూడలేక పోయావ్. అది ధృవపర్చుకోవటానికే ఇప్పుడు నేను దాని ప్రస్తావన తెచ్చింది ... మధ్యాహ్నం సినిమాకు వెళ్ళేటప్పుడు రిక్షాలో నా ప్రక్కన కూర్చొని ఎంతో ఇబ్బందిపడ్డావు. అదే అవస్థను థియేటర్‌లోనూ అనుభవించావ్. అనవసరమైన ఆలోచనలు మనసునిండా మూగినప్పుడు నువ్వింక సినిమా ఏం చూస్తావ్ ? ... మనల్ని మనం అదుపులో పెట్టుకోగలిగిననాడు ఇటువంటి సందర్భాలు ఎదురవవు మధుబాబూ ... నా సిద్ధాంతం ప్రకారం మనం ఎవరికీ – ఆఖరికి భగవంతుడికికూడా ఋడవనక్కరలేదు. అయితే ఆత్మ, అది విధించే శిక్షకు మాత్రం భయపడి తీరాలి. మరి నేనూ వయసులో ఉన్నదాన్నే ...నీ ప్రక్కన రిక్షాలో కూర్చున్నాను, థియేటర్‌లో కూర్చున్నాను. అయినా నా మనసు పాడవలేదు. హాయిగానే సినిమా చూశాను ... ?"

"నిజమే పిన్నీ ... ఏవో ఆ శ యా లు, ఆదర్శాలు ఉన్నా– నాలోనూ కొన్ని బలహీనతలు ఉన్నాయని ఈ రోజు అనుభవం చెప్పింది. సాధ్యమైనంతవరకు వాట్ని నానుంచీ పారద్రోల టానికి ప్రయత్నిస్తాను" అని అన్నాడు మధు లజ్జగా తల వంచుకొని. తృప్తిగా చూసింది అమృత అతడివైపు.

11

మరో రోజు సాయంత్రం –

అప్పుడు మధు ఇంట్లోనే ఉన్నాడు. ఇంటి వెనుక బావిలో నీళ్ళు చేదుతోంది అమృత. ఆ సమయంలో హఠాత్తుగా పక్కమేడవైపునుంచీ ఒక రాయి వచ్చిపడింది ఆమెకు దగ్గిరగా. దానికి ఒక కాగితం చుట్టి ఉంది.


అది గమనించిన అమృత దాన్ని చేతిలోకి తీసుకొని మేడవైపు చూసింది. ఎవరూ కనిపించ లేదు. నీళ్ళు చేదటం ఆపుచేసి విషయమేమిటో తెలుసుకుందామని కాగితాన్ని విప్పింది.

"అమృతగారూ!

మీ పేరు నాకు ఎలా తెలిసిపోయిందా అని ఆశ్చర్యపడకండి. ఒక్క పేరేకాదు. మీ ముందు వెనుకల చరిత్రనుకూడా చెప్పేయ గ ల ను. శ్రమపడి అన్నీ వాకబు చేశానుమరి! ... కావలసినంత ఆస్తి, వృద్ధుడైన భర్త – పల్లెటూళ్ళో మీ మనసు అదుపు దప్పి, లేనిపోని అప్రదిష్ట వచ్చిపడుతుందేమోనన్న భయంతో చదువు నెపాన మిమ్మల్ని ఈ వాతావరణంలోకి తీసుకువచ్చి పడేశారు మీ భర్తవాళ్ళు. ఇక మధు నాకు క్లాస్‌మేట్ మా మధ్య కొద్దిగా స్నేహం కూడా ఉంది. అతడు బు ద్ధి మం తు డు. వయసులో ఉన్నవాళ్ళే అయినా, వావి వరుసలను బట్టి మీరు నీతినియమాలను అతిక్రమించలేదు. నాకు తెలుసు.

కాటికి కాళ్ళు చాచిన వ్యక్తికి అపురూపమైన మిమ్మల్ని అంటగట్టటం– నాకే అధికారం ఉంటే మీ పెద్దల్ని నిర్దాక్షిణ్యంగా షూట్‌చేసేసే వాణ్ణి. నిజంగా మీకు జరిగిన అన్యాయం తలుచుకుంటుంటే నాకెంతో మనస్తాపం కలుగుతోందంటే నమ్మండి ... ఈ వయసులో స్త్రీ సహజంగా జనించే కోర్కెలతో అనుక్షణం మీరు అనుభవించే నరకయాతనను నేను ఊహించుకోగలను, అర్థం చేసుకోగలను. అందుకే మీరంటే నాకు ఎంతో జాలి, సానుభూతి. నా మనసులోని మాటను మీ ముందుంచటం కోసమే ఈ ఉత్తరం వ్రాయటం జరుగుతోంది.

మరి– నన్ను గురించి చెప్పుకోవాలంటే – నా పేరు ఆనంద్. ఒక సంపన్నుల ఇంటి ఆశా కిరణాన్ని. మాది ఇక్కడికి దగ్గిరలోనే ఉన్న పల్లెటూరు. చదువును గురించి ఈ ఊళ్ళో ఉంటున్నాను. హోటల్ భోజనం, మఠం నిద్ర అన్నట్లు కాలం గడుపుతున్నాను... ప్రతిరోజూ



ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా చూస్తూనే ఉన్నాను మేడమీది నాగది కిటికీ లోంచి... మీ అందాన్ని వర్ణించటానికి నేను కవిని కాను. ఐనా మీ విశాల నేత్రాలను వర్ణించుకుంటూనే ఉంటాను...ఇప్పుడు కనులు మూసినా తెరిచినా మీరే కనిపిస్తున్నారు నాకు. హృదయంలో ఏమిటో చెప్పలేని ఆరాటం, తపన !— మనస్ఫూర్తిగా అంగీకరిస్తే మిమ్మల్ని తిరిగి పెళ్ళాడటానికైనా నేను సిద్ధమే. అవసరమైతే మీ కోసం ఈ లోకాన్నే ఎదిరించగలను, నా వాళ్ళందర్నీ త్యాగం చేయగలను. ఆ తెగువ నాలో ఉంది ! దీనిపై మీ అభిప్రాయమేమిటో ఒక కాగితం మీద వ్రాసి మా ప్రహరీ గోడ మీద పెట్టండి. మరో మాట — నేనిలా ఉత్తరం వ్రాసినట్లు మధుకు తెలియనివ్వకండి. తెలిసీ నన్నేమీ చేయలేకపోయినా లోలోపల కుమిలి పోతాడు... మీ సమాధానం కోసం ఎదురుచూసే,

ఆనంద్.''

ఆ ఉత్తరం చదువుకున్న అమృత ఏవిధంగానూ చలించిపోలేదు. పైగా తనలో తాను నవ్వుకొంది.

బావి దగ్గిర పని ముగించుకొని ఇంట్లోకి వెళ్ళిన తర్వాత, ''ఏం మధుబాబూ, ఆనంద్ నీకు స్నేహితుడేనా ?'' అడిగింది, అనుమానం తీర్చుకోవటానికి.

''ఔను పిన్నీ !... మన పక్క మేడలోనే అద్దెకు ఉంటున్నాడు అతడు'' చెప్పాడు మామూలుగానే.

''ప్రక్కప్రక్కనే ఉంటున్నా కూడా — ఒక్కసారీ అతణ్ణి మన ఇంటికి తీసుకురాలేదేం?''

''ఎంతటి స్నేహమైనా — అది బయటి వరకే పరిమితం పిన్నీ'' అన్నాడు పైకి. తప్పితే 'నీకు ఇబ్బందిగా ఉంటుందనే ఈ మధ్య నా స్నేహితులెవ్వరినీ మన ఇంటికి తీసుకు రావటం లేదు' అని చెప్పలేకపోయాడు మధు.

అమృత కొద్దిసేపు మౌనంగా నిలబడిపోయింది. ఈలోగా —

''ఇంతకూ ఆనంద్ నీకు ఎలా తెలుసు పిన్నీ, అతణ్ణి గురించి అడుగుతున్నావ్ ?'' అడిగాడు గుర్తువచ్చి.

''... చూడు ఈ ఉత్తరం ?'' అంటూ చేతిలో నలిగిపోతున్న కాగితాన్ని మధుకు అందించింది.

సంగతి తెలిసిన అతడు ఉగ్రుడైపోయి, ''నువ్వు ఎవరో, నాకు ఏమౌతావో తెలిసి గూడా అసభ్యంగా ప్రవర్తిస్తాడా? నీకు ఉత్తరం వ్రాస్తాడా ఇడియట్ ! ఇప్పుడే వాడిసంగతి ఏమిటో తెలుస్తాను ఉండు పిన్నీ'' అంటూ బయటికి పరుగు తీయబోయాడు.

అతడి ఆ ఉద్రేకాన్ని చూసి, రాబోయే ఉపద్రవాన్ని ఊహించుకున్న అమృత, ''ఆగు ... వెళ్ళకు మధుబాబూ'' అని గట్టిగా అరిచింది. అంతటితో ఆగాడు మధు.

''నీకు ఉత్తరం ఇచ్చింది ఆవేశపడటానికీ కాదు; నీ ద్వారా అతడిపై ప్రతీకారం తీర్చుకోవటానికీ కాదు... అసలు ఇది నా వ్యక్తిగత సమస్య. ఆనంద్ ఉత్తరం వ్రాసింది నాకు కాబట్టి అతడికి తగిన సమాధానం చెప్పవలసిన బాధ్యత నాది.'' అంది దృఢంగా.

ఆమె మాటలకు కొయ్యబారిపోయాడు మధు.

''స్త్రీనైనా నేనూ ఒక వ్యక్తినే. నాకూ వ్యక్తిత్వం ఉంది. దాన్ని గుర్తించగలిగితే నేను చెప్పినట్లు చెయ్యి మధుబాబూ'' అంది అమృత.

''ఏం చెయ్యమంటావో చెప్పు పిన్నీ'' — అయోమయంగా ఒక కుర్చీలో కూలబడ్డాడు.

''రేపు ఆనంద్‌ను మన ఇంటికి తీసుకు రావాలి... అతడితో కొంచెం మాట్లాడాలి.''

''ఆనంద్‌ను మన ఇంటికి తీసుకురావటం. అతడితో నువ్వు మాట్లాడటం ! నీకేమైనా మతిపోయిందా పిన్నీ ?''

''చెప్పినట్లే చేస్తానని అంతలోనే విపరీతార్థాలు తీసావేం మధుబాబూ ?''

''చేసింది పాడుపని అని తెలిసి—నేను పిలవగానే నమ్మి మన ఇంటికి వస్తాడా వాడు ?''

''నేను రమ్మన్నానని చెప్పు. తప్పకుండా వస్తాడు.''

''సరే ప్రయత్నిస్తాను. ఒకవేళ నువ్వు నోటి మాటలతో వాడికి బుద్ధిచెప్పగలననుకొంటే అది కేవలం భ్రమగానే మిగిలిపోతుంది పిన్నీ .. ఏమాత్రం ఇంగితజ్ఞానం లేనివాళ్లకు నీలాంటి, నాలాంటివాళ్ల మాటలు రుచించవ్.'' అని ఊరుకున్నాడు.

అమృత మధు చేతిలోని కాగితాన్ని తిరిగి తీసుకొని లోపలికి వెళ్లింది.

రోజూ సాయంత్రం ఏడుగంటలయ్యేసరికి వంట పూర్తిచేసి పెడుతుంది అమృత. తర్వాత చదువుకోవటం— ''ఇక భోంచేద్దాం పిన్నీ'' అని మధు అనేదాకా లేవదు. ఇద్దరూ భోంచేసి పడుకొనేసరికి రాత్రి పదిగంటలు దాటుతుంది. అమృత గదిలో పడుకుంటుంది. మధు హాలులో పడుకుంటాడు.

ఆరోజూ నిత్యకార్యక్రమం అంతే జరిగింది. ఐతే మధు మాత్రం ఆవేళ మనసు లగ్నంచేసి చదవలేకపోయాడు. అమృత మాత్రం ప్రశాంత చిత్తంతో చదువుకొంది.

12

''మా పిన్ని ఈవేళ సాయంత్రం నిన్నొకసారి వచ్చి కనుపించమన్నది ఆనంద్ !''

'ఆ మెసేజ్ అందించింది అసలు మధేనా!' అని అతడ్ని నఖశిఖ పర్యంతం చూశాడు ఆనంద్ చూస్తే—అతడు నిజంగానే మధు ! వీడు తనని ఇంత మర్యాదగా, మన్ననగా వాళ్ల ఇంటికి పిలుస్తున్నాడంటే అక్కడ గొప్పగా సన్మానించటానికి కాదుకద ? 'అయ్య బాబోయ్ ! వీడికి తన ఉత్తర ప్రహసనం తెలిసిపోయినట్లు ఉంది. ఏంకొంప ములుగుతుందో ఏమో !' పెద్ద సందేహంలోపడి వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు.

''సమాధానం చెప్పవేం ఆనంద్ ?'' రెట్టించాడు మధు. నిజానికి అతడి మనసు ఆవేశంతో ఎంత కుతకుత ఉడికిపోతోందో ? ఐతే తన పిన్నికి ఇచ్చిన మాటకు కట్టుబడి తప్పనిసరై మాట్లాడుతున్నాడు.

''నన్ను మీ పిన్నిగారు రమ్మనమన్నదా ! ఆవిడకు నేనెలాతెలుసు మధూ'' అన్నాడు ఆనంద్ అమాయకంగా ముఖంపెట్టి.

''నీకు తెలియదేమోగాని, మా పిన్నికి గొప్ప దివ్యదృష్టి ఉంది ఆనంద్ ! ... ఆవిడకు గత పరిచయం లేకపోయినా కర్మపరిపక్వం ఐంది అనుకున్న వాళ్లను తనంతటతానే పిలుస్తూంటుంది'' అన్నాడు మధు.

''జోక్ చేస్తున్నావా మధూ !''

''జోక్ లేదు ఏం లేదు... నిజం చెప్పాలంటే ఈ విషయంలో నాకేం తెలియదు ఆనంద్.. మా పిన్ని అంటే నాకు గౌరవం. ఆమె ఏది చెబితే అది చెయ్యటం వరకే నా డ్యూటీ. నీ పేరెలా తెలిసిందో ఏమో 'ఆనంద్‌ని ఒకసారి మన ఇంటికి తీసుకురా మధూ' అంది. ఎందుకని నేను అడగలేదు. ఫలానందుకని ఆమె చెప్పనూ లేదు.''

మధు చెప్పింది నిజమే ననుకున్నాడు ఆనంద్... 'ఒకవేళ ఏదైనా మోసం జరిగినా— వెనకాల కొండంత తన తండ్రి అండ ఉంది. ఇంక భయమేమిటి ?— అదీ కాకుండా మనసారా కోరుకున్న స్త్రీ— రమ్మని కబురంపితే వెళ్ళకపోవటం మగతనం అనిపించుకుంటుందా ?'— అలా ధైర్యం తెచ్చుకొని,

''ఓకె ! నీ మాట ప్రకారమే సాయంకాలం మీ ఇంటికి వస్తున్నాను మధూ'' అని అనేశాడు—

ఆనంద్ వైపు అదోలా చూసి వెళ్ళిపోయాడు మధు...

(ఇంకా వుంది)

అమెరికాని అల్లకల్లోలం చేస్తున్న సామూహిక హత్యలు!

ఇటీవల అమెరికాలోని సాన్‌డీగో సమీపంలో మెక్ డొనాల్డ్స్ హొటల్లో జేమ్సు హ్యూబర్టీ అనే 41 సంవత్సరాల ఒక కిరాతకుడు నిస్సహాయులైన వారిపై వందల రౌండ్లు కాల్పులు జరిపి 21 మందిని హతమార్చాడు. 15 మందిని తీవ్రంగా గాయ పర్చాడు.

బిగ్‌స్కై పర్వత ప్రాంతంలో ఒక పర్వతారోహకుడు, టీనేజ్‌లో ఉన్న అతని అన్నకుమారుడు కలసి ఒక యువతిని ఎత్తుకుపోయి ఒక మొద్దుకు అడ్డంగా కట్టి, వచ్చిన ఒకరిని చంపేసారు.

ఆల్బన్ కోలేమన్ అనే యువకుడు, తన స్నేహితురాలైన డెబ్రా బ్రౌనుతో కలసి, ఈవెన్స్టన్‌లో 7 వారాలపాటు ఎత్తుకుపోవడాలు, మానభంగాలు, ఏడు హత్యలు చేసాడు. ఆ జంటని పోలీసులు పట్టుకొన్నారు. హతమయిన ఏడుగురిలో నలుగురు 11 సం. దాటని బాలికలే!

ఈ విసుగూ, విరామంలేని హత్యలవల్ల అమెరికాలోని మామూలు పరిస్థితికి భంగం వాటిల్లింది. ఈ హత్యాకాండలో చనిపోయిన వారిలో ఎక్కువ మంది ముక్కు పచ్చలారని పిల్లలవడం మరీ విషాదంగా ఉంది. ఈ హత్యలన్నీ నట్ట నడుమ బజారులోని సంసార పక్షంగా ఉండే హొటళ్లలో, పర్వత ప్రాంతంలో జరగడం ఒక విశేషం. కొలెమన్ విషయంలో అయితే చనిపోయిన పిల్లల్లోని ఒకరింట్లోనే ఈ హింసా కాండ సాగింది

మూకుమ్మడి హత్యలు చేసిన హ్యూబర్టీ, ఆ దారుణ చర్యకు పాల్పడడానికి ముందు తన భార్యతో "నేను మానవ వేటకు వెళుతున్నాను" అని చెప్పాడట. మొలలో బెల్టుతో 9 మి. మీ. ల ఆటోమెటిక్ పిస్టల్, 12గేజ్ పంప్ షాట్‌గన్, 9మి.మీ.ల సెమి. ఆటోమేటిక్ తుపాకి భుజానికి ధరించి మానవహత్యోన్మాది అయిన హ్యూబర్టీ మెక్ డొనాల్డ్ హొటల్లోకి అడుగుపెట్టాడు. "అందరూ నేలపై పడుకోండి" అని ఒక కేక పెట్టి హొటలు చుట్టూ తిరుగుతూ అనేక సార్లు కాల్పులు జరిపాడు. మొదటి పది నిమిషాల్లోనే 20 మందిని హతమార్చాడు. వీరిలో పదకొండేళ్ల హెర్నాండెజ్ ప్రాణాలు మొదటి కాల్పుల్లోనే అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

ఈ కాల్పులులో శబ్దం ఎక్కువగా ఉండటం మూలాన ఒకరికన్నా ఎక్కువ మంది కాల్పులు జరుపుతున్నారేమో అని పోలీసులు అనుకున్నారు. అయితే ఒంటరిగాడైన హ్యూబర్టీ ఎవర్నీ నిర్బంధించలేదు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒక గుండు హ్యూబర్టీ గుండెల్లోంచి దూసుకు వెళ్ళింది నరహంతకుడు హ్యూబర్టీ నేల కొరిగాడు.

అక్కడ దృశ్యం హృదయవిదారకంగా ఉంది. ఒక తల్లి, తండ్రీ తమ బిడ్డను కాపాడ్డానికా అన్నట్టు ఆ బిడ్డపై అడ్డంగా పడుకొని ఉన్నారు కానీ ముగ్గురు మృత్యువాతబడ్డారు. వేరొక బిడ్డ ప్రాణాలతో ఉన్నా, పొట్టలో తీవ్రమైన గాయాలతో బాధ పడుతూ ఉన్నది. పోలీసు అధికారులలో ఒకరైన విలియమ్ కాలాండర్ మనసుని కలిచి వేసే ఈ సన్నివేశాన్ని చూచి "ఇటువంటి దృశ్యాన్ని తిరిగి నా జీవితంలో చూడ కుండా చూడు భగవంతుడా!" అని వేడుకున్నాడట

హ్యూబర్టీ పొరుగువాళ్ళు అతనిని ఒక కోపిష్టి అని, సాధారణంగా అతను భార్య, కూతుళ్లమీద కేకలు వేస్తుండేవాడని అన్నారు.



జేమ్సు హ్యూబర్టీ

హ్యూబర్టీ స్కూలు విద్యార్థిగా ఉన్నప్పుడే వాళ్ల తల్లి, తండ్రి విడాకులు పొందారు. ఇతను నిచియాలజీలో డిగ్రీ పొందాడు. అనేకమైన ఉద్యోగాలు మారి కడకు సాన్ సీడ్రో లో భద్రతాసిబ్బందిగా పనిలో చేరాడు. ఈ దారుణ మారణకాండ చేయకముందు అతను మానసిక రోగ వైద్యశాలలకు ఫోన్ చేసి అప్పాయింట్‌మెంట్ కోరాడని, జవాబుకోసం వేచి చూసాడని అతని భార్య చెప్పింది. మెక్ డొనాల్డ్స్‌లో సామూహిక హత్యలు జరిపిన రోజు అతని ఒక చిన్న నేరంపై కోర్టుకు హాజరయి జడ్జి ఫైను వేయకుండా వదిలేసినందుకు సంతోషించాడు తరువాత తన కుటుంబంతో కూడా హొటల్లో భోజనం చేసి సాన్ డీగో జూకి వెళ్లాడు. జూలో తనను ఖాతరు చేయనందుకు వైద్యశాల వారిపై కోపగించుకొని "సంఘంలో ఎవరి గొప్ప వారిది" అన్నాడు.

నేర, మానసిక శాస్త్రవేత్తలు ఆ వింత హత్యలకు కారణం ఇదమిద్ధంగా చెప్పలేకపోయినా చితికిపోయిన అతని తల్లి, తండ్రుల చరిత్ర ఇందుకు కారణమయి ఉండవచ్చని అన్నారు. అలాగే మరో కేసయిన డాన్ నికోలాస్ (53) అతని కుమారుడు డాన్ (19) 23 ఏండ్ల కారీ స్వెన్‌సన్‌ను (అమెరికన్ మహిళల బైయత్‌లాన్ బృందం సభ్యురాలు) ఎత్తుకుపోయి తాము డాన్‌కు భార్య అయ్యే అమ్మాయికోసం వెతుకుతున్నామన్నారు.


ఇక మూడో కేసయిన అల్బన్ కొలెమన్ లైంగిక చర్యలకు చరిత్ర సృష్టించాడు. ఇతను వేశ్యయైన తన తల్లిచే చిన్నతనంలోనే త్యజించబడ్డాడు. ఇతనికి ఇతరులని అర్థం చేసుకొనే శక్తి లేదు. తనేమనుకుంటే అది జరగాల్సిందే అన్న ప్రవృత్తి గలవాడు.

ఈవిధమైన ప్రవర్తనలకు మూల కారణం అణచివేయబడిన వారి భావోద్రిక్తతే! ఈవిధంగా అణచివేయబడిన కోపోద్రేకంలో వాళ్ళు ఎంతటి ఘాతుకాలకైన ఒడికడ్తారు. "తాము ఈ ప్రపంచాన్నే తమ ఆధీనంలో ఉంచుకోగలం" అని భావిస్తారని నార్త్ వెస్టర్న్ విశ్వ విద్యాలయంలోని మానసిక శాస్త్రవేత్త రిచర్డ్ రప్పార్ట్ పేర్కొన్నారు.

('టైమ్' ఆధారంగా.

మెక్ డొనాల్డ్స్ హొటల్లో జరిగిన మారణకాండలో గాయపడ్డ పసివానికి ప్రథమ చికిత్స చేస్తున్నప్పుడు రక్షణగా ఉన్న సాన్‌డీగో "స్వాట్" అధికారులు





మరోప్రేమ

డా॥ పోతుకూచి వెంకటేశ్వర్లు

ప్రతి రోజూలాగానే సాయంత్రం అయేటప్పటికి మా లక్ష్మి బడ్డీకొట్టు దగ్గరకు చేరాడు వెంకన్న.

అలనా పాలనా లేక వెంకన్న అలా వున్నాడు కాని, అదే యింటిపట్టున వున్నట్టయితే యీపాటికి వయసు పొంగుతో వస్తాదులా వుండాల్సింది. చిన్నతనంలోనే యింటి నుంచి పారిపోయి వచ్చి యీ వూళ్లో స్థిరపడ్డాడు. కష్టంతో కండలు పెంచలేకపోయాడు. అయినా నమ్మకస్థుడుగా ఆ సెంర్లో పేరుంది. పగలంతా ఏదో పని చేసుకుని సాయంత్రం వేళకు లక్ష్మి బడ్డీకొట్టు చేరుకుని ఓ పొగాకు పాయ తీసుకుని కొట్టు ముందున్న బల్లపై కూర్చుని రాజకీయాలనుంచి సినిమారంగం వరకు ఏదో వొకటి వాగుతూనే వుంటాడు.

ఓ మూల బేరం చూసుకుంటూనే లక్ష్మి యీడి మాటలు చేష్టలు గమనిస్తూనే వుంటుంది. లక్ష్మి వంటి మెరుపుచేతనో కళ్లల్లోని కాంతి చేతనో వయసులో వెంకన్న కన్నా పెద్దదే అయినా కండల బిగిసడలకపోవటంచేత నేవళంగానే కనబడుతుంది. ముచ్చటగా కొవ్వు కరగని ఆ విగ్రహం వయసు మళ్లిన వారిలో కోరికలు రగులుస్తుంది. వయసులో వున్న వాళ్లకి క్లైమాక్సిస్తుంది. కుర్రకారులో కోరికలు రేకెత్తిస్తుంది. అందుకే ఆ బడ్డీకొట్టుకు గిరాకీ; ముఖ్యంగా యువతరం అనుకునే వాళ్ళు అక్కడే బేరం చేస్తారు.

పైకి అలా అగుపించే లక్ష్మి మనసులో దిగులు సుళ్ళు తిరుగుతూనే వుంటుంది. అది ఎవరికి తెలుస్తుంది, ఎవరితో చెప్పుకుంది గనుక. పెళ్లయిందన్న పేరేగాని సూరిగాడితో సరిపడా సరసమాడింది తక్కువే! ఆడికి బుద్ధి కుదురుతే పగలు పనికి వెళ్తాడు – లేకపోతే కొట్టు కొనుకుని పాకలో తొంగుంటాడు. బేరమంతా లక్ష్మే చూసుకుంటుంది.

వాడి కార్యక్రమాల్లో ఠంచనుగా వుండేది వొక్కటే – సాయంత్రం అయేసరికి సారా అంగడికి వెళ్లి చిత్తుగా తాగి యిళ్ళు వొళ్ళు గుల్ల చేసుకోవటం.

అదేమిటో గాని ఆడు సారా కొట్టుకు చేరటం వెంకన్న బడ్డీకొట్టు చేరుకోవటం రివాజు. వెంకన్న యధాలాపంగా ఓ పొగాకు కాడ అందుకుని పాయి చీల్చి ఓపాయి బొడ్డులో దోపుకుని రెండోదాంతో సుతారంగా చుట్ట తయారు చేస్తాడు. అలవాటుగా అగ్గిపెట్టి అందిస్తుంది లక్ష్మి. అనుకోకుండానే ఆ చుట్టను మునిపళ్ల మధ్యలో యిరికించి కుడిచేత్తో అగ్గిపుల్ల గీసి వెడమచేయి గాలికి అడ్డుగా వుంచి చుట్ట వెలిగిస్తాడు. అగ్గిపెట్టె కొట్టులోకి విసిరి తుబుక్కున ఉమ్మేసి చుట్ట ఆరిపోకుండా చివర్న వేళ్లతో అదుముతూ చుట్టను గుండ్రంగా తిప్పుతూ గట్టిగా దమ్ములాగి గుండెల్లోంచి పొగ వొదుల్తూ చిటికన వేలుతో నుసి దులుపేస్తుంటే అడివంక తదేకంగా చూస్తూ – ఆ పొగ గుబురులో లక్ష్మి ఎన్నో వూహించుకుంటుంది.

ఆ రోజు అలాగే జరిగింది. యింతలో వెంకన్న మొదలెట్టాడు.


"ప్రేమనగర్" బొమ్మ చూసావంటే. అందులో నాగేశ్వరరావు పాట అదే – బిచ్చగాడిననుకున్నావా, ప్రేమ బిచ్చగాడి ననుకున్నావా? అని బలేగా చేసాడు కదూ? బిచ్చగాడంటే గుర్తొచ్చిందీ. అందులో

పిల్లదాని వంటి తెల్లదనం పరంపరాగతమా కేవలం—చెప్పవే ఓ మనసా!

మీ కళ్ల రంగు, ముఖ ఆకారం, మీ ఎత్తు, తెల్లని శరీర ఛాయ— ఇవన్నీ సాధారణంగా వంశపారంపర్యంగా వస్తాయి. మీకు తెల్లని వంటి ఛాయ వచ్చినా, అది అలాగే నిలిచి వుండకపోవచ్చు. దానికి కారణం, ఏళ్లు గడుస్తూన్న కొద్దీ మీరు నల్లబడుతూ ఉండటమే.

మీ చర్మం రంగును నిర్ణయించేది ఏమిటి?

మీ చర్మం లోపల మెలానిన్ అనే నల్లని రంగు పదార్థం వుంది ఇది చర్మంలో ఎంత ఎక్కువగా వ్యాపిస్తే మనుషులు అంత నల్లగా కనబడతారు. మీ చర్మం రంగు మీద ప్రభావం చూపే బయటి కారణాలు కూడా ఉన్నాయి. ఎండలో మీరు బయటకి వెళ్లినప్పుడు సూర్యరస్మిలోని అల్ట్రావ యొలెట్ కిరణాలు మిమ్మల్ని మరింత నల్లబరుస్తాయి.



వంటి చాయను పెంచడానికి సరియైన పద్ధతి ఏదైనా ఉందా?

ఉంది. మొట్టమొదటిసారిగా సాధించిన ఓ వైజ్ఞానిక విజయం ఫెయిర్ అండ్ లవ్లీ....నల్ల చర్మాన్ని తెల్లపరిచే క్రీమ్. ఇది మీ చర్మం నల్లబడటాన్ని అరికట్టి తిరిగి ఎర్రగా రంగు తేలేలా చేస్తుంది.

ఫెయిర్ అండ్ లవ్లీ ఎలా పనిచేస్తుంది?

లోపలా, బయటా 2 విధాలుగా.

చర్మం లోపల: ఫెయిర్ అండ్ లవ్లీ క్రీము చర్మం అడుగున మృదువుగా, సురక్షితంగా పనిచేసి, నల్లబడుతున్న చర్మం తిరిగి రంగు తేలేలాగ చేస్తుంది.


చర్మం బయట: ఫెయిర్ అండ్ లవ్లీలో గల 'సూర్యరస్మిని వడబోసే' ప్రత్యేక పదార్థాలు; అల్ట్రా వయొలెట్ కిరణాలు మీ చర్మాన్ని నల్లబరచకుండా అడ్డగిస్తాయి. అయినప్పటికీ, సూర్యరస్మిలోని ఆరోగ్యమంతటినీ మీరు పూర్తిగా పొందగలుగుతారు.

రంగు తేలడానికి కేవలం 6 వారాలు!

ఫెయిర్ అండ్ లవ్లీని ఆరు వారాలపాటు క్రమం తప్పకుండా రోజుకు రెండుసార్లు రాసుకోండి. మొదట చర్మంమీద కాస్త జిమజిమలాడవచ్చు. ఫెయిర్ అండ్ లవ్లీ పనిచేస్తున్నదనడానికి అది నిదర్శనం. ఆరు వారాల్లో ఖచ్చితమైన తేడా మీకు కన్పిస్తుంది, ఇతర్లకీ కన్పిస్తుంది. క్రమం తప్పకుండా వాడుతూ ఉండండి, ఫెయిర్ అండ్ లవ్లీ శరీర ఛాయలో అలాగే వుంటారు.

ఫెయిర్ అండ్ లవ్లీ గురించి మీరు మరిన్ని వివరాలు తెలుసుకోవాలనుకుంటే ఈ చిరునామాకు వ్రాయండి:

FAIR & LOVELY ADVISER,
P. O. BOX 758,
BOMBAY 400 021.



ఫెయిర్ అండ్ లవ్లీ
నల్ల చర్మాన్ని ఎర్రపరిచే క్రీమ్

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

ఇది సహజంగా, మృదువుగా మీ వంటి ఛాయను పెంపొందిస్తుంది.

LINTAS FALOV 31 2316 TL

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

డి. వి. ఆర్. – కాకినాడ

మంచి జోకు అంటే ఏమిటి?

★ మంచి జోకు మేకపిల్లలా కరవాలి గాని కుక్కలా కాదు.

జి. ఎన్. – విజయవాడ

ఏమీ చదవకుండా బి. ఏ. ప్రైవేటుగా కడితే విలువ లేదంటారు. నిజమేనా?

★ డిగ్రీకే విలువిచ్చే యీ రోజుల్లో ఎలా వచ్చినా దాని విలువ దానిదే. కాలేజీకి వెళ్ళి చదువుకున్న ఉత్సాహం వుండదు. అంతే తేడా. నాకు తెలిసి అంచె లంచెలుగా పైకి ప్రాకి – డాక్టరేట్లు తెచ్చుకుని ముఖ్య స్థానాలలో వున్న వారెందరో వున్నారు.... చదవండి.

కె. పి. ఎల్. – ఆళ్ళగడ్డ

పెళ్ళి ఎందుకు చేసుకోవాలి? పెళ్ళి చేసుకున్నప్పటి నుంచి నన్ను వేధిస్తున్న ప్రశ్న యిది?

★ పెళ్ళి చేసుకున్నాక యిలాంటి ప్రశ్న వేసుకోవడం దండగ. అసహ్యించు-కుంటూ ఏ పనీ చేయకూడదు. ముఖ్యంగా సంసారం.

కె. వి. ఆర్. – కాకినాడ

మీరు బి.సీనా? నిజం చెప్పండి.

★ నిజమేనయ్యా బ్రాహ్మణ కాస్టు!

కె. వి. ఆర్. – భీమారావుపేట

రానున్న పార్లమెంటు ఎన్నికలలో పోటీ చెయ్యకూడదా! తప్పక గెలుస్తారు.

★ ఎలా చెప్పకలరు స్వామీ?! రాజకీయాలంటే ఆషామాషీ కాదు- అదో పెద్ద పన్నాగం! నాకస్సలు సరిపడదు.

ఎమ్. ఎ. – న్యూఢిల్లీ

ముఖ చిత్రం మీద మీ ఫోటో వేస్తే?

★ పై వారం స్పెయికార్నరు తగ్గించాలి!

మీరింత రచయిత్రి కావటానికి కారణం మీ అమ్మా, నాన్నలేనా?

★ కాదు. గోరాశాస్త్రిలాంటి హితులు.

ఆడవారు వ్యభిచార గృహాలకి ఎందుకు బలి అయిపోతున్నారు?

★ దేనితోనైనా వ్యాపారం చేయకల ధీమాగల కొందరు వ్యాపారుల దయ-వలన.

మీరు ఢిల్లీ వచ్చినప్పుడు చాలా అందంగా వున్నారు. ఇప్పుడెలా వున్నారో?

★ అయ్యో! యింకా అందంగానే వుండి వుంటాను యిష్టమైన వారి కళ్ళకి!

జి. కె. ఆర్. – హిందూపూర్

కత్తికి కత్తే జవాబు, ముల్లుకి ముల్లే జవాబు సమాధానం అయినప్పుడు మాన-భంగానికి మానభంగమే జవాబు ఎందుకు కాకూడదు?

★ ఏం చేయాలంటారు? మానభంగం చేసినవాడి అక్కనో చెల్లెల్నో తల్లినో పెళ్లాన్నో- ఆమె అన్నో మొగుడో ప్రియుడో రేప్ చేస్తే- న్యాయం జరుగు-తుందా? ఇవన్నీ సినిమా సంఘటనలు.. జీవితం యింత భయంకరంగాను వుంటే- మనం ఆటవిక దశకు మరలినట్టు.

ఆర్. కె. – ఖమ్మం

ప్రేమించి మోసం చేసిన అమ్మాయిని ఏమనాలి?

★ ఏదో అనడం ఎందుకయ్యా, కాస్త దూరదృష్టి కల్గినదని- అనుకోకూడదూ?

ధాంశ్రీ. – భట్టిప్రోలు

అడగాలని వుంది. ఒకటడగాలని వుందీ....

★ ఆ ఒక్కటీ అడక్కు ధాంశ్రీ! లాభం లేదు.

జి. సి. డి. కె. – బుసావల్

మీ స్త్రీ పక్షపాత బుద్ధివలన స్త్రీ మీద వున్న సద్భావం మంట కలిసిపోతోంది...

★ ఎవరికి? మీకా?!.... మీ సద్భావం-నిజం వినగానే- మంట కలిసిపోయేటంత బలహీనమైనది కనుకనే- అలా అన గలిగారు.....

వై. ఆర్. కె. – శ్రీకాకుళం

కె. రా. గారూ హోమో సెక్సుయల్ అంటే ఏమిటి?

★ ఈ ప్రశ్న నన్ను కాదు అడగవలసింది- దాంపత్య దీపికకో ఏ సెక్సు పత్రికకో రాయండి- వివరిస్తారు!

ఎ. ఎ. కె. – అర్మూరు

అందరూ ఐకమత్యంగా కలిసి ముందడుగు వేసేది ఎప్పుడు?

★ అందరూ- కలిసి వేయలేనిదే- ముందడుగు. □

ఎన్ని రకాలనుకున్నావ్? తెలివితక్కువది "యింత కవళం పడెయ్యి తల్లీ, అంటి గడుసువాళ్ళు" "భవతీ బిక్షాందేహి" అంటే దీనులు దారుణంగా "రెండు రోజుల్నుంచి తిండిలేదు – డొక్కలు ఎండిపోయి-నాయి – నిన్నటినుంచి పిల్లాడికి పాలు యిద్దా-మంటే చుక్కకూడా చేపకుండా వుంది. యింత చల్ది పడేయ్యి తల్లీ" అంటూ ప్రాధేయ పూర్వకంగా మోక-రిల్లుతె"

వెంకన్న ఆగి చుట్ట నోట్లో పెట్టుకుని గుఫ్ గుఫ్మని దవడలు తాటిస్తూ లాగి గాండ్రించి వుమ్మేసి – తిరిగి "ధనికులు వీళ్ళని చూసి అహంకారులయితే యిది మామూలే అన్నట్టు 'గేటుబయటకుపో' ఉని అదిలిస్తారు లేదా కామ్గా కుక్కని వదులుతారు. స్తోమత వుండీ దానగుణం-లేని వారయితే 'ఛా – ఛా – గుండులా వున్నావ్-

మరో ప్రేమ

ఏదన్నా పని చేసుకోరాదు' అంటూ విదిలించు-కుంటారు. ఉన్నంతలో గొప్ప చూపెట్టుకోదలచిన కొందరు నాలుగు మెతుకులు విదులుస్తారు. శ్రీమంతులు కాకపోయినా కరుణ వున్న వాళ్ళు ఏదో నాలుగు గింజలు రాల్చటానికి ప్రయత్నిస్తారు. అదీ కుదరనప్పుడు గుడ్డ నిండా నీరు నింపుకుని నోట్లో గుడ్డ కుక్కుకుని తల ప్రక్కకు త్రిప్పుకుంటారు....'


'ఓరేయ్ యివన్నీ ఎందుకు గాని. యీ జన్మకి నీకిక పెళ్ళవదు- నాకు నలుసూ కలగదు గాని- మాతో వుండిపోరా.' అంటూ లక్ష్మి అదోలా చూసింది.

'అదేలా సాధ్యపడుతుందే– అటు లోకం– యిటు వీడు....' ఏదో చెప్పబోతుండగా ఓ నడి వయస్కుడు అటుగా వచ్చి 'సూరిగాడు ఆ సెంటర్లో రక్తం కక్కుకుని పడిపోయాడు– ప్రాణం వున్నట్టు లేదు' అంటూండగానే– అప్రయత్నంగా 'అమ్మా' అంటూ లక్ష్మి గుండెలమీద వొదిగిపోయిన వెంకన్న తలమీద అక్షింతల్లా రెండు కన్నీటి చుక్కలు "ఒరేయ్ వెంకన్నా– ఏడుస్తే ఏం లాభంరా? ఎంత ప్రయ-త్నించినా మామ ఆ అలవాటు మానకపోయె. జరగాల్సింది. 'లే– కొడుగ్గా నీవు చేయాల్సిన పని చెయ్యి'

అంతే తేరుకున్న వెంకన్న సూరిగాడి తలకి కొరివి పెట్టాడు.

లోకం ఆ యిద్దర్నీ ఎలా అర్థం చేసుకున్నా, ఏం అనుకున్నా ఆ రోజు నుంచి లక్ష్మి, వెంకన్న– తల్లీ కొడుకుల్లా ఆ గుడిసెలోనే వుండిపోయారు. □

మంచి వెలుతురు గుర్తించారు!
మారిపోండి హెచ్ఎమ్టీకి.



హెచ్ఎమ్టీతో నాణ్యత వెలుగుతూ వస్తుంది.
ఎందుకంటే, హెచ్ఎమ్టీలో మీరనుకున్నదానికంటే ఎన్నో అంచెలు ముందుగానే
నాణ్యతా నియంత్రణ మొదలవుతుంది.
అందుకే, ఈ లాంపుల తయారీలో వాడే విడి భాగాలన్నిటినీ హెచ్ఎమ్టీయే
స్వయంగా తయారు చేసుకుంటుంది.
అంతేకాదు, ఈ లాంపుల్ని తయారుచేసే యంత్రాలను కూడా తానే తయారుచేసుకుంటుంది.
సహజంగానే హెచ్ఎమ్టీ నాణ్యతలో ఆ ఆధిక్యత కనిపిస్తుంది.
75 కఠిన పరీక్షల మూలంగా, అత్యుత్తమమైనవి మాత్రమే నెగ్గి బయట
పడగలవని నమ్మకం కుదురుతుంది.
కనుక హెచ్ఎమ్టీ పేరుకోసం గుర్తుగా చూసుకోండి. అదొక్కటీ తనిఖీ
చేసుకున్నారంటే అన్ని తనిఖీలూ చేసుకున్నట్టే!
హెచ్ఎమ్టి బల్బులు, ఫ్లోరసెంట్ ట్యూబులు.

hmt Lamps

మీ జీవితంలో వెలుగు.

Sista's/HMT/77/84 Tel

సీరియల్

శ్రావణి



మాడుగుల కృష్ణకుమారి

32

(గత సంచిక తరువాయి)

"ఒరేయి కైలాష్ ! ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి. 'అసలు నీకీ వూళ్ళో ఒక స్నేహితుడు వున్నాడనీ, వాడు నీకోసం ఎప్పుడూ వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తూంటాడని నీకే మాత్రం ఆలోచన అయినా వుంటే ఇన్నాళ్ళకి ఇలా వస్తావుట్రా" నిష్టూరాలు ఆడుతూనే ఆప్యాయంగా కౌగలించుకున్నాడు మిత్రుడిని.

"నిజమేరా ఆ రోజుల్లో ఒక్కపూటయినా ఒకర్ని విడిచి మరొకరం వుండేవాళ్ళంకాదు. మరిన్ని రోజులు ఎలా వున్నామో నాక్కూ ఆశ్చర్యం గానేవుంది అసలు మనం ఆఖరిసారి కల్సుకున్నది నా పెళ్ళిలోనే అనుకుంటా" అన్నాడు కైలాష్ కూడా ఆనందంగా.

"నిన్ను చూసిన సంతోషంలో నాకేం గుర్తు రావటంలేదు కానీ, అమ్మా మనింటికి ఎవరువచ్చాడో చూడు" అని తల్లిని పిలిచాడు.

"ఎవరూ ?" అంది లోపలినుంచి వచ్చిన రమణమ్మ.

"నేనమ్మా కైలాష్‌ను. బాగున్నారా ? మా ఇద్దరినీ శివకేశవులు అని పిల్చేవారు, గుర్తుకు వచ్చానా ?" అన్నాడు ఆప్యాయంగా కైలాష్.

"ఆఁ ముసలిదాన్ని నేను బాగానే వున్నాను. కానీ మా శ్రీహరే ?" అని ఏదో చెప్పబోతున్న ఆవిడ మాటలకి అడ్డుపడుతూ రెండు కప్పులు కాఫీ కలపమని తల్లిని లోపలకి పంపించి స్నేహితుడితో కబుర్లకి దిగాడు శ్రీహరి.

"నువ్వేమిట్రా అలా చిక్కిపోయావు ? ఆరోగ్యం బాగుండలేదా ? అవును అసలు విషయమే మర్చిపోయాను. మీ శ్రీమతిని నాకు పరిచయం చెయ్యవా ?" అన్నాడు కైలాష్.

"పుట్టింటికి వెళ్ళింది" అని మాత్రం పొడిగా చెప్పి మళ్ళీ కబుర్లలో పడ్డాడు. శ్రీహరి ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతున్నా ఆ మాటల వెనుక దేనికోసమో బాధపడుతున్నట్లుగా తెల్సుకున్నాడు కైలాష్.

వెళ్ళేలోగా విషయం ఏమిటో తెల్సుకోవా లనుకున్నాడు. ఆ రాత్రి మిత్రులిద్దరూ డాబామీద పడుకున్నారు.

"ఉఁ ఇప్పుడు చెప్పు ఎలావుంది నీ సంసారం?" అన్నాడు శ్రీహరి.

"నాకేంరా బాగానేవున్నాను. నా సెలక్షన్‌లో ఏ మాత్రం తప్పటడుగు వెయ్యలేదని నా భార్య నిరూపించిందిరా. మా ఇద్దరి మధ్యా ఏ చిన్నమాటకి తేడా రాదు. మగవాడి జీవితం ఏ లోటు లేకుండా గడిచిపోవటానికి కారణం కట్టుకున్న భార్యేనని చెప్పవచ్చురా" అన్నాడు కైలాష్ పక్కమీదికి ఒరుగుతూ.

"పొరపాటు పడ్డావురా. ఆ గౌరవం నీ భార్యలా అందరూ ఆడవాళ్ళకి దక్కదు. దక్కినా దక్కించుకోలేరు కొందరు" అన్నాడు.

"ఏమిట్రా ఆడవాళ్ళ మీద అంత తీవ్రంగా ధ్వజమెత్తుతున్నావు ?" అన్నాడు కైలాష్ నవ్వుతూ.

"ఉన్నమాటే చెప్పానురా" అన్నాడు శ్రీహరి సిగరెట్ వెల్గిస్తూ.

"ఏమిట్రా మన పరిచయంలో లేని అలవాటు ఎప్పుడు నేర్చుకున్నావు ?" అన్నాడు ఆశ్చర్యంగా చూస్తూ.

"మనసుకి బాధ కల్గినపుడు శాంతి కల్గించే సాధనంరా" అన్నాడు.

"భార్య పుట్టింటికి వెడితేనే మనశ్శాంతి లేనివాడివి ఎందుకు పంపావురా. ఏమన్నా విశేషమా ?" అన్నాడు కుతూహలంగా.

"అదేం కాదురా. నేనే పంపిచేశాను" అన్నాడు నిర్వికారంగా.

"ఎందుకని ?" అన్నాడు చివాల్న లేచి కూర్చుంటూ కైలాష్.

"తల్లితో, భార్యతో కూడా చెప్పకోలేని కొన్ని సత్యాలు చెప్పకునేది ప్రాణస్నేహితుల దగ్గరేనన్న నిజం నిజంగా, నిజంరా" అంటూ తన భార్య గురించి జరిగిందంతా చెప్పాడు శ్రీహరి.

ఒక్కసారిగా దిగ్భ్రమ చెంది –

'ఆవిడ పేరు ?' అన్నాడు కైలాష్, ఆ పేరు అవకూడదు అనుకుంటూనే.

"శ్రావణి !"

అయితే తనింట్లో వున్నది శ్రీహరి భార్య శ్రావణన్నమాట. చాలా విచిత్రం. కానీ ఆమె తనింట్లో వున్నదని శ్రీహరికి చెప్పటం అంత మంచిపని కాదేమో.

"ఏమిట్రా ఆలోచన?" అన్నాడు శ్రీహరి.

"అయితే ఆవిడిప్పుడు పుట్టింట్లోనే వుందన్నమాట."

"అంతేగామరి. జీవితంలో నేకన్నకలలు, ఆశలు నమ్ము చేసే వెళ్ళిందిరా. కానీ ఆమె చాలా అమాయకురాలు. చేసిన పని మాత్రం ..."

"ఆవిడ కారెక్టరు మీద నీ అభిప్రాయం?" అన్నాడు కైలాష్.

"నాకు తెల్సినంతవరకు చాలా ఉత్తమ రాలురా. కానీ డాక్టరు చెప్పిన నగ్నసత్యం విన్న తరువాత నా అంచనాలు తారుమారయినాయి. శ్రావణి లాటి అమాయకురాలు ఇంతపని చేసిందా అని అనుకుంటే నాకు నమ్మకం కల్గటంలేదు. శారీరకంగా నా భార్య నాకు దూరమయిందేకానీ, శాశ్వతంగా నా మనసులో స్థానం ఎప్పుడూ తనదేరా. అందుకే అమ్మ మరొక పెళ్ళి చేసు కొమ్మని ఎంతగా అడిగినా అంగీకరించలేదు. మామూలుగా ఆమెలో, లోపం వున్నదని తెల్సినా, నాకింత బాధ వుండేదికాదు. కానీ జరిగింది గుర్తుకువస్తే భరించటం నావల్లకావటంలేదు" అన్నాడు బాధగా నుదురు పట్టుకుని.

"ఆవిడని పుట్టింటికి పంపటంలో నువ్వు తొందరపడ్డావేమోరా."

జరిగిన కథ—6 బిడ్డలులేని శ్రీహరి, శ్రావణి దంపతులు డాక్టరు దగ్గరకు వెళుతారు. శ్రావణిని పరీక్షచేసి ఆమెకు పెళ్ళికి ముందే బిడ్డలు పుట్టకుండా ఆపరేషన్ జరిగినట్లు చెపుతుంది డాక్టర్. శ్రీహరి శ్రావణిని పుట్టింటికి పంపించేస్తాడు. రైల్లో కూర్చొన్న శ్రావణి జరిగిపోయిన తమ తీయని దాంపత్య జీవితం గురించి తలపోయసాగింది. శ్రావణి తల్లితండ్రులను చేరుతుంది. కానీ జరిగినదాంట్లో తల్లితండ్రులకు భాగం ఉందని తెలుసుకొని ఇల్లు విడిచి వెళ్ళిపోతుంది. ప్రాణం తీసుకోబోతున్న శ్రావణిని రక్షించిన స్త్రీ ఆమెను తన ఇంటికి తీసుకెళ్ళి ఆశ్రయం ఇస్తుంది. శ్రావణి తనకు ఆశ్రయం ఇచ్చిన స్త్రీ ప్రముఖ రచయిత్రి ప్రమీలా కైలాష్ అని తెలుసుకొని ఆశ్చర్యపోతుంది. లక్ష్మయ్య దంపతులు శ్రావణి విషయాన్ని అల్లుడు శేషుకి చెప్తారు. ప్రమీల తన గత జీవిత చరిత్రను శ్రావణికి తెలియపరుస్తుంది. శ్రీహరి భార్యను పుట్టింటికి పంపాడేకాని ఆమె జ్ఞాపకాలను మరువలేకపోతాడు. శ్రావణి తన పెళ్ళికి ముందు జరిగిన సంఘటనలు చెప్తూ తనను తన బావ ఏ విధంగా అల్లరి పెట్టిందీ ప్రమీలతో చెప్పసాగింది. శ్రావణి చెప్పినదంతా విన్న ప్రమీల ఆమె జీవితం నాశనం కావడానికి కారణం ఆమె బావే అని గ్రహిస్తుంది. ఎలాగైనా ఆమె బ్రతుక్కొక దారి చూపాలని నిర్ణయించు కొంటుంది.

''భార్య పవిత్రతను కోరటం, భర్త తప్పంటావా ? '' కైలాష్ ముఖంలోకి సూటిగా చూశాడు.

సమాధానం చెప్పని కైలాష్ ''ఒకవేళ జరిగినదాంట్లో ఆమె ప్రమేయం ఏమీలేదని నిర్దోషి అని తెలిస్తే నువ్వామెను స్వీకరించ కలవా ? '' అన్నాడు.

''ప్రమేయం లేకుండా ఎలా జరుగుతుందిరా నీ పిచ్చి తప్ప. అమాయకంగా నవ్వించే ఆడదాని అసలు స్వరూపం ఇదని అనుభవపూర్వకంగా తెల్సుకున్నాను. అసలు ఈ ఆడజాతి అంటేనే నాకు అయిష్టంగా వుందిరా'' అన్నాడు ఆవేశంగా,

''ఆవేశపడకురా అసలు ఎందుకు, ఎలా ? జరిగిందో తెల్సుకున్నావా ? ''

''తెల్సుకుని ఏంచెయ్యాలిరా. బాధపడటం తప్ప. ఇప్పటికే గుర్తుకువచ్చిననాడు నేను పడే ఆవేదన నాకుతెల్సు, నా మనసుకితెలుసు. నామీదనే ఆశలు పెట్టుకున్న అమ్మ కోసమేరా నేనింకా బ్రతికుంది. ఈ వంశం ఇంతటితో అంతరించి పోకూడదని నన్ను మళ్లీ పెళ్లి చేసుకొమ్మనే అమ్మ గోల భరించలేకనే, కొద్దిపాటి మనశ్శాంతి అయినా లభిస్తుందని ఈ బిజినెస్‌లో పార్టనర్ నయ్యాను.''

''బాధపడకురా. కాలం కలిసివస్తే నీకూ మంచి రోజులు వస్తాయి.''

''నా జీవితంలో ఏదో మంచి జరుగుతుందన్న ఆశ నాకు ఎప్పుడో చచ్చిందిరా. కానీ నా బాధల్లా అమ్మ గురించే'' అన్నాడు నీళ్లు నిండిన కళ్లతో.

''నువ్వు ఊహించినట్లుగానే కాసేపు జరిగింది నిజమని నమ్ముదాంరా. కానీ మీ ఆవిడకి ఎవరన్నా శత్రువులు వుండి ఆమెకు తెలియని స్థితిలో ఈ పనిచేసి వుండవచ్చుగా. అలాటప్పుడు అది ఆమె తప్పెలా అవుతుంది ?'' అన్నాడు భార్య చెప్పిన మాటలు మనసులో మెదిలిన కైలాష్.

''సరే ! శ్రావణికి తెలియదనుకుందాం. కానీ వాళ్ళ అమ్మా — నాన్నాకి కూడా తెలియదంటావా ? తెల్సింది కూతురికి చెప్పకుండా వుంటారా ? ఇవన్నీ దాచిపెట్టి నాతో పెళ్ళి జరిపించటం మోసం చెయ్యటం కాదా ? అసలు ఈ విషయంలో, నా భార్యనికూడా అనుమానించటానికి తగిన ఆస్కారం లేకపోలేదు. నేను ఎప్పుడు డాక్టరు దగ్గరకు వెళ్దామన్నా ఏదో వంకతో అడ్డుపడేది. ఇవన్నీ ప్రత్యక్ష సాక్ష్యాలు. ఇంతకంటే పెద్ద సాక్ష్యం డాక్టరు చెప్పిన పిడుగులాటి నిజం. ఇన్ని రిజాల్ని అబద్ధాలుగా నమ్మటానికి నేను పిచ్చివాడిని కాదురా.''

''ఒక్కసారి నువ్వు మీ అత్తవారి వూరు వెడితే ఎలా వుండేదో ?''

''ఎందుకురా. నేను శ్రావణిని పంపి



మూడు నెలలయింది. ఇంతవరకు, ఒక్కరు ఒక్కరయినా ఆమె తరుపువాళ్ళొచ్చారా ? తెగిన దారాన్ని ముడివేసి దగ్గరకు చేర్చుకునే అవసరం ఆ బంతికి మాత్రమే కాదురా దారానికి కూడా వుండాలి. అయినా ముళ్ళు పడ్డ దారం ఎంత కాలం వుంటుంది.''

మౌనంగా వుండిపోయిన కైలాష్ మనసు ఒక్కసారిగా శ్రావణి వైపు పరుగుతీసింది. ''ఏమయినా ఈవిషయంలో వెతకపోయిన తీగలాగా శ్రావణి ప్రమీలను కలవటం, ఆమె తన మిత్రుడి భార్యవటం అంతా వింతగా వుంది. శ్రావణి మాటలు వింటుంటే ఆమెది తప్పేం లేదని పిస్తోంది. వీళ్ళ మధ్యనున్నది మాత్రం చాలా క్లిష్ట సమస్యే. అసలు కీలకం ఎక్కడుందో తెల్సుకోవాలి. శ్రీహరి కాపురం బాగుచెయ్యాలి'' అనుకున్నాడు కళ్ళు మూతలుపడుతున్న కైలాష్.

భార్య స్మృతులతో, ఆ రాత్రి శివరాత్రే అయిన శ్రీహరి, నిద్రదేవత కరుణించక అశాంతిగా పక్కమీద దొర్లసాగాడు.

33

''నిజం ?'' అంది నమ్మలేనట్లుగా చూస్తూ ప్రమీల.

''అవును ! నువ్వు రక్షించిన శ్రావణి నా మిత్రుడు శ్రీహరి భార్య శ్రావణీ ఇద్దరూ ఒకరే. చూడు ప్రమీ మనిద్దరం ఈ సమస్యను జంటగా పరిష్కరించి, ఆ జంటను ఒకటి చెయ్యాలి. తెల్సిందా ?'' అన్నాడు ఆవేశంగా.

''ఆపండిసార్ ! ఈ శ్రావణి మిత్రుడి భార్య కాదని తెల్సినప్పుడు ఏమయింది ఈ ఆరాటం'' అంది నవ్వుతూ.

''సారీ డార్లింగ్. అప్పుడే చెప్పానుగా సారీ'' అన్నాడు.

''సరేలేండి మీ మగవాళ్ళు ఎప్పుడు ఎలా మారుతారో ఆ సృష్టికర్తకి కూడా తెలియదు'' అంది.

''ఆ ! మీ రచయిత్రులు మాత్రం ఎప్పుడు ఏం సంఘటన ఎలా మలుపు తిప్పుతారో మీకు తెల్సినట్లు పేద్ద'' అన్నాడు వేళాకోళంగా.

''మీరిలా ఆట పట్టించారంటే నేను అసలు అస్త్రసన్యాసం చెయ్యవల్సి వుంటుంది తెల్సునా?'' అంది బెదిరింపుగా.

''ఆ పని మాత్రం చెయ్యకు. పాపం నీ అభిమాన పాఠకులు నామీద దాడి చేసే ప్రమాద ముంది'' అన్నాడు పకపకా నవ్వుతూ.

''అవును శ్రావణిక్కడ వున్నట్లుగా మీరు మీ మిత్రుడికి చెప్పలేదు కదా ?'' అంది.

''అబ్బే ! నేనేం చెప్పలేదు.''

''మంచిపని చేశారు. మనకి తెల్సినంత కూడా మీ మిత్రుడికి తెలియదన్నమాట. నిజంగా శ్రావణిని మనసారా ప్రేమిస్తున్నాడు కాబట్టే రెండో పెళ్ళికి అంగీకరించలేదు'' అంది ప్రమీల.

శ్రావణి

''చూశావా ! ఎంతసేపూ మాజాతి వాళ్ళను అన్యాయం చేసినట్లుగా వాపోతారు కానీ మాకూ మనసుందని అది ఒకరికే అంకితమని నా మిత్రుడు రుజువు చేశాడు చూశావా?'' అన్నాడు గర్వంగా కైలాష్.

''మీరు, మీ మిత్రుడు ఏక పత్నీవ్రతులు సరేనా. అయినంత మాత్రానా, మీ జాతి అంతా ఇటువంటిదేనని మాకు నమ్మకం ఏమిటి? కానీ అకారణంగా సీతను అనుమానించిన ఆ రాముడు కూడా మీ జాతే మర్చిపోకండి. చిన్న అనుమానానికి కూడా మీరు భార్యలను వదిలేసేటంతటి ప్రబుద్ధులు'' అంది చురక తగిలిస్తూ.

''అనుమానంతో వదిలివేశాడే కానీ మరెవర్నీ పెళ్ళాడలేదుగా'' అన్నాడు.

''గొప్పేలెండి. వాళ్ళు మాత్రం లేరా ఏమిటి. నా కంటికి కనపడేది నాటి రాముడు నేటి మీ మిత్రుడు తప్ప మూడో వాళ్ళెవరూ కన్పించటంలేదు'' అంది.

''ఆలోచిస్తే మూడేం ఖర్మ. మూడు వందలు తగులుతారు తెల్సునా ?''

''నేనా మూడువందల మందిని గుర్తుకు తెచ్చుకునేసరికి ఒక యుగం పడుతుంది.''

''అవును మనమిప్పుడు ముఖ్యంగా చెయ్య వల్సింది వాళ్ళని ఒకటిగా చెయ్యటమా, మనం రెండుగా అవ్వటమా ?'' అంది చిరుకోపంగా.

''అమ్మో! అది కలలోకూడా జరగకూడదు. రచయిత్రి బుర్రకి పదునెక్కువ. జరగవల్సింది ఆలోచించు'' అన్నాడు నవ్వుతూ.

''అదీ అలా అన్నారు బాగుంది. మరయితే నా ప్లాన్ వినండి'' అని చకచకా వివరించింది.

''వెరీ గుడ్ ! చాలా చక్కగావుంది. తెలివంటే అలావుండాలి'' అన్నాడు మెచ్చుకోలుగా చూస్తూ.

''అదంతా నా స్వంతమే కాదులెండి. మీ సహచర్యంలో నేర్చుకున్నదే'' అంది ప్రేమగా కైలాష్ వంక చూస్తూ.

''ఈ మాత్ర గౌరవం అయినా ఇచ్చావు'' అన్నాడు చిలిపిగా.

'అంటే నేను . '

''సరిసరి ! ముందు నాకు, కొన్ని అనుమానాలున్నాయి అవి క్లియర్ చేసుకోవాలి'' అన్నాడు.

ఒకే ఇంట్లో వుంటున్నాకూడా మొదటి సారిగా స్టేషనులో తప్ప ఏనాడు కైలాష్ కంట పడని శ్రావణి ప్రమీలతోపాటు వచ్చిన అతన్ని చూడగానే తత్తరపాటుగా లేచి నిలబడింది చేస్తున్న పని ఆపివేసి.

''చూడమ్మా ! నీ కాపురం కుదుట పర్చాలన్న మాకు, కొన్ని వివరాలు కావాలి. చెప్పు'' అని ముందుగా శ్రావణి బావ ఫోటో అడిగాడు.

ఎందుకన్నట్లుగా చూసింది ప్రమీలవైపు.

''ప్లీజ్ ! ఇప్పుడు నువ్వు నన్నేం అడగ వద్దు. ముందు నేను అడిగినవాటికి జవాబులు కావాలి.''

తన సూట్‌కేసులో అట్ట అడుగున వున్న కేబినెట్ సైజ్ ఫొటో తీసి కైలాష్ కిచ్చింది ముభావంగా.

ఒక్క అయిదు నిముషాలపాటు ఆ వ్యక్తి రూపాన్ని పరీక్షగాచూస్తూ మనసులోముద్రించు కున్నాడు కైలాష్.

అతి పాతకాలం నాటి పెళ్ళి తాలూకు గ్రూప్ ఫోటోలో మధ్యగా వున్నాడు శేషు

''మీ వూరి వైద్యులు పేరు?'' అన్నాడు.

''శితభిషాచారి. ఎవరినడిగినా ఆయన గురించి చెపుతారు'' అంది.

తనకు అవసరం అనుకున్న మరికొన్ని ప్రశ్నలడిగి, తనకున్న సందేహాలు తీర్చుకున్నాడు కైలాష్.

''త్వరలోనే నీకు మంచి రోజులు రాబో తున్నాయని'' చెప్పి వెళ్ళాడు కైలాష్. వాళ్ళు వెళ్ళిపోయాక వంటరిగా గదిలో వుండిపోయిన శ్రావణి మనసంతా ఆలోచనలమయమయి పోయింది. కట్టుకున్నవాడి అనుమానానికి గురయిన తనకి కన్నవారి నీడ కూడా కరువయి పోయింది. తనమీద జాలిపడి ఆదరించిన వాళ్ళకి తను ఎన్నాళ్ళు భారంగా ఉండకలదు. కోరుకున్న భర్తతో కాపురం చేస్తూ జీవితం స్వర్గం చేసుకోవాలనుకుంది. కానీ జారి పడింది. మళ్ళీ ఆ స్వర్గాన్ని అందుకోగలదా. చెమ్చాతో సముద్రం తోడాలన్న ప్రయత్నం ఎంత హాస్యాస్పదమో, చెదిరిన తన కాపురం మళ్ళీ దగ్గరవటం అన్నది కూడా అంతే. వీళ్ళు పిచ్చిగానీ ఆయనింతవరకు మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా వున్నారా ? ఉంటే మాత్రం ఒకసారి 'కాదు పొమ్మన్న' దాన్ని మళ్ళీ చేరదీస్తారా? స్త్రీగా పుట్టినందుకు మాతృత్వాన్ని పొందే అదృష్టం తనకెటూ లేదు. గమ్యం

ప్రతిసృష్టి

నాడు మనిషి అనే
ఒకేపేరుతో ప్రజల్ని
సృష్టించిన ఆ భగవంతుణ్ణే
నేడు రోజుకొక్క రూపుతో
రోజుకొక్క పేరుతో
సృష్టించి, సృష్టికి
ప్రతి సృష్టి చేస్తున్నారీ ప్రజలు

—వసుధ బసవేశ్వరరావు

తెలియని బాటసారిలా ఎన్నాళ్ళీ జీవితం గడపాలి. ఎవరున్నారు తనకి. ఎందుకు బ్రతకాలి? కొందరి జీవితాలు పూర్తిగా వెలుగు చూడవు. చీకట్లోనే సమసిపోతాయి. తన బ్రతుకు కూడా అంతే. ఈ జన్మకి ఈ బ్రతుకింతే. మోడులా బ్రతికేకంటే చావటమే మంచిదని'' నిర్ణయించు కుంది.

చీకటిపడ్డా శ్రావణి గదిలో లైటువెలగటం లేదు ఎందుకనా అని అటు వైపుగా వచ్చిన ప్రమీల స్విచ్ నొక్కుతూనే కళ్ళపడ్డ దృశ్యం చూసి కెవ్వుమంది. సీలింగ్ ఫ్యాన్‌కి చీర వ్రేలాడదీసి, తన గొంతుకి ముడి బిగించుకునే ప్రయత్నంమీదున్న శ్రావణి కూడా ఉలిక్కి పడింది.

''నే చెప్పేది ఏమిటి, నువ్వు చేస్తున్న పనేమిటి?''. అని గభాల్న పరుగెత్తుకొచ్చి శ్రావణిని కిందికి లాగింది.

''చచ్చేందుకు కూడా స్వాతంత్ర్యం లేదా? నాకీ బ్రతుకు బ్రతకాలని లేదు. బ్రతికి ఇంకా మీకు భారం అవటం అంతకన్నా ఇష్టంలేదు'' అంది శ్రావణి ఏడుపు గొంతుతో

''ఇష్టంగావుంటే బ్రతకాలనుకోవటం, కష్టంగావుంటే చావాలనుకోవటం అంతా నీ ఇష్టమేనా. మొదటిసారిగా మనం కల్సుకున్న రోజే చెప్పాను. రేపు మీ ఆయన వచ్చి నా భార్య ఏది? ఏంచేశారని? అడిగితే నేనేం సమాధానం చెప్పను'' అంది ప్రమీల.

''హుం ఎండమావిలో నీరు ఆసించటం ఎంత అసహజమో ఆయన నాకోసం రావటం కూడా అంతే. మీదంతా శుష్కప్రయాస'' అంది.

'' ఈ నిరాశా వాదమే వద్దనేది '' అంది ప్రమీల.

''ఏంచూసుకుని ఆశాజనకంగా బ్రతక మంటావక్కా. నా బ్రతుకు నేను బ్రతకటానికి సీలాగా నాకేమీ చదువులేదు. మరే ఆధారము కూడా లేదు. నాకు జీవితమంటే ఆశ ఎప్పుడో వచ్చిపోయింది. మామూలు సమస్యకాదు మా ఇద్దరిమధ్యా వచ్చింది. కొన్నిరోజులు పోయినా మళ్ళీ కలవటానికి. జీవితంలో ఏ ఆడది కూడా అణుమాత్రం అయినా వూహించని క్లిష్ట సమస్య నాది. దానికి పరిష్కారంలేదు. ఉన్న పరిష్కారం, నా చావే. దానికి కూడా నువ్వు అడ్డుపడు తున్నావు'' అంది గద్గదస్వరంతో.

''ఆ వాదాన్నే మర్చిపో. సమస్యకి పరిష్కారం చావు కాదని మునుపు ఒకసారి చెప్పాను. మళ్లీ అదేమాట చెపుతున్నాను. నువ్వనుకున్నట్లుగా మీ ఆయన ఎవర్నీ పెళ్లి చేసుకోలేదు తెల్సునా?'' అంది మాటిగా శ్రావణి ముఖంలోకి చూస్తూ.

''మా ఆయన, ఆయన నీకు తెల్సునా?'' అంది ఆశ్చర్యంగా.

''నాకు తెలియదు.''

''మరి నీకెవరు చెప్పారు?''

''నాకు తెల్సిందంతే'' అంది ప్రమీల.

''ఎలా తెల్సింది?'' అంది ఆత్రుతగా.

''ఎలాగో ... తెల్సిందంతే'' అంది ప్రమీల.

''నాకు తెలుసు అక్కా. ఆయన మనసు మంచి గంధంలాటిదని. తెల్సి, నాకు ఎప్పుడూ ఆయన అన్యాయం చెయ్యరు. ఏ దుష్టశక్తో, మా నడుమ ప్రవేసించి మమ్మల్నిలా విడదీసింది'' అంది ఆనందభాష్పాలను తుడుచుకుంటూ.

''చూశావా, మీ ఆయన వేరే పెళ్ళి చేసుకో లేదంటేనే, నువ్వు ఇంతగా పొంగిపోతున్నావు. నీ మనసులో ఏ ఆశా లేకపోతే నువ్వీ సంతోషాన్ని వ్యక్తం చెయ్యకలవా? ఏ మనిషి మనసయినా, ఆశా, నిరాశలమధ్య ఎప్పుడూ కొట్టుమిట్టాడు తూనే వుంటుంది. ఆయా పరిస్థితులనుబట్టి అటు, ఇటు మొగ్గుతూవుంటుంది. ఇప్పుడు నీ పరిస్థితికూడా అంతే. మనస్సాక్షిగా, గుండెల మీద చెయ్యి వేసుకుని నీకు జీవితంమీద ఆశ లేదని చెప్పకలవా? ఉహూ! చెప్పలేవు. నువ్వేకాదు. ఎవ్వరూ చెప్పలేరు. అసలు ఆశ అనేదే మనిషి ఊపిరికి ముఖ్యం. తను కొద్ది క్షణాలలో చనిపోతానని తెల్సికూడా ఉరి తీయబడే వ్యక్తి ఎవరయినా వచ్చి రక్షిస్తారేమోనని ఆశ పడుతుంటాడు. ఇప్పుడు చెప్పు జీవితంమీద ఆశ లేదంటావా?'' అంది శ్రావణి ముఖాన్ని పైకి ఎత్తుతూ.

సిగ్గుపడుతున్నట్లుగా తల దించుకుంది.

''రేపటినుంచీ నువ్వు ఇంట్లో వుండక్కా ర్లేదులే'' అంది ప్రమీల.

ఖంగారుగా చూసింది శ్రావణి.

''భయపడకు నా ఫ్రెండు ఒకామె కేనింగ్ సెంటర్ రన్ చేస్తోంది. ఎవరన్నా అసిస్టెంటు కావాలంది. నిన్ను పంపిస్తానని మాట ఇచ్చాను. కాస్త బయటకువెడితే మనసుకి మరే ఆలోచనలు వుండవు'' అంది.

మళ్ళీ ఇంకెప్పుడూ ఇలా ప్రయత్నాలు చెయ్యనని శ్రావణి దగ్గర మాట తీసుకుంది ప్రమీల.

ఆ మర్నాడు తనే స్వయంగా సెంటరుకి వెంటబెట్టుకుని తీసుకువెళ్ళి తన ఫ్రెండుకి పరిచయం చేసింది ప్రమీల.

అక్కడకు వచ్చే స్త్రీలందరిమధ్యా శ్రావణికి కాలం తెలియకుండా గడిచిపోతుందని ప్రమీల గాఢనమ్మకం.

34

''నమస్కారం'' అన్నాడు కైలాష్.

ప్రతి నమస్కారం చేస్తూ ''మీరు ... అన్నాడు సందిగ్ధంగా శతభిషాచారి.

''నా పేరు కైలాష్. ఒక పనిమీద మీ దగ్గరకు వచ్చాను. తమరి గురించి అంటూ...'' అర్థోక్తిగా ఆగిపోయాడు.

చిరునవ్వుతో తన గడ్డం ఒకసారి సవరించు కుంటూ ''నా పేరు శతభిషాచారి. ఈ చుట్టు పక్కల మా పేరు తెలియనివారు, శక్తి వినని వాళ్ళు ఎవ్వరూలేరు. లేకూడదు'' అన్నాడు సగం కళ్ళుమూసి.

''ఆ సంగతి తెలిసే నేనింత దూరం వచ్చాను'' అన్నాడు సవినయంగా.

''అయితే నీ బాధ చెప్పకో'' అన్నాడు.

''నాది శారీరకమయిన జబ్బుకాదు' అన్నాడు కైలాష్.


''మానసికమా?'' అన్నాడు.

''ఒక రకంగాకాదు. ఒక రకంగా అవును' అన్నాడు.

''నీ సమస్య భలే వింతగావుందే'' భళ్ళు నవ్వాడు ఆచారి.

''ఆ వింత సమస్య అంతు తమరే తేల్చాలి స్వామి'' అని కాళ్ళమీద పడ్డాడు కైలాష్.

''భయపడకు బిడ్డా. నీ కోరిక సఫలమవు



తుంది. పేరుకి ఆయుర్వేదమయినా అదొక్కటే కాదు. నాకు గాలి, ధూళీ, మందు, మంత్రం, నాటు, దీటు, వశీకరణ ఎవరికి ఏది కావాలన్నా అది చేస్తాం, చేయిస్తాం'' అన్నాడు గర్వంగా.

''అది తెలిసే అంత దూరం నుంచి మీ దగ్గరకు వచ్చాను. ఎంత డబ్బయినాసరే నా పని సానుకూలమవ్వాలి'' అన్నాడు ఆవేశంగా.

అప్పుడే మొట్టమొదటిసారిగా కైలాష్ వంక పరీక్షగా చూశాడు ఆచారి.

తెల్లటి పైజమా, లాల్చీ, మెడలో పులిగోరు గొలుసు, చేతులకు ఉంగరాలు చూడటానికి గొప్పింటి బిడ్డలావున్నాడు.

అతని చూపులను అర్థం చేసుకున్న కైలాష్ ''నాకు లక్షల ఆస్థివుంది. కానీ నా మనసు, కోరుకుంది నాకు దూరమయి మనశ్శాంతి కరువయింది'' అన్నాడు.

తంతే గారెల బుట్టలో పడ్డట్టుగా అయింది ఆచారి పని. బంగారు పిచ్చిక తనకై తానుగా వచ్చి తన లోగిట్లో వాలినట్టుగా భావన చెందాడు. ఎలా అయినా ఈ కేసును పోనివ్వ కూడదని అనుకున్నాడు.

''నీ పేరేమిటన్నావు ?'' అన్నాడు ఏదో ఆలోచిస్తూ.

''కైలాష్''

''ఆ, చూడు కైలాష్ ఎలాటి సమస్య అయినా సరే చిటికెలో పరిష్కరించకల సమర్థత ఈ శతభిషాచారికుంది. అసలు నువ్వీగడప తొక్కిన మరుక్షణమే నీ సమస్య కొంత పరిష్కారమయినట్లే'' అన్నాడు.

''అంతా మీ దయ.''

''నామీద నీకు ఇంకా నమ్మకం కల్గుతుంది'' అని కైలాష్‌ను ముందుకి రమ్మని విభూతి చేత్తో పట్టుకుని ఏవో మంత్రాలు జపించి అతని నుదుట పెట్టాడు. చేతిలో మరికొంచెం వుంచాడు.

''మహా ప్రసాదం'' అని కళ్ళకద్దుకుని నోట్లో వేసుకున్నాడు.

శ్రావణి

''ఆ, ఇప్పుడు చప్ప చప్పు గాధించేది ఆడా, మగా ?'' అన్నాడు ఆచారి.

ఇంతలో ఒక వ్యక్తి హడావిడిగా లోపలికి దూసుకు వచ్చాడు.

''ఏం ! బొత్తిగా శీతకన్నేశావు. అవసరం తీరిపోయిందనేగా ?'' అన్నాడు ఆచారి కొంచెం కోపంగా ఆ వచ్చిన వ్యక్తి వైపు చూస్తూ.

కైలాష్ కా వ్యక్తిని ఎక్కడో చూసినట్లని పించింది. స్మృతిపథంలో లీలగా మెదిలింది. అవును శ్రావణి బావ శేషుయే. ఖచ్చితంగా అతనే అనుకున్నాడు. వెతకబోయిన తీగ తనంతట తానే చుట్టుకోవడం అంటే ఇదేనేమో. తను రావటం మంచి సమయంలో వచ్చానని అనుకున్నాడు. ముందు జరిగేది కూడా సవ్యంగా జరిగితే తను ఘన విజయం పొందగల్గుతాడు.

''ఎంత మాట గురువులు, మిమ్మల్ని నేను అలక్ష్యం చెయ్యటమా ? మన చిలక గూటికి చేరుకుంది'' అన్నాడు శేషు.

''చేరక ఏమవుతుంది. నీ మాట చెల్లించు కున్నావుగా. నేను నా మాట దక్కించుకున్నాను'' అన్నాడు పకపకా నవ్వుతూ.

ఇంకా ఏదో చెప్పబోతున్న శేషు కైలాష్‌ను చూసి ఆగిపోయ్యాడు. ఇతను ఎవరన్నట్టుగా ప్రశ్నార్థకంగా చూశాడు ఆచారి వైపు.

''మన సహాయం కోరి వచ్చినవాడు. మన క్కావల్సినవాడు'' అన్నాడు చిరునవ్వుతో.

''ఏ విషయంలో ?'' అన్నాడు నుదురు చిట్లించి.

''అదే చెప్పపోతున్నాడు. ఇంతలో నువ్వు వచ్చావు'' అని ''ఆ, ఇంక నువ్వు చెప్పు'' అన్నాడు కైలాష్‌ని.

కొత్త వ్యక్తి దగ్గర ఎలా చెప్పటమా అని సందిగ్ధంగా చూశాడు కైలాష్.

''ఇతను కూడా మనవాడే పేరు శేషు'' అన్నాడు ఆచారి.

తన వూహ కరెక్టేనని ఆనందపడుతూ ''ఏం చెప్పను ?'' అమాయకంగా అన్నాడు కైలాష్.

''అదేనయ్యా నీ మనస్తాపానికి కారణం ఎవరో చెప్పు.''

''ఒక అమ్మాయి'' అన్నాడు.

''అయితే నీ పని జరిగినట్లే ఫ్రెండ్'' అని చనువుగా కైలాష్ మీద చెయ్యివేసి నవ్వాడు శేషు.

కైలాష్ కూడా చిరునవ్వునవ్వాడు.

''తర్వాత'' అన్నాడు ఆచారి.

''నేను మా ఇంటిపక్క అమ్మాయిని ప్రేమించాను. ఆ పిల్లంటే నాకు ఎంతో ప్రేమ. కానీ ఆ అమ్మాయికి అయిష్టం. ఆ పిల్లకి నామీద ఇష్టం కల్గేలా చేసి తనకు తానుగా వచ్చి నా దగ్గర వాలాలి. ఎంత ఖర్చయినా సరే'' అన్నాడు జేబులోంచి నోట్లకట్టలు బయటకు తీస్తూ.

ఆ కట్ట చూపగానే వాళ్ళిద్దరి కళ్ళు మెరిశాయి.

''ఆ, అమ్మాయిని నీ వశం చెయ్యాలి అంతే కదా. అది నాకు వెన్నతో పెట్టిన విద్య'' అన్నాడు ఆచారి.

''మీరేం చేస్తారో నాకు తెలియదు. ఆ అమ్మాయి మాత్రం నాకు కావాలి'' అన్నాడు పట్టుదలగా కైలాష్.


''ఇంక నువ్వాసంగతి మర్చిపోయి హాయిగా వుండు. మళ్ళీ వారం రోజుల తర్వాత నాకు కన్పించు. ఈ లోపున నాకు కొన్ని ముఖ్యపను లున్నాయి'' అన్నాడు.


''అయితే నాకింక సెలవు'' అన్నాడు కైలాష్ లేచి.


''అభీష్టసిద్ధిరస్తు'' అన్నాడు ఆచారి గుంభనగా నవ్వుతూ.

ఆచారి కనుసైగ గమనించిన శేషు తల వూపాడు నెమ్మదిగా.

(ఇంకా ఉంది)







పి. ఎస్. కె. ఆర్ – బెంగుళూరు

కొన్ని జబ్బులు రాకుండా, (ఉదా. అమ్మవారు, పోలియో) ముందుగా ఇంజక్షన్లు వాడినట్లు మధుమేహం వచ్చినప్పుడు మందులు వాడినట్లు గాకుండా, మధుమేహం రాకుండా ముందు జాగ్రత్తగా మందులు గాని, ఆహార నియమాలుగాని ఉంటే చెప్పండి.

★ మధుమేహం కుటుంబంలో ఎవరికైనా ఉన్నప్పుడు, ఆ కుటుంబంలోని ఇతర సభ్యులు తరచూ మూత్ర పరీక్ష చేయించుకోవటం మంచిది. క్రమబద్ధంగా కావలసినంత మాత్రమే ఆహారాన్ని తీసుకొంటూ, శరీర వ్యాయామం తప్పక చేస్తూ రావాలి. మధుమేహం (డయా బెటిస్) రాకుండా ప్రత్యేక మందులేవీ లేవు.

పి. సి. – మహబూబ్‌నగర్.

నా వయస్సు 18 సంవత్సరములు. బలహీనముగా వుంటాను. మల విసర్జన సమయములో పెద్ద ప్రేగు బయటకు వస్తున్నది. మలములో చీము పడుతున్నది. నోటిలో కూడా కొద్దిగా కఫం ఎప్పుడూ వస్తుంది. ఈ విధంగా 8 నెలలుగా వుంటుంది.

★ దీనిని ప్రొలాప్స్ రెక్టం అని అంటారు. దీనికి శస్త్రచికిత్స అవసరం అవుతుంది.

మల విసర్జన ద్వారం ఉన్న ప్రాంతంలోని కండరాల బిగుతు సడలినా, వాటి పటుత్వం తగ్గిపోయినా ఇలా జరిగే అవకాశం ఉంటుంది. చిన్న పిల్లలలో అధికంగా విరేచనాలవుతున్నప్పుడు అలా జరిగే అవకాశం ఉంది.

గుర్రపు స్వారీ మొదలయిన స్థానిక వ్యాయామాలవల్ల ఆపరేషన్ తర్వాత కండరాలపటుత్వం వృద్ధి చెందుతుంది.


ఎం. వి. ఆర్. ఆర్. – కర్నూలు

నా వయస్సు 18 సం. లు. రెండు సం. లుగా కనుచూపు సరిగా కానరావటం లేదు. దూరంగా ఉన్న వారిని, అక్షరాలను గుర్తుపట్టలేను.

★ మీకు "మయోపియా" అనే దృష్టి లోపం (హ్రస్వ దృష్టి) ఉన్నది. నిపుణులైన నేత్ర వైద్యుల వద్ద కళ్ళను పరీక్షింప చేసుకొని, సరి అయిన పవర్ గల కళ్ళ అద్దాలను వాడవలసి ఉంటుంది. □

రేపటి వెలుగు

—ఆదూరి వెంకట సీతారామమూర్తి



"నాతో తెచ్చిన వెలుగును నాతోనే తీసుకు పోతున్నాను — మళ్ళీ రేపే పునర్దర్శనం' అన్నట్టు పడమటి కొండల మాటుకు పోతున్నాడు సూరీడు — పూర్తిగా చీకటి జొరబడకముందే నీరెండ మిగిల్చిన కొద్దిపాటి వెలుగులోనూ దినచర్యను ముగించుకోబోయే ప్రయత్నంలో వున్నాయి ప్రాణులు.

బారులు బారులుగా ఆకాశంలో గూళ్ళకు పోయే పక్షులు — పశువుల మందల్ని వూళ్ళోకి తోలుకుపోయే పాలికాపులు.

సరిగ్గా అదే సమయంలో అడ్డురోడ్డు దగ్గర బస్సుదిగి, ఊరివైపు నడుస్తున్నాడు పావనమూర్తి. అతని బుర్రలో ఎన్నో ఆలోచనలు దూరి మనసును పాడుచేస్తున్నాయి — ఒకప్రక్క యేదో చెయ్యాలనే తపన - ఏం .చేయాలన్నా ధైర్యం కావాలి. అదే లేదు తనకు. రెండు నెలల క్రితమే రిటైరైపోయాడు తను. అప్పట్నించీ పది రోజులకోమారు పెన్షన్ కాగితాలకోసం పట్నం వెళ్ళివస్తూనే వున్నాడు.

మట్టిరోడ్డు దిగి కాలిబాట పట్టాడు పావనమూర్తి. ఆ దారంటే రెండు ఫర్లాంగులు నడిస్తే పెద్ద చెరువు వస్తుంది. ఆ గట్టుగుండా నడిచి అటు దిగితే... అక్కడ్నించి దూరం తెలియదు.

నీరెండ తగ్గిపోయింది. ఊడలమర్రి దగ్గరకు వచ్చేసరికి గొల్లుమని ఏడ్పులు విన్పించేయి పావనమూర్తికి. ఆ యేడ్పులు ఆ ప్రక్కనే కొద్ది దూరంలో వున్న గుడిశలోనివి.

అనాదినుండీ అక్కడి పాకలు వూరికి దూరంగా వెలివేసినట్టే విసిరివేయబడ్డాయి - సుమారొక యాభై గుడిశలుంటాయక్కడ. అందులో నివసించేవారిలో యే కొద్దిమందో తప్ప తతిమ్మావారంతా యే రోజు కూలి ఆ రోజు సంపాదించుకుని బ్రతుకుతున్నవారే.వారిజీవనంతో గాని, కష్టసుఖాలతోగాని ఆ వూరి ప్రజలకెట్టి సంబంధమూ లేదు — కానీ ఎన్నికలొచ్చినపుడు మాత్రం అక్కడా గుర్తులు 'వెలుస్తాయి; మైకులు మార్మోగుతాయి — అప్పుడే ఆ వూరి పెద్దలు ఆ వాడ గడపలు తొక్కేది! వారిని బతిమాలి, బుజ్జగించి, ఆశపెట్టి నచ్చచెప్పేది — ఓటున్న మనుషులుగా గుర్తించేది.

ఏడ్పులు మరింత అధికం కావడంతో పావనమూర్తికి.అడుగు ముందుకు పడలేదు. ఒక్క క్షణం ఆగి, అటువంక చూశాడు. జనం గుంపులుగా అటువైపే.వస్తున్నారు.

విషయాన్ని తేలికగానే గ్రహించగలిగాడు పావనమూర్తి. ఒక వ్యక్తి భుజం మీద దేనినో మోస్తున్నాడు — ఆ వెనుక దీనవదనాలతో కొందరు; అమాయకంగా మరి కొందరు.

ఆడవాళ్ళంతా గుడిసెలు దాటి కాస్త దూరమొచ్చి అక్కడ ఆగిపోయారు. తాటిపెండికివతల వున్న గోర్జి దిగి నడుస్తున్నారు జనం. ఆ దారి తిన్నగా ఊడలమర్రి వెనుకనున్న స్మశానం ప్రక్కగా వెళ్తుంది —

'ఏంది బాబయ్యా యీ దిక్కనొచ్చారూ' పావనమూర్తి వెంటనే సమాధానం చెప్పలేదు — అగ్రకులస్థులు అటు వైపుగా రావటం వారికి ఆశ్చర్యమే మరి !

'పట్నమెళ్ళి వస్తున్నానోయ్' అని, కాస్సేపాగి; 'ఏం జరిగిందిట—' అంటూ గుంపు వైపు చూశాడు. . .

'పాపం...కోటయ్య...కొడుకు పోనాడండీ— రెండేళ్ళుంటాయి— నిన్నటిదాకా ఆడుతూ పాడుతూన్న వోడే— యేటొచ్చిందో మరి పొద్దోయి కళ్ళు తేలేసేడు— ఆడికిక బిడ్డలు నిలవరు బాబయ్యా. యాడాది క్రితమొకడూ, మూడేళ్ళ క్రితమొకడూ వరసాగ్గా మగపిల్లలే పోనారు. ఇక్కడందర్లోకీ కాస్తో కూస్తో వున్నాడు వాడేనయ్యా. భార్య బంగారబ్బొమ్మ. ముత్తెల్లాంటి ముగ్గురు బిడ్డలూ వరసాగ్గా పోడంతో ఆయమ్మ శోకదేవతే అయిపోనాది. అసలు మాలో వుండాల్సిన ముడిసికాదండాయమ్మ. పసిపాపడంటే పేనం పెడతాది— ఏట్నాబం ? ఆయమ్మ ఆపద ఆదుకోలేంది. అదుగోనండి ఆ ఎదురు దడిపక్కనున్న ఎత్తరుగుల వాసపిల్లే కోటయ్యది.'' అంటూ మరో ప్రశ్నకి తావివ్వకుండా ఉన్న ఉదంతాన్ని పూసగుచ్చినట్టు చెప్పేడు పోలిగాడు.

అప్పటికే అక్కడ జనం కొద్దిగా పోగై వింతగా వింటున్నారు.

ముందుకు కదిలేదు పావనమూర్తి. అడుగులు ముందుకు పడుతూంటే ఆలోచనలు కడలి అలల్లా లేస్తున్నాయి. ఆ అలల మధ్య తేలియాడే నురుగుల జ్ఞాపకాలలో అతనికి తన కొడుకు రూపం ఒక్కమారు కన్పించి అదృశ్యమైపోయింది.

'చక్రధరం తిరిగి వస్తే బావుణ్ను' అనుకున్నాడు పావనమూర్తి. వాడు యిల్లు వదిలి అప్పుడే నాల్గు నెలలయి పోయింది. ప్రాణాలతో వుంటే మాత్రం ఎప్పటికైనా తిరిగొస్తాడనే నమ్మకముంది. తనలోని చివరి వూపిరిపోయే ముందు గుక్కెడు తులసి తీర్థం వాడి చేతుల మీదుగా తన నోట జారితే అంతేచాలు !

చక్రధరం గురించి తల్చుకుంటేనే పావన మూర్తిలో ఎన్నో భయాందోళనలు— 'అసలు వాడలా మారటానికి తను కాదూ కారణం.' అనుకుంటాడు ఎప్పటికప్పుడు — తనను తనే తిట్టుకుంటాడు. దండించుకుంటాడు — పశ్చాత్తాపంతో దగ్ధమౌతాడు — ఆ తర్వాత బాధ్యతల బరువుల్లోంచి తప్పించుకోలేనివాడు తల దించుకుని వీధిన పడతాడు.

తన బ్రతుకు భారాన్ని తానే మొయ్యాడ్వలేక యీడిగిలపడుతున్న వాడి మెడకొక బండరాయను కట్టడం మహాపాపం గదూ? ఆ పాపమే తను చేశాడు. కూతురి జీవితం కోసం కొడుకు బ్రతుకును బలిపెట్టిన దౌర్భాగ్యుడతను

చక్రధరం నిజానికి ఎంత తెలివైనవాడో, అంత యోగ్యుడు. ఈ దేశంలో తెలివికీ, యోగ్యతకీ గౌరవముండివుంటే చక్రధరానికి ఉద్యోగం వచ్చి వుండేది.

చక్రధరం బియ్యే ఫస్టుక్లాసులో పాసైనవుడు ఎంత సంతోషించాడు తను. ఒక సెకెండరీగ్రేడు మాష్టారిగా దారిద్ర్య జీవితాన్నే గడిపిన తను తన కొడుకు గొప్పవాడు కావాలని ఆశించడంలో తప్పేముంది? ఆ ఆశతోనే సాగలేకపోయినా డిగ్రీవరకూ చెప్పించాడు. అయితే దేశ సౌభాగ్యాన్ని పాఠాలలోనే బోధించే తనకు విభిన్న సమస్యలతో కొట్టుకులాడిపోతున్న దేశ ఆర్థిక స్థితిగతులుగాని, యువతలో చెలరేగిన అశాంతిగాని అవగతం కాలేదు.

"దండాలు బాబుగారూ. యీయాళప్పుడొస్తుంటే ఎవరో అనుకున్నా."

తలతిప్పి చూచాడు పావనమూర్తి. ఎదురుగా దానయ్య.

"బావున్నావా దానయ్యా. ఏవిటి సంగతులు."

"ఏముందయ్యా. మా కులపోళ్ళ మీటింగెడితే పోయొస్తున్నా. మా కులాన్ని కూడ వెనకబడిన జాబితాలోకి చేర్చమని ప్రభుత్వానికి కాయితాలు పెట్టుకున్నాం. మునుపున్న మంత్రిగారు తప్పకుండా చూస్తామని వాగ్దానం చేసేరు. కానిప్పుడు మంత్రులు మారిపోయారుగా. అంచేత మీటింగ్ పెట్టి కొత్తగా కాయితాలు పంపిస్తున్నాం. మీలాటోళ్ల దయవల్ల ఆ పని సక్రమంగా జరిగింది. మా రెండోవోడికి వుద్యోగం దొరికేసినట్టే."

పావనమూర్తి మరేం ప్రశ్నించలేదు. దానయ్య తనకంటే ఏ విధంగా వెనుకబడ్డవాడో ఆలోచిస్తున్నాడు. దానయ్యకు అంతో యింతో వ్యవసాయముంది. రెండు గేదెలూ, ఒక ఎడ్లజతా వున్నాయి, ఊళ్ళో రెండు మిద్దె యిళ్ళువున్నాయి. అందులో ఒకటి అద్దెకు కూడ యిచ్చేడు. చదువాట్టేసాగని పెద్దకొడుకుచేత పట్నంలో ఒక ఫేన్సీకొట్టు పెట్టించేడు. ఇప్పుడు కుల ప్రాతిపదిక మీద రెండో కొడుక్కి సులభంగా ఉద్యోగం సంపాదించాలనే ఆరాటంలో వున్నాడు.

"మరి నేనెళ్లొస్తానండి బాబుగోరూ. మా ఆకరి కుర్రాడికి ఇంగ్లీషు ముక్కలు అసలు రాకండా వున్నాయి. తమ కాడికి పంపాలనుకుంటున్నాను" అన్నాడు దానయ్య.

'అలాగేలే' అంటూ యింటి ముఖం పట్టేడు పావనమూర్తి.

అప్పటికి చీకటి పడింది. గుడిసెల్లో గుడ్డిదీపాలు వెలుగుతున్నాయి— బీదా బిక్కీ అయిన కొందరు రామ కోవిల అరుగుమీదికి చేరి పంచాయితీ రేడియోలో వచ్చే కార్యక్రమాల్ని వింటున్నారు.

పరుగుపరుగున వచ్చి అమాంతంగా ముందుకాళ్ళను వాటేసుకున్న మనుమరాల్ని చూసి అవాక్కయ్యాడు పావనమూర్తి. ఆ అమ్మాయి ముఖంలో భయం; ఆ అడుగులలో తడబాటు కన్పించాయతనికి.

'ఏమైందమ్మా' అడిగాడు లాలనగా తల నిమురుతూ. చల్లగాలి తాకి వర్షించిన మేఘంలా ఆ అమ్మాయి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ చిన్ని ముఖంలోని దైన్యం; పోషణ లేని జుట్టు; మాసిన గౌనూ ఆ యింటి దారిద్రానికి ప్రతీకలుగా కన్పించాయతని కళ్ళకు.

'ఏం జరిగింది తల్లీ' అన్నాడు మళ్ళీ; వంగి ఆ చిరుగెడ్డాన్ని పట్టుకు వూపుతూ.

ఆ చిన్ని గుండెలో ఘనీభవించిన భయం లాలనతో కరిగింది.

'మరేమో... మరేమో... అమ్మ మంచం మీంచి లేవటం లేదు తాతయ్యా' అంది. పావనమూర్తి గుండెలు దడదడలాడేయి. ఏ సమస్యకైతే తను తట్టుకోలేడని భయపడుతున్నాడో అదే ఎదురౌతూంది. మనుమరాలి చెయ్యి పట్టుకుని వడివడిగా అడుగులు ముందుకు వేశాడు.

వీధి తలుపు తోసుకుని యింట్లోకి అడుగుపెట్టిన పావనమూర్తికి గదిలోంచి జానకి మూలుగు స్పష్టంగా విన్పించింది. ఇల్లంతా దరిద్రంతో నిండినట్టు చీకటిగా వుంది.

దీపం వెలిగించి కోడలున్న గదిలోకి నడిచాడు. కాళ్ళు వేలాడుతున్న కుక్కిపట్టె మంచం మీద బాధతో విలవిల్లాడిపోతూంది జానకి.

ఒక్క క్షణం ఆమెవంక చూసి 'ఎలా వుందమ్మా జానకీ' అన్నాడు.

ఆమె కళ్ళలో నిండిన నీళ్ళు చెంపలమీదుగా జాల్వారాయి తప్ప సమాధానం లేదు.

అంతవరకూ తన కాళ్ళను చుట్టేసుకుని నిల్చుని తల్లి ముఖంలోకి వింతగా, భయంగా చూస్తున్న మనుమరాల్ని ఎత్తుకుని యివతలికి వచ్చేశాడు పావనమూర్తి.

'బొత్తిగా మరో మనిషి సాయంలేని యిల్లయిపోయింది' అనుకున్నాడు. పాతికేళ్ళు తనతో కాపురం చేసి కొన్ని బాధ్యతల్ని మోయకుండానే స్వర్గస్తురాలైన భార్య గుర్తుకొచ్చిందతనికి.


ఆమే వుంటే తనీరోజు యిలా కళవళపడేవాడా? ఎవరి అవసరం లేకుండానే కోడలి పురుడు ఆమె చేతులమీదుగా పోసేది!

ఆమే వుంటే కొడుకు తననిలా అన్యాయం చేసి వెళ్ళివుండేవాడా?

బాధ్యతల్నీ; బరువుల్నీ ఎవరికివారు తప్పించుకుని తలో విధంగా వెళ్ళిపోతే చేతగానివాడిలా మిగిలిపోయాడు తను.

కానీ... సుఖాల ననుభవించినా కష్టాలకు తట్టుకుని జీవితాన్ని సరిదిద్దుకునేవాడే నిజమైన మనిషంటారు. పరిస్థితులకు జడిసి తనెప్పుడూ జీవితంనుండి పారిపోలేదు. పారిపోలేదుకూడా

గుమ్మందిగి వీధిలోకి నడిచాడు పావనమూర్తి. రామకోవిలదగ్గర సైకిల్తో రామం ఎదురయ్యాడు. రామం పావనమూర్తి శిష్యుడు అంచేత సంకోచించకుండా వున్న విషయం చెప్పి 'నువ్వీపని చేసిపెట్టాలోయ్' అన్నాడు.



'అదేమిటి మాష్టారూ యీ మాత్రం చేయలేనా. మరో అరగంటలో అమృతవల్లిగారు మీ యింట్లో వుండేట్టు చేస్తాను. సరేనా' అంటూ సైకిలెక్కాడు.

పావనమూర్తి కళ్ళు చెమ్మగిల్లాయి. రామం ఆ క్షణాన దేవుడిలా అన్పించాడాయనకు.

అమృతవల్లి ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో మంత్రసానిగా పేరుపొందింది. ఆమె భర్తకూడా హోమియో వైద్యుడు — ఓ చిన్న మోటర్ సైకిల్‌మీద గ్రామాలు తిరుగుతూ అక్కడి ప్రజల అవసరాల్ని ఆదుకుంటూ తద్వారా పొట్ట పోషించుకుంటున్నాడు.

పెద్ద చదువులు చదివి, డాక్టర్లై విదేశాలకుపోయి స్వదేశ ప్రజలకు ఉపయోగపడని వారి కంటె యిటువంటివారే ప్రజలకు కావల్సింది అని పావనమూర్తి చాలమార్లు చాల సందర్భాలలో అనుకున్నాడు.

ఆలోచనలతో యిల్లుజేరిన పావనమూర్తికి గడపలో చాపమీద సొమ్మసిల్లి పడుకున్న మనుమరాలు కన్పించేసరికి మనసు కలుక్కుమంది.

'ఆగస్టు నెలలో పుట్టింది కాబట్టి పాపకు స్వరాజ్యం అని పేరు పెడదాం' అన్నాడు చక్రధరం అది పుట్టగానే — ఆ పేరే ఖాయమైంది.

స్వరాజ్యమంటే చక్రధరానికెంత ప్రేమ? తండ్రి పక్కలో పడుకుంటేనేగాని నిద్రపోయేది కాదు స్వరాజ్యం — అటువంటిది... కాలం మనుషుల్ని ఎలా మార్చేస్తుంది!

వరండాలోవున్న కర్రకుర్చీలో కూలబడ్డాడు పావనమూర్తి.

గదిలోంచి జానకి మూలుగు వినిపిస్తూనే వుంది.

"అమ్మలు కొంట్లో ఎలగుంది బాబూ' అంటూ వచ్చి, 'ఆ మాలచ్మి పోడంతో యింటో మరో ఆడదిక్కే లేకపోయింది. పెద్ద కులపోళ్లు మీరు — మాలాటోళ్ళం ఏం చేయగలం' అని నొచ్చుకుంది ముత్యాలమ్మ.

'మనిషిని మనిషి ఆదుకుందికి కులాలేం అడ్డొస్తాయి ముత్యాలమ్మా. మంత్రసానికెటూ కబురంపాను. అవసరమైతే నిన్ను కేకేస్తాలే' అన్నాడు.

ముత్యాలమ్మ వెళ్లిపోయాక గుర్తొచ్చింది పావనమూర్తిని స్వరాజ్యం ఏమీ తినకుండా పడుకుందని. లోపలికెళ్లి గ్లాసుతో పాలు తెచ్చి స్వరాజ్యాన్ని లేపి తాగించాడు.

గదిలో జానకి చాలా బాధపడుతోంది. తను లోపలికెళ్లి యేంచెయ్యలేడు — వెళ్లకుండా వుండనూలేకపోతున్నాడు.

'కాస్త తమాయించుకోతల్లీ — అమృతవల్లికి కబురు పంపేను. మరికాస్సేపట్లో రావొచ్చు.' అని, జానకి ముఖంలోకి చూడలేక, వచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

రేపటి వెలుగు

దృష్టి వీధిలోకే వున్నా ఆలోచనలు మాత్రం ఎక్కడెక్కడో వున్నాయి.

ఐదేళ్లక్రితం వుండే యింటి పరిస్థితులకీ యిప్పటికీ ఎంత తేడా? హాయిగా ఉద్యోగం చేస్తూ నెలకిన్ని జీతపురాళ్లను తెచ్చుకునేవాడు. ఇంట్లో మహాలక్ష్మి 'లేద'నకుండా సంసారం చక్కదిద్దుకునేది. చక్రధరం కాలేజీకి వెళ్తున్నా, వసంత తల్లి వెనుక పనిపాట్లు చేసుకుంటున్నా చూడముచ్చటగా వుండేది.!

ఆర్థికపరమైన యిబ్బందులు మనుషుల జీవనగతినే మార్చేస్తాయని వసంత పెళ్లి నిరూపించింది. కాకపోతే వసంత పెళ్లి కోసం ఉద్యోగమూ, సద్యోగమూ లేక నిరుత్సాహంగా రోజులు వెళ్లబుచ్చే చక్రధరం మెడకు బలవంతంగా గుదిబండ తగల్చడమేమిటి? ఇది మనుషులలో పేరుకుపోయిన పశుత్వానికి నిదర్శనం కాదూ?

"నన్ను కని, పెంచి, చదువు చెప్పించి యింతవాడిని చేసినందుకు నేను మీకు ఏ విధంగానైనా సాయపడాలి. ఉపయోగపడాలి కాదనను. కానీ నాకూ కలలూ ఆశలూ ఆశయాలూ వుంటాయి. జీవితంలో అనుకున్నవి సాధించాలనే తపన వుంటుంది. జీవితానికో ఆధారం బతుక్కో గమ్యం వెదుక్కుని మనిషిగా నాకాళ్లపై నేను నిలబడాలనే అతి సామాన్యమైన వూహ వుంటుంది. ఆ వూహలు నిజం చేసుకోడానికీ, ఆ ఆశలు సాధించుకోడానికీ నాక్కొంత వ్యవధి కావాలి— ఆ పైన మీ యిష్టం" అని తెలివిగా తప్పించుకోజూశాడేగాని తమ నిర్ణయాన్ని వ్యతిరేకించలేదు చక్రధరం. కట్నం యిచ్చి పుచ్చుకునే సందర్భంలో తల్లిదండ్రులు చేసే మానవ హోమాన్ని ఆపుజేసే ప్రయత్నమూ చెయ్యలేదు.

అప్పట్లో చక్రధరం వ్యతిరేకించి వుంటేనే బావుండేదనిపించింది.

ఆ తర్వాత చాలా మార్లు— అన్ని వేలు కట్నం పోసినా వసంతకు అతిసామాన్యమైన భర్తే లభించాడు. అన్ని వేలు కట్నం తీసుకొచ్చినా తన కోడలు ఓ నిరుద్యోగికి భార్యగానే మిగిలిపోయింది.

చక్రధరం ఎంత తెలివైన వాడో అంత సున్నిత మనస్కుడు. అంతే చురుకుదనం కలిగిన వాడు. కానీ నిరుద్యోగం; బలవంతంగా నెత్తిని రుద్దబడ్డ బాధ్యతలూ; ఆర్థిక అసమర్థత అతడిని అన్ని విధాలా మొద్దును చేశాయి.

ఉత్సాహంగా మెరిసే ఆ కళ్ళలో క్రమంగా దైన్యం, బాధ చోటు చేసుకున్నాయి. ఒక్కోసారి ఎర్రగబడి క్రోధాగ్నులను కురిపించేవి. అప్పటికే పరిస్థితులకు పూర్తిగా లొంగిపోయాడు చక్రధరం. కనీసావసరాలకు కూడ నోరు తెరిచి డబ్బు అడిగేవాడు కాదు. తల్లి పోయాక అతడిలో మరింత నైరాశ్యం చోటు చేసుకుంది. మితంగా మాట్లాడ్డం; యింట్లో వున్న సమయంలో ఏవేవో పుస్తకాలు చదవడం... అంతే!

రాన్రాను తనూ చక్రధరం నుండి తప్పించుకు తిరగడం అలవాటు చేసుకున్నాడు. ఒక్కోప్పుడు వాడిని చూస్తే జాలి కంటె భయం ఎక్కువ కలిగేది. చదువు, తెలివితేటలూ వుండి కూడ సమాజం చేత మోసగింపబడి చిన్నచూపు చూడబడ్డ యువకులు విప్లవకారులు గానో, రాజకీయ హంతకులు గానో మారిపోగల ప్రమాదం ముందని ఎవరో చెప్పగా విన్నాడు.

చక్రధరం అలా ఎన్నటికీ కాడన్న ధైర్యం మనసులో వున్నా ఎక్కడో ఏదో శంక... ఏదో భయం!

భయపడ్డంతా జరిగింది చివరకు. ఏదో పని మీద పట్నం వెళ్ళిన చక్రధరం తిరిగి రాలేదు. మూడో రోజు తన పేర్న ఉత్తరం వచ్చింది.

నాన్నా!

ఒక సహృదయుడికి కొడుకుగా; ఒక ఉత్తమురాలికి చేతగాని భర్తగా; ఒక పసిదానికి ప్రేమ తప్ప మరేమీ యివ్వలేని తండ్రిగా; సంఘంలో పనికిరాని విద్యావంతుడిగా; వెలివేయబడ్డ అగ్రకులస్తుడిగా ఒక నిరుద్యోగిగా యీ జీవితమనే నాటకంలో నా పాత్రను పోషించలేక అందులో యిమడలేక, సతమతమౌతూ కాస్సేపు విశ్రాంతి కోసం వెళ్తున్నాను. మిమ్మల్ని బాధపెడితే క్షమించండి.

— చక్రధరం

చక్రధరం మీదికి ఆలోచనలు పోయినప్పుడల్లా ఆ ఉత్తరాన్ని తీసి చదువుకోడం అలవాటు చేసుకున్నాడు పావనమూర్తి. ఒక్కోసారి ఒక్కో విషయం స్ఫురిస్తుందదులో — ఒక్కోమారు ఒక్కో సమాధానం దొరుకుతుంది. కొన్నాళ్ళకైనా తిరిగివచ్చి జీవితంలోని తన పాత్రను నిర్వహిస్తాడనే ఆశ చిగురిస్తుంది.

ఇంటిముందు మోటర్‌సైకిల్ ఆగిన చప్పుడైతే ఆలోచనల్నించి బయటపడి లేచాడు పావనమూర్తి. అమృతవల్లి, ఆమె భర్త లోపలికొచ్చారు.

'ఎలావుంది ఆవిడకు' అడిగింది అమృతవల్లి.

జానకి వున్న గది వైపు వేలు చూపించాడు పావనమూర్తి. మందుల పెట్టెతోసహా ఆమె అటువైపు కదిలింది. అప్పటికి రాత్రి పదిన్నర— ఊరంతా మాటుమణిగిపోయి నిశ్శబ్దంగా వుంది. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ దూరంగా ఎక్కడో నక్కల అరుపులు... దగ్గరగా జానకి ప్రసవ వేదన —

మరో అరగంటలో అమృతవల్లి బయటకు వచ్చింది.

"కవలలు మాష్టారూ ఇద్దరూ మగపిల్లలే" అంది.

ఆమె ఆశించిన సంతోషం పావనమూర్తి ముఖంలో విరియలేదు.

'జానకి ఎట్లా వుంది' అడిగాడు అతినెమ్మదిగా.

'అమ్మాయి చాల బలహీనమవడంవల్లనే కొన్ను కష్టమైంది — మరో గంట వరకూ ఆమెకు స్పృహ రాకపోవచ్చు -- ఆ తర్వాతకూడ మగత వుంటుంది. మరేం కంగారు లేదు. అంతవరకూ పిల్లల్ని మీరు చూసుకోగలిగితే చాలు' అంటూ చెప్పవలసినవన్నీ చెప్పి; చేయ వలసినదంతా చేసిందామె.

ఆమె చూపించిన ఆత్మీయతకు; ఆదుకున్న తీరుకు పావనమూర్తి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. లోపలికెళ్ళి పర్సులో దాచిన పాతిక రూపాయిలూ ఆమె చేతిలో వుంచాడు.

'అవసరానికి ఆదుకున్నావు. ప్రస్తుతానికిది వుంచమ్మా. నీకు రావల్సినదేమైనా వుంటే కొద్ది రోజుల్లో సర్దుబాటు చేస్తాను' అన్నాడు.

పావనమూర్తి కంఠంలోని జీరతోకూడిన వణుకు ఆమె గమనించి చకితురాలైంది.

'అదేమిటి మాష్టారూ — డబ్బులో ఏముంది ? — సాటి మనిషిగా నాకు చేతనైనది నేను చేశాను. పెద్ద డాక్టర్లలా ఫీజులు వసూళ్ళు చేయడానికి నాకున్న డిగ్రీలేమిటి ?' అంది.

పావనమూర్తికి మాటలు కరువయ్యాయి. చేతులు రెండూ జోడించి ఆ దంపతులకు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఆ క్షణంలో వారిద్దరూ ఆదిదంపతుల్లా కనిపించారాయన కళ్ళకు.

దేశానికి స్వాతంత్ర్య మొచ్చి ముప్పది అయిదేళ్ళు దాటినా కనీసావసరమైన వైద్య సదుపాయం కూడ లభించని పల్లెలెన్నో వుండి పోయాయి. అటువంటి పల్లెల్లో అమృతవల్లి వంటివారే పల్లెవాసుల పాలిట అమృతమూర్తు లౌతున్నారు. ఆధునిక వైద్య పరికరాలూ; సరికొత్త మందులూ లేకపోయినా ఉన్న కొద్దిపాటి విజ్ఞానంతోనూ, అనుభవంతోనూ ప్రజలను ఆదుకుంటున్నారు.

సంతృప్తిగా నిట్టూర్చి మంచంమీద నడుం వాల్చాడు పావనమూర్తి.

అప్పటికి అర్ధరాత్రి దాటింది. కడుపులో యేదో ఖాళీగా వెలితిగా అన్పించింది. మధ్యాహ్నం మూడింటికెప్పుడో హోటల్లో తాగిన కాఫీనీళ్ళు తప్ప లోపలికి మరేం పోలేదు.

లేచి, కాసిన్ని మజ్జిగతాగి, వస్తూ జానకి పడుకున్న గదిలోకి తొంగి చూశాడు — అచేత నంగా నిద్రిస్తోందామె. ఆమె పక్కలో ఆ చిన్ని వెలుగులో... బంగారు రంగులో... చిన్ని దేవుళ్ళలా లోకమెరుగని తన మనుమలు !

తన వంశాన్నుద్ధరించి, విస్తరింపజేసి గౌరవ ప్రతిష్టలను కాపాడగల రేపటి వెలుగులు !!

తిరిగివచ్చి, యధాస్థానంలో నడుం వాల్చేడు పావనమూర్తి. కొద్ది గంటలక్రితం మనసులో వుండే వ్యాకులతపోయి ప్రశాంతత ఏర్పడింది. దానిక్కారణమైన అమృతవల్లికి మనసులోనే మరోమారు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

మొదట్లో అమృతవల్లి హరిజనస్త్రీట. అతను నిజమైన క్రిష్టియను – ఎక్కడ్నించి వచ్చారో ఎప్పుడు వచ్చారో ఆ ప్రాంతానికి ఎవరికీ తెలియదు. క్రమంగా ఆమె అతని మతాన్నే స్వీకరించింది. తన మతంలో లేని భద్రత, విలువ అందులో వుందని తలపోసిందేమో మరి ! ఏ మతమైతేనేం ? ఇద్దరిదీ ఒకే అభిమతం — అదే మానవసేవ.

ఎక్కడో స్మశానానికవతల కాబోలు నక్క వూళవేసింది. అకస్మాత్తుగా సాయంత్రం చూసిన దృశ్యం కళ్ళముందు నిలిచింది పావన మూర్తికి. దేవుడిచ్చిన శాపం కోటయ్య దంపతు లకెంత కడుపు శోకాన్ని తెచ్చింది ! ఏ జాతి వారైనా; ఏ మతంవారైనా ఏ కులంవారైనా దుఃఖం అందరికీ సమానమేగదా. అయితే సుఖంలోనే అన్ని తేడాలూ. ఈ జాతి మతాలూ, హెచ్చు తగ్గులూ, ఆర్ధిక అసమానతలూ మనుషుల విలువల్ని మంచితనాల్ని కప్పిపుచ్చి అర్ధంలేని అడ్డుగోడలు కడుతున్నాయి. కాకపోతే యేమిటి ? ఈ కడజాతి అనుకున్నవాళ్ళని తక్కువకులం దేవుడు సృష్టించాడా ? ఈ సంఘం వాళ్ళనట్లా ఎందుకు వేరు చేసినట్టు ? అంటరానివారిగా ఎందుకు వెలివేసినట్లు ? మరి వారి రక్తంలో తక్కువయిందేమిటి ? ఎరుపు దనమా ? వెచ్చదనమా ? బలమా ? చైతన్య మనుకునే ఎరుధుతిరిగే శక్తా ?

తన తలలో మెదుల్తున్న ఆలోచనలకు తనే ఆశ్చర్యపోయాడు పావనమూర్తి. ఇదే విషయం లోగడ ప్రస్తావనకొస్తే చక్రధరం అన్నాడు.

''ఒకప్పుడు వారిని బాగా అణగద్రొక్కేసింది నిజమే — ఊరివాళ్ళకి వారు ఎదురుపడకూడదు. గుళ్ళోకి వెళ్ళకూడదు — చివరికి వూరి బావిలో నీళ్ళుకూడ తాగకూడదు -- కానీ యీ ఆంక్షలన్నీ ఎప్పుడో పోయాయి. ఇప్పుడు వాళ్ళు వాళ్ల జీవితాల్ని సుఖమయం చేసుకోవడానికీ, దిద్దుకో డానికీ ఎన్నెన్నో అవకాశాలు ఏర్పడ్డాయి — వారిలో వున్నతినికోరే ప్రతివారికీ విద్య ఉద్యోగ సౌకర్యాలు కలుగుతున్నాయి.''

''ఆ మాటకొస్తే అగ్రకులాల వారికంటె వారికే సదుపాయ లెక్కువగా కలుగుతున్నాయి నాన్నగారూ. ఈ ప్రజాస్వామ్య దేశంలో కులమత రహిత సంఘం ఏర్పడకపోయినా సమానత్వాన్ని పెంపొందించి ఆర్ధిక అసమానతల్ని తొలగించే ప్రయత్నాలు బాగానే జరుగుతున్నాయి'' అంది వసంత.


''మరి యింకా యీ గ్రామాల్లో వెలివేసి నట్లుండే వారి గుడిసె లేమిటమ్మా'' అన్నాడు తను కల్పించుకుని.

''సంస్కారమన్నది రక్తంలోంచి వస్తుం దంటారుగా. అలాగే ?వక్షత అనేది మనిషి ఆలోచనల్లోంచి రావాలి. ప్రభుత్వ ఉత్తరువు ల్లోంచి రాకూడదు. ఏమైనా మనిషిని మనిషిగా గౌరవించడం, సమానత్వాన్ని సాధించడం విజ్ఞానం విశేషంగా పెరిగిన యీ రోజుల్లో అత్యవరమే అయితే నమానత్వమంటూనే నీదే కులమని అడగటం, నీ కులానికీ అవకాశం లేదనటం విడ్డూరంగా తోస్తోంది.''

చక్రధరం మాటలకు వసంత మధ్యలోనే అడ్డుతగిలింది.

''అణగదొక్కబడ్డవారికి చేయూతనివ్వడం అన్నిరంగాల్లోనూ అవకాశాలు కల్పించడం సబబే. కానీ పక్షపాత వైఖరి చూపినన్నాళ్ళ సమానత్వ మన్నది మనం అందుకోలేనంత దూరంలోనే 'హార్లైజాన్' లా వుండిపోతుంది.''

అప్పట్లో ఆ విషయాన్ని గురించి యిక పొడిగించదల్చుకోలేదు. అధోగతిపాలౌతున్న ఒక జాతి పట్ల జాలిపడే తమతరం ఆలోచనలు వేరు. వారికి కల్పించిన అవకాశాల వల్ల తమకేదో



ఇవేమన పద్యాలు



ఉన్నసరికి మనుజుడుపకారి కాలేడు
కన్నుగాన కిలన గర్వమునను
దీనులైనవారి దిగువ యెగువ జూచి
పరముగనక నూతబడును వేమ.

అన్యాయం జరిగిపోతుందన్న యీ తరం వారి ఆలోచనలు వేరు. బహుశ యీ రెంటికే పొత్తు కుదరకపోవచ్చు. చక్రధరానికి ఉద్యోగం రాకపోడానికీ, వసంత భర్తకు ఉద్యోగంలో ఎదుగూ బొదుగూ లేకుండా వుండిపోడానికీ యీ పక్షపాత వైఖరే కారణమని వారి వాదన.

రేపటి వెలుగు

నిట్టూర్చేడు పావనమూర్తి.

గదిలో యేదో అలికిడైతే లేచి అటు వెళ్ళాడు. గుడ్డిదీపమైనా గదిలో బంగారు రంగు వెలుగు! తన దృష్టిని మనుషుల మీదికి మళ్ళించాడు. దీపం కాంతి ఒకరిపీదే స్పష్టంగా పడుతోంది. తన చిన్న కాళ్ళనూ చేతుల్నీ కదిలిస్తున్నాడా పసికందు. నిద్రలోనే ఆ ముఖంలో ఏదో వెలుగు !

పావనమూర్తి వదనంలో ఆనందరేఖలు పొడచూపాయి. ఆ వెంటనే విచార రేఖలూ అలుముకున్నాయి, పాతికేళ్ళనాడు మహాలక్ష్మి పొత్తిళ్ళలోని చక్రధరం అతని కళ్ళముందు నిలిచాడు. చిన్నతనంలో చదువుకున్న 'పుత్రోత్సాహము తండ్రికి' అనే పద్యం కూడ గుర్తుకొచ్చింది.

తన వంశం నిలబడింది. కానీ ఏ స్థాయిలో నిలబడింది ? జీవనపోరాటంలో విసిగి దేశాల పాలయ్యాడు చక్రధరం. తిరిగి జ్ఞానవంతుడై యే బుద్ధుడిలా తిరిగొస్తాడో... లేదా ఏ అమర వీరుడిలా అదే పోరాటంలో అస్తమిస్తాడో వూహాకందటం లేదు.

మరి యీ రెండు వంశాంకురాలూ పెరిగే దెప్పుడు ?

కోటి తేజో ప్రభాకరులైన వెలుగులు ప్రసరించేదెప్పుడు ?

తనలోని జీవుడు ఆరిపోయాక ఏ వెలుగు కిరణం యీ జీవాలకు దారి చూపిస్తుంది ?— అన్నీ ప్రశ్నలే !

బయటినించి గాలి జోరుగా వీచింది. పావనమూర్తి కళ్ళు వర్షిస్తున్నాయి. గుండెలు వుద్వేగంతో ఎగిరిపడుతున్నాయి. పదునుదేరిన ఆలోచనలు మెదడును కోసేస్తున్నాయి.

అనుకోని గాలి తాకిడికి అష్టవంకరలూ తిరిగి చివరికి నిలదొక్కుకుంది గదిలోని గోరంత దీపం.

అదే సమయంలో పావనమూర్తి మెదడులో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. అది పాపమా? పుణ్యమా ? స్వార్థమా ? జీవన పోరాటంలో అంగీకరించిన ఓటమా ?


ఎన్ని ప్రశ్నలెదురైనా వాటికి జవాబుల కోసం ఆలోచించదల్చుకోలేదు. మనోధైర్యంతో అడుగు ముందుకు వేశాడు.

అడుగులు ముందుకు పడుతూనే వున్నాయి!

చీకటిలో... ముళ్ళదారిలో... ఎత్తుపల్లాలలో— నేల నాలుగు చెరగులా ఆనినట్లు ఒక్కో పాదం అతి బరువుగా... నిర్భయంగా. అవి కంసుడి పాలబడకుండా ధర్మాన్ని రక్షించే ప్రయత్నంలో అలనాటి నిశరాత్రి యమునను దాటే వసుదేవుడి పాదాలు కావొచ్చు. అధర్మాన్ని అంతం చేసే వామన పాదాలు కావొచ్చు ! వివక్షతల అగాధాలను దాటే యీనాటి సామాన్యుడి పాదాలు కావొచ్చు !

* * *

తెల్లవారింది— కోటి ప్రభలతో సూర్యుడుదయించాడు. లోకమంతా వెలుగు—ఊరిలోనూ వాడలోనూ అనే వెలుగు— మాతృమూర్తి జానకి వదనంలోనూ; శాపగ్రస్త అయిన కోటయ్య భార్య ముఖంలోనూ ... ★


మంగళకరమైన వెన్నెల మోమును మెరుగు పరచటానికి
ఐటెక్స్
మాట్ ఫినిష్ తిలకం
EYETEX

జంతువుల బొమ్మలు-కుక్క బొమ్మ

మామూలు కుక్క బొమ్మ :


కావల్సిన వస్తువులు : వెల్వెట్ లేక టర్కిట్ టవలింగ్ క్లాత్ పావు మీటరు.

ఏకిన దూది : 1/4 కె. జి.

ఫెవికాల్, సన్నని నైలాన్ ముక్కలు, ప్లాస్టిక్ బటన్ టైప్ పిన్స్, స్క్రూడ్రైవర్, సూదీ, దారం.


ముందుగా బొమ్మని కొలతల ప్రకారంగా అట్ట మీద గీసుకుని ఆ షేపు ప్రకారం కత్తిరించి వుంచుకుంటే పని తేలి కవుతుంది. (ఎ) బొమ్మ ప్రకారం, డబుల్ ఫోల్డ్ బట్ట మీద అట్టముక్క షేపు ప్రకారం గీసుకుని జాగ్రత్తగా కత్తిరించుకోవాలి. అలాగే 4 కాళ్లకి లోపలి వేపు భాగాలని కూడా (బి. బొమ్మ) రెండు ముక్కలు కట్ చేసుకోవాలి. యీ బొమ్మకి కాళ్ల ముక్కలోతో పాటుగానే పొట్ట కింద భాగం కూడా చేరిసగం ముక్కవస్తుంది. అందు వల్ల యిక విడిగా పొట్ట అడుగు భాగాన ముక్క అవసరంలేదు. కాళ్ల కింద గుండ్రని భాగాలు (సి) నాలుగు ముక్కలు కత్తిరించుకోవాలి.యీ గుండ్రని ముక్కల్ని, లోపలి కాళ్ల ముక్కలతో, బాడీ భాగంలో వున్న కాలు భాగానికి టాకాలేసుకోవాలి. అంటే కాలు యిపుడు గొట్టం ఆకారంలో వుంటుందన్నమాట. వీటన్నిటినీ ముందు చేతో టాకాలేసుకుని సరిగా వచ్చిం దన్పించాకే మిద కుట్టు కోవాలి. తప్పు పోయినా విప్పుకునేందుకు సులువుగా వుంటుంది. మిషన్పై కుట్టేపుడు పొట్ట క్రింద భాగాన్ని మాత్రం మూసి వెయ్యకూడదు.

కొద్దిగా దూదిని తీసుకుని ఒకొక్క కాలునీ నింపుకుంటూ, తర్వాతమూతి భాగం అంతానింపాలి. యీ దూది కూరేపుడు ఒక్కసారిగా నింపకూడదు. కొద్ది కొద్దిగా దూదిని తీసుకుని స్క్రూడ్రైవర్‌తో లోపలికి అదుముతూ నింపాలి. యిలా బాడీ అంతా నిండిందన్పించాకే పొట్ట కింద వోపెనింగ్‌ని మూసి వేయాలి. బాడీలో యే




మాత్రంకొంచెం ఖాళీ వున్నా కుక్క ఆకారం తిన్నగారాదు.

చెవులు : డబుల్ ఫోల్డ్ బట్ట మీద షేపు ప్రకారం గీసుకుని కత్తిరించి, బొమ్మలో చూపినట్లు




ఒక వేపు వోపెనింగ్ వుంచి మిగిలిన భాగమంతా అతుకేసి తిరగదీయాలి. యీ బొమ్మ టర్కిష్ టవల్‌లోగానీ, వెల్వెట్‌తో కానీ చేసేట్లయితే చెవి లోపల దూది పరవాల్సిన అవసరం లేదు. వీటిని కుక్క ముఖానికి రెండు వేపులా చెవుల స్థానంలో అమర్చి కుట్టు పైకి కన్పడకుండా అతుకు వేయాలి. యిక తోకని కూడా షేపు ప్రకారం కత్తిరించి తిరగతీయాలి. అతుకు వేశాక, తర్వాత దూదిని కూరి వోపెనింగ్‌ని మూసివేసి బాడీ వెనక భాగాన తోక స్థానం చూసుకుని అతకు వేయాలి పైకి కుట్టు కన్పడకుండా. మూతి ముందు, ముట్టె మాదిరి కన్పించేందుకు నల్లటి చిన్న వెల్వెట్ లేక క్రేప్ సిల్క్ ముక్కని ట్రయాంగిల్ షేపులో కత్తిరించి ఫెవికాల్‌తో అతికించాలి. నైలాన్ వైర్‌ని 1-1న్నర సెం.మీ. పొడవు ముక్కలుగా కత్తిరించి మూతికి రెండు వేపులా మీసాల్లా వుండేట్లు ఫెవికాల్‌తో అతికించాలి. కళ్ల స్థానంలో రెండు చిన్న ప్లాస్టిక్ బటన్ పిన్స్ గుచ్చాలి. యివి ఫ్యాన్సీ దుకాణాలలో దొరుకుతై. అంతే యిక కుక్క పిల్ల రెడీ!

బుల్ డాగ్ : దీనికి బాడీ భాగంలోనే తోక భాగం కూడా కల్సి వుంటుంది. మిగిలిందంతా మామూలు కుక్క మాదిరే కుట్టుకోవాలి. అయితే మూతికి ముందు భాగాన 1-1న్నర పొడవు, 1సెం.మీ. వెడల్పులో చిన్న ముక్కని బాక్స్ షేపులో వచ్చేట్లు అతుకు వేయాలి (బొమ్మ చూడండి). అదెలాగంటే, ముందు బాడీ భాగం అంతా కత్తిరించాక మూతి రెండంచుల్నీ, బాక్స్ షేపు ముక్క రెండంచుల్నీ టాకా వేసి షేపు తిన్నగా వచ్చాక మిషన్ మీద కుట్టుకోవాలి. దీనికి మూతి (ముట్టె) తిన్నగాలేకపోతే బుల్‌డాగ్ షేపు రాదు. ముట్టెని నల్లటి వెల్వెట్‌తోనూ, బాడీ భాగం లైట్ బ్రౌన్ కలర్‌తోనూ మెడ చుట్టూ డార్క్ బ్రౌన్ బెల్టు పెడితే అచ్చమైన చిన్న బుల్ డాగ్ పిల్లలా వుంటుంది, తోక పైకి ఎత్తుకుని, మెరుస్తున్న (ప్లాస్టిక్) కళ్లతో!



—శ్రీమతి ఎ. లక్ష్మీగిరిధర్



బోర్న్‌విటాతో పెరిగే ప్రాయం యిది యికే

వాళ్ళు మిమ్మల్ని మెచ్చుకునే రోజొకటి వస్తుందిక!



పెరిగే వయస్సులోని పిల్లలు మరే మాల్టెడ్ ఆహార పానీయమూ కాకుండా బోర్న్‌విటాయే ఎందుకు కావాలంటారు? రెండు తరాల్లోని తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలకి యిక మరేదీ కుదరదని ఎందుకు పట్టుబడతారు?

కేవలం ఝామ్ అనిపించే రుచి మాత్రమే కాదు. మరి కేవలం బోర్న్‌విటా పేరు చూసీ కాదు. ఉంది అందులో మరేదో. ఉంది యింకా మరెంతో. అదే మరి బోర్న్‌విటా, పెరిగేందుకు తోడ్పడే ఆహార పానీయం.

క్యాడ్‌బరీస్

బోర్న్‌విటా

పిల్లలు సరిగ్గా పెరగడం,
అందుకే మరి బోర్న్‌విటా యివ్వడం.

OBM/3784 TEL

సినిమా విశేషాలు

జి. వి. జి.

జంధ్యాల దర్శకత్వంలో ఎస్. వెంకటరత్నం చిత్రం "పుత్తడి బొమ్మ"

"గాజులమ్మ యువకుడుగానరేష్, రిటైర్డ్ టీచర్‌గా జె. వి. సోమయాజులు, ఆయన కుమార్తెగాపూర్ణిమ నటిస్తున్నారు" అన్నారు జంధ్యాల. ఈయన రచన, దర్శకత్వ బాధ్యతలు వహించే శ్రీ పల్లవీ ఫిలిమ్స్ వారి పై చిత్రంలో అరుణ, వేలు, వీరభద్రరావు, పొట్టి ప్రసాద్, సత్తి బాబు, జిత్ మోహన్ మిత్రా, వి. శ్రీరామమూర్తి, మాస్టర్ అలీ, అత్తిలి లక్ష్మి, డబ్బింగ్ జానకి పాత్రధారులు. ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, డాక్టర్ నెల్లుట్ల గీతాలకు చక్రవర్తి స్వరకర్త. ప్రభాకర్ ఛాయ, గౌతమ్‌రాజు కూర్పుతో ఈ చిత్రాన్ని నిర్మించే ఎస్. వెంకట రత్నం "జులై 1 నుంచి 22 వరకు రాజమండ్రి, పురుషోత్తమపట్నం, తొర్రేడు, ర్యాలి ప్రాంతాలలో మూడు వంతులు పైగా షూటింగ్ పూర్తి చేశాం," అన్నారు.

డైరెక్టర్ కె. ఎస్. ఆర్. దాస్ సమర్పించే తొలి చిత్రం

"సస్పెన్స్, యాక్షన్‌తో పాటు సెంటిమెంట్ మిళితమైన ఒక రసవత్తరమైన కథను ఎం. డి. సుందర్ తయారు చేశారు," అన్నారు కె.ఎస్.ఆర్. దాస్. ఈయన దర్శకత్వం వహిస్తూ తొలిసారిగా సమర్పించే సుకుమార్ ఆర్ట్ పిక్చర్స్ వారి చిత్రంలో మోహన్‌బాబు, మాధవి, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, గిరిబాబు, అన్నపూర్ణ వగైరా నటవర్గం, కాశీ విశ్వనాథ్ సంభాషణలు, వేటూరి గీతాలు, చక్రవర్తి సంగీతం, లక్ష్మణ్ ఛాయ, బి. చలం శిల్పం, వెంకటరత్నం కూర్పుతో ఈ చిత్రాన్ని నిర్మించే కె.ఎస్.ఆర్. దాస్ పుత్రుడు సుకుమార్ "అక్టోబర్ 20న ప్రారంభోత్సవం. ఆ మర్నాడు కూడా షూటింగ్ జరుపుతాం. ఆ తర్వాత నవంబర్, డిసెంబర్ నెలల్లో 1-15 తేదీల మధ్య తలకోన పరిసరాలలో జరిగే షెడ్యూల్స్‌తో షూటింగంతా పూర్తయిపోతుంది," అన్నారు. మోహన్‌బాబు ఆధ్వర్యంలో తయారవుతుందీ చిత్రం.

కృష్ణంరాజుతో హాస్య నటుడు సారధి చిత్రం "అగ్ని రాజు"

"ఆగస్టు 21 నుంచి షూటింగ్" అన్నారు సారధి. ఈయన నిర్మాతగా డాక్టర్ ఎం. ప్రభాకరరెడ్డి కథ సమకూర్చి సమర్పించే లక్ష్మి కిరణ్ ప్రొడక్షన్స్ వారి "అగ్ని రాజు" చిత్రంలో పై ముగ్గురితో పాటు జయసుధ, గుమ్మడి, సత్య నారాయణ, రాజేష్, అల్లు రామలింగయ్య, అనూరాధ ముఖ్య భూమికలు నిర్వహిస్తున్నారు. మద్దిపట్ల సూరి సంభాషణలు, సత్యం సంగీతం, సత్తి బాబు ఛాయ, మార్తాండ్ కూర్పుతో బి. భాస్కరరావు దరకుడు.



"కంచుకాగడా"లో శ్రీదేవి, కృష్ణ

"దైవ శక్తి"

"భగవంతుడ్ని నమ్మి మనసారా కొలిచేవారు కొందరు. విగ్రహారాధన ఎందుకనే వారు కొందరు. అసలు దేవుడే లేడనే వారు కొందరు. ఈ మూడు రకాల మనుషుల విచిత్ర కథను భక్తి పారవశ్యం కలిగించే రీతిలో డైరెక్టర్ కె. శంకర్ తెర కెక్కించారు" అన్నారు నిర్మాత కె. నాగేశ్వరరావు. రాఘవేంద్ర ఆర్ట్ మూవీస్ పతాకంలో తయారైన పై చిత్రంలో కె. ఆర్. విజయ, సరిత, సులక్షణ, విజ్జి ప్రధాన తారాగణం. వసంతకుమారి సంభాషణల కర్త. ఎం. ఎస్. విశ్వ-నాథన్ స్వర కల్పనలో వేటూరి, రాజశ్రీ గీతాలు రాశారు. ఎ. వి. సుధాకర రెడ్డి సమర్పించే ఈ భక్తి రస ప్రధాన చిత్రం త్వరలో విడుదలవుతుంది.

శ్రీధర్, ప్రసాద్ దర్శకత్వం వహించే లక్ష్మీ ఫిలిమ్ కంబైన్స్ రెండు చిత్రాలు

"ఆలయ దీపం – అనే తమిళ హిట్ చిత్రాన్ని అదే పేరున తెలుగులో తీస్తున్నాం. శ్రీధర్ దర్శకుడు. ఈయన 'పెళ్ళి కానుక' దర్శకుడుగా తెలుగు ప్రేక్షకులకు పరిచితుడే. ఆగస్టు 16 నుండి 28, సెప్టెంబరర్ 12 నుండి 20 వరకు రెండు షెడ్యూల్స్‌లో పూర్తవుతుంది" అన్నారు నంగునూరు శ్రీనివాసరావు. ఈయన సమర్పించే చిత్రంలో మురళీమోహన్, సుజాత, జగ్గయ్య, నూతన్ ప్రసాద్, కార్తీక్, రమాప్రభతో పాటు ఇద్దరు నవ తారలుంటారు. సెప్టెంబర్, అక్టోబర్‌లలో 1-14, నవంబర్‌లో 1–7 తేదీల మధ్య జరిగే షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తయ్యే ఈ సంస్థ 9 వ చిత్రంలో ఎ. ఎన్. ఆర్., రాధిక, భానుప్రియ, జగ్గయ్య, ప్రభాకరరెడ్డి, నూతన్ ప్రసాద్, అల్లు రామలింగయ్య, గొల్లపూడి మారుతీరావు, చక్రవర్తి, షావుకారు జానికి ఆదిగా గల వారు పాల్గొంటారు. రెండు చిత్రాలకూ సత్యానంద్ సంభాషణలు, చక్రవర్తి సంగీతం, భాస్కరరాజు శిల్పం, కె. వెంకటేశ్వరరావు కూర్పు, సలీం నృత్యాలు తెర వెనుక హంగులు. నవంబర్‌లో విడుదలయ్యే "ఆలయ దీపం" చిత్రానికి పి. భాస్కరరావు, జనవరిలో విడుదలయ్యే 9 వ చిత్రానికి నవకాంత్ ఛాయా గ్రాహకుడని నిర్మాత ఎన్. అనూరాధాదేవి తెలిపారు.

కె. హేమాంబరధరరావు దర్శకత్వంలో ప్రతిమా పిక్చర్స్ తొలి చిత్రం

"మిస్టరీ చిత్రం. జులై 23 నుంచి ఆగస్టు 1 వరకు ఫస్ట్ షెడ్యూల్ జరిపాం. మళ్ళీ ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 10 వరకు జరిగే మలి షెడ్యూల్‌తో షూటింగ్ ఘట్టం ముగుస్తుంది", అన్నారు కె. హేమాంబరధరరావు. ఈయన దర్శకత్వంలో కె. మహేంద్ర సమర్పించే పై సంస్థ చిత్రంలో శివకృష్ణ, కళా రంజని, నూతన్ ప్రసాద్, సుదర్శన్, నరసింహ రాజు, వేలు, వీరభద్రరావు, శ్రీలక్ష్మి వగైరా నటవర్గం. పేరాల కథ, మాటలు రాశారు. సత్యం సంగీతం, సుధాకర్ ఛాయ, బి. ఎన్. కృష్ణ శిల్పం, ఉప్పులూరి మల్లికార్జునరావు సహకార దర్శకత్వం, నాయని మహేశ్వరరావు కూర్పుతో రాజా, బాలు నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు.

ప్రతాప్ పోతన్, సుమలతతో "ఐదు లక్షలు"

"ప్రేమ కోసమై డబ్బు వలలో పడబోయిన యువకునిగా ప్రతాప్ పోతన్, అతని ప్రేయసిగా సుమలత నటించారు. ఈ చిత్ర దర్శకుడు రాజ భరత్ 'యము కింకరుడు' చిత్రం ద్వారా మన ప్రేక్షకులకు పరిచితుడే అన్నారు జర్నలిస్టు ప్రశాంత. ఈయన నిర్వహణలో జగదీష్ నిర్మించే వసుంధర్ ఎంటర్‌ప్రైసెస్ వారి చిత్రానికి సి. ఎ. రమణ మాటలు, పాటలు రాశారు. శంకర్ గణేశ్ సంగీతం, తివారీ ఛాయతో జయకృష్ణ సమర్పిస్తారీ చిత్రాన్ని.

శోభన్‌బాబు, జయసుధ, "భార్యామణి"





జయప్రద, కృష్ణ, "మహా సంగ్రామం"లో

కె. విశ్వనాధ్ దర్శకత్వంలో హిందీ "శంకరాభరణం"

"ఆగస్ 3 నుంచి పక్షం రోజులపాటు రాజమండ్రి ప్రాంతాల్లో షూటింగ్ జరిపాం," అన్నారు కె. విశ్వ-నాధ్. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో వడ్డే శోభనాద్రి సమర్పణలో వడ్డే కిశోర నిర్మించే పై చిత్రంలో గిరీష్ కర్నాడ్ (జె.వి. సోమయాజులు), జయప్రద (మంజు భార్గవి), రాజలక్ష్మి (సాధనాసింగ్), సచిన్ (చంద్రమోహన్) ఆదిగా గలవారు పాల్గొంటు-న్నారు. లక్ష్మీకాంత్ ప్యారేలాల్ స్వర కల్పనలో ఢిల్లీకి చెందిన రాజన్ మిశ్రాతో పాటు ఎస్. జానకి పాడారు. వడ్డే శోభనాద్రి సమర్పించే ఈ చిత్రానికి సంకలన-కర్త జి. జి. కృష్ణారావు ప్రొడక్షన్ డిజైనర్.

"శంకరా భరణం" సోవియెట్ యూనియన్‌లో ప్రదర్శింపబడిన చోట్లల్లా ప్రశంస లందుకుంది. "సర్ గమ్" చిత్రం రష్యన్ భాషలోకి డబ్ చేయ-బడింది. కె. విశ్వనాధ్ సోవియెట్ రష్యా సహకారంతో శాంతి పరస్పరావగాహన, అంతర్జాతీయ మైత్రి ఇతివృత్తంగా ఒక సంగీత ప్రధానమైన చిత్రాన్ని నిర్మించే ఉద్దేశ్యంలో ఉన్నారు.

శ్రీ సారధి స్టూడియోస్ చిత్రాలు

"భారతీ రాజా ఎంతో ప్రతిభతో డైరెక్ట్ చేసిన 'పుదుమై పెణ్' తమిళ చిత్రం తమిళనాడులో

విడుదలైన ప్రతి చోటా హౌస్‌ఫుల్ కలెక్షన్ల‌ ప్రదర్శింపబడుతోంది. తమిళనాడు ప్రభుత్వం వినోదపు పన్ను మినహాయింపు కూడా పొందింది వర కట్న దురాచారాన్ని రూపు మాపే అంశం గల ఈ చిత్రం విశేషంగా మహిళలను ఆకర్షించడంలో అతిశయోక్తి ఏమీ లేదు. ఇదే చిత్రాన్ని భారతీ రాజా దర్శకత్వంలోనే సెప్టెంబరు 5 న మొదలెట్టాం అక్టోబర్ చివరికల్లా పూర్తయిపోతుంది." అన్నార శశిభూషణ్. ఈయన విశిష్టమైన రీతిలో నిర్మించే ఈ చిత్రంలో రేవతి, పాండ్యన్, ప్రతాప్ పోతన్ సుధాకర్, శాస్త్రి, కాకినాడ శ్యామల, శ్రీలక్ష్మి ఆదిగ గలవారు పాల్గొంటున్నారు. ఆత్రేయ రచన, ఇళయ రాజా సంగీతం అదనపు ఆకర్షణలు.

నవంబర్‌లో ప్రారంభమయ్యే ఈ సంస్థ 17 వ చిత్రానికి జంధ్యాల దర్శకుడు. ఎస్. గోపాలరెడ్డి ఛాయా గ్రాహకుడు.

మరో మల్టీ స్టారర్ చిత్రానికి భారీ సన్నాహాలు చేస్తున్నట్లు కూడా శశిభూషణ్ తెలియ జేశారు.

సెప్టెంబర్‌లో విడుదలయ్యే "అమ్మాయిలూ ప్రేమించండి!" కె. భాగ్యరాజ్ కథ, స్క్రీన్ ప్లే దర్శకత్వంతో పాటు తెలుగులో తొలి సారిగా నాయక పాత్ర నిర్వహించిన ప్రతిష్ఠాత్మక చిత్రం "గోవాలో వారం రోజుల పాటు షూటింగ్ ముగించుకు వచ్చాం" అన్నారు భాగ్యరాజ్ ఇటీవల ఎ. వి. ఎం. స్టూడియోలో కలిసినప్పుడు. అక్కడ 7 వ ఫ్లోర్‌లో ఆయన, రాధపై "మా అన్నకు ఎదురు లేదురా" అనే పాటే డాన్స్ చిత్రీకరణలో ఆయన గురువు భారతీ రాజా కెమెరా ఏంగిల్స్ సెట్ చేస్తూ కనిపించారు. "ఈ పిక్చర్‌లో మా గురువుగారు సినిమా డైరెక్టర్‌గా నటిస్తున్నారు. రిటైర్డ్ మేజర్‌గా శివాజీ గణేశన్‌గారు తనకు తానే సాటి అనిపించుకున్నారు. ఇంకా – రాధిక, పూర్ణిమ, యువరాణి, గెస్టులుగా ఊర్వశి, రాధ, నా అయిదుగురు చెల్లెళ్ళుగా సంయుక్త, ఉమ, కోకిల, బబిత, ప్రియ, తల్లిగా జానకి నటించారు" అన్నారు భాగ్యరాజ్. ఆత్రేయ గీతాలు, ఇళయ రాజా సంగీతం, పి. రామకృష్ణ ఛాయ, సెల్వనాధన్ కూర్పు, సోమయ్య శిల్పం, చిన్న – తార నృత్యాలు తెర వెనుక హంగులు.

భాగ్యరాజ్ తమిళ చిత్రం "ముందానై ముడిచ్చు" తమిళనాడులో నాలుగు కోట్లకు పైగా వసూలు చేసింది. మీ వ్యాపార కిటుకు ఏమిటని అడిగితే, "అతిశయాలు – అభూత కల్పనలు కాక నిజ జీవితంలో కనీ వినీ ఎరిగిన సంఘటనలతో నే మూడు నాలుగు మాసాలు దృష్టినంతా కేంద్రీకరించి కథను అల్లుతాను. అది రసవత్తరంగా తయారైతే గాని షూటింగ్‌ను ప్రారంభించను. అందుకే అందరికీ సంపూర్ణ సంతృప్తి నిచ్చే చిత్రాన్ని రూపొందించ గల్గుతున్నాను. తెలుగు సినిమా రంగంలో కూడా ఉన్నతమైన ఆశయాలు గల నిర్మాతలు, దర్శకులు, రచయితలు, కళాకారులు లేకపోలేదు. తెలుగు ప్రేక్షకులు సైతం ఉత్తమాభిరుచి గలవారే. కాని, ఎందుచేతో ఆక్షన్, సెక్స్ ముఖ్యాంశాలుగా చిత్రాలు తీయడానికి అలవాటు పడ్డారు. వాటిని చూడ్డానికి తెలుగు ప్రేక్షకులూ అలవడ్డారు. మధ్యన అప్పు

డప్పుడు ఒక విశిష్టమైన ఇతివృత్తంతో తయారైన చిత్రం వచ్చేసరికి వాళ్ళు విరగబడి చూస్తున్నారు. ఈ వ్యాపార రహస్యం యువ నిర్మాత శశిభూషణ్ గారికి బాగా తెలుసు. అందుకే నన్ను తెలుగు ప్రేక్షకుల దగ్గరికి తీసుకెళ్ళారు" అని భాగ్యరాజ్ వివరించారు.

కృష్ణంరాజు హీరోగా "రౌడి"

"పరుచూరి బ్రదర్స్ చక్కని కథ, సంభాషణలు సమకూర్చారు," అన్నారు మోహన్ గాంధి. ఈయన దర్శకత్వంలో శ్రీ విజయ రామ కంబైన్స్ అధినేత ఆట్లూరి తులసీదాస్ నిర్మించే "రౌడి"లో కృష్ణంరాజు, శారద, రాధ, భానుప్రియ, సత్యనారాయణ, గొల్లపూడి ప్రభృతులు నటిస్తున్నారు. చక్రవర్తి సంగీతం, ప్రసాద్‌బాబు ఛాయ, కె. రామ లింగేశ్వరరావు శిల్పం, జూడో రత్నం సాహసాలు, ఎం. నందకుమార్ సహ దర్శకత్వం, గౌతంరాజు కూర్పు నిర్వహిస్తున్నారు.


పూర్ణాహర గోపాల్ చిత్రం "న్యాయానికి సంకెళ్ళు"

"సస్పెన్స్, మిస్టరీతో పాటు సెంటిమెంట్ మిళితమైన ఇతి వృత్తం. ఆగస్టు 21 నుంచి 31 వరకు ఫస్టు షెడ్యూల్ జరిగింది. సెప్టెంబర్ 10 నుంచి 25 వరకు జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ ముగుస్తుంది. అక్టోబరులో రిలీజ్" అన్నారు పూర్ణా హర గోపాల్. ఈయన "సంగీత" చిత్రం అనంతరం దిగ్విజయ క్రియేషన్స్ పతాకంలో నిర్మిస్తున్న పై చిత్రంలో భానుచందర్, తులసి, శ్యామల గౌరి, జగ్గయ్య, రంగనాథ్, నూతన్ ప్రసాద్, వేలు, వీరభద్రరావు, శ్రీప్రియ, గెస్టులుగా రమాప్రభ, సూర్యకాంతం పాల్గొంటున్నారు. సత్యానంద్, సాయి-నాథ్ సంభాషణలు రాశారు. వేటూరి గీతాలకు చక్రవర్తి స్వరకర్త. బాబూరావు ఛాయ, భాస్కర-రాజు శిల్పం, కోటగిరి వెంకటేశ్వరరావు కూర్పుతో విద్యాసాగర్ దర్శకుడు.

డైరెక్టర్ కొమ్మినేని చిత్రాలు


"ఆగస్టు, సెప్టెంబర్‌లలో బాలాజీ ఆర్ట్సు వారి జానపద చిత్రానికి, అక్టోబర్, నవంబర్‌లలో కౌసల్య పిక్చర్స్ 'మంత్ర దండం' చిత్రానికి, డిసెంబర్, జనవరి మాసాల్లో జి. జి. ఆర్ట్సు 'గర్జించిన గంగ' చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నాను. ఇవి కాక రవి చిత్ర ఫిలిమ్స్ వై. వి. రావ్‌గారు తెలుగు, కన్నడ భాషల్లో నిర్మించే చిత్రాలు కూడా ఉన్నాయి" అన్నారు. కొమ్మినేని. పింజల బాలాజీ నిర్మించే బాలాజీ ఆర్ట్సు వారి చిత్రంలో నరసింహరాజు, తాళ్ళూరి రామేశ్వరి, వనిశ్రీ, కాంతారావు, ధూళిపాళ ప్రభృత నట వర్గం. చిల్లర భావనారాయణ కథ, మాటలు రాశారు. భీమవరపు బుచ్చిరెడ్డి సమర్పణలో బి. కౌసల్యారెడ్డి నిర్మించే 'మంత్ర దండం' జానపద చిత్రంలో శివకృష్ణ, ముచ్చెర్ల అరుణ, గుమ్మడి, కాంతారావు, సుదర్శన్, వేలు, వీరభద్రరావు వగైరా తారా సందోహం. కథ, మాటలు పేరాల రాశారు. హెచ్. ఎస్. వేణు ఛాయ గ్రాహకుడు. గన్నయ్య నిర్మించే "గర్జించిన గంగ" చిత్రంలో జయసుధ నాయిక. పై మూడు చిత్రాలకూ చక్రవర్తి సంగీత దర్శకుడు. కొమ్మినేని దర్శకత్వంలో వై. వి. రావ్ కన్నడంలో నిర్మించిన "కొంటె కోడళ్ళు" చిత్రం త్వరలో కర్నాటక రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాలలో విడుదలవబోతోంది.

శ్రీ ఎన్. టి. ఆర్. కి సినీ ప్రముఖుల మద్దతు



ప్రజా సేవకు కంకణం కట్టుకుని, ప్రజా శ్రేయస్సుకోసం అహోరాత్రులు శ్రమించే 'అన్న'కు వెన్నుపోటు తీరని అన్యాయం. మళ్ళీ రామరాజ్యాన్ని ప్రతిష్టిద్దాం. ఈ సాధనలో అన్యాయాన్ని ఎదిరించడంలో నేనూ ఉన్నాను.

—————— -మోహన్‌బాబు



అలసిన గుండెతో అనారోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా రామరాజ్యాన్ని పునః ప్రతిష్ఠించాలనే దృఢ సంకల్పంతో అన్న రామన్న చేస్తున్న తీవ్ర కృషికి దేశ వ్యాప్తంగా ప్రజల అండ ఉండనే ఉంది. న్యాయం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరిగే మహా యజ్ఞంలో నేనెప్పుడూ భాగస్వామినే.

—————— -మురళీమోహన్

ఎన్. టి. రామారావుగారి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడం దారుణం..... అక్రమం..... అన్యాయం.... అది శ్రీ ఎన్. టి. ఆర్. కు జరిగిన ద్రోహం కాదు; ఈ ప్రజాస్వామ్య దేశంలో ప్రజాస్వామ్యానికే జరిగిన తీరని ద్రోహం. ఈ వెన్నుపోటు చర్యను ఖండించడం పరిశ్రమలో ప్రతి ఒక్కరి బాధ్యత; దేశంలోని ప్రతి పౌరుడి ధర్మం. ఈ బాధ్యతను, ధర్మాన్ని కాదని ఎవరైనా అంటే వారికి ప్రజలే బుద్ధి చెప్తారు. అది ఇటీవల రుజువైన నిజం.

—————— -ఎస్. గోపాల్‌రెడ్డి, చిత్ర నిర్మాత
(భార్గవ్ ఆర్ట్సు ప్రొడక్షన్స్)

"దర్జా దొంగ"

"క్రయిమ్ చిత్రాలతో తమిళనాడులో సంచలనం కలిగించిన డైరెక్టర్ మణివన్నన్. ఈయన 'నూరవ రోజు' డబ్బింగ్ చిత్రం విడుదలైంది. '24 గంటలు' డబ్బింగ్ జరుగుతోంది. ఈయన్నే మా మొదటి చిత్రానికి దర్శకునిగా నియమించాం" అన్నారు ఆర్. రామకృష్ణంరాజు. భీమవరంలో థియేటర్ యజమాని అయిన ఈయన 'భార్యా భర్తల సవాల్' చిత్ర నిర్మాతల్లో ఒకరు. శ్రీ విజయలక్ష్మీ ఆర్ట్సు బానర్‌లో తయారయ్యే పై చిత్రంలో సుమన్, విజయశాంతి నాయకా నాయికలు. శాయినాథ్ మాటలు, వేటూరి గీతాలు, ఇళయ రాజా సంగీతం, సభాపతి ఛాయతో ఈ చిత్రాన్ని సమర్పించే కలిదిండి రామచంద్రరాజు "అక్టోబర్ నవంబర్‌లలో 1–15 తేదీల మధ్య జరిగే రెండు షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తవుతుంది. పాటలను ఊటీలో పిక్చరైజ్ చేస్తాం. సంక్రాంతి విడుదల" అని తెలిపారు.

సినిమా

కృష్ణ సమర్పణలో, జంధ్యాల దర్శకత్వంలో "శ్రీవారి శోభనం"

"నరేష్ సరసన గాయని అనితారెడ్డి నాయిక. మరో హీరోయిన్‌గా చిత్ర అనే వనితను పరిచయం చేస్తున్నాం. మల్లాదివారి 'పెద్దలకు మాత్రమే' నవల ఆధారం" అన్నారు జంధ్యాల. ఈయన సంభాషణలు, దర్శకత్వంలో ఎం. ఎస్. ప్రసాద్, స్వర్గీయ ఆదుర్తి సుబ్బారావు పుత్రుడు ఆదుర్తి భాస్కర్ నిర్మించే రవి కళా మందిర్ వారి పై చిత్రంలో శ్రీ లక్ష్మి, వేలు, వీరభద్రరావు, సాక్షి రంగారావు, కె. కె. శర్మ, లక్ష్మీకాంత్, అనుపమ, హేమసుందర్, రాధా కుమారి తక్కిన నటవర్గం. వేటూరి గీతాలు, రమేష్ నాయుడు సంగీతం, కోటేశ్వరరావు ఛాయ, తోట యాదు శిల్పం, గౌతమ్‌రాజు కూర్పుతో ఆగస్టు 6 నుండి సెప్టెంబర్ 5 వరకు ఒకే షెడ్యూల్‌లో చిత్రీకరణ ముగుస్తుంది.

మోహన్‌బాబుతో సూర్య నారాయణ బాబు చిత్రం

"పద్మావతి, పద్మాలయ సంస్థలలో దర్శకత్వ శాఖలో అనుభవం గడించిన కంచెర్ల పూర్ణచంద్రరావుని డైరెక్టర్‌గా పరిచయం చేస్తున్నాం" అన్నారు యు. సూర్య నారాయణబాబు. ఈయన పద్మావతి కంబైన్స్ బానర్‌లో నిర్మించే చిత్రంలో మోహన్‌బాబు సరసన మాధవి నాయిక. సత్య నారాయణ, కాంతారావు, వేలు, వీరభద్రరావు, డాక్టర్ శివ ప్రసాద్, జీవా, మమత, దేవి, రాజశేఖరరెడ్డితో పాటు మరి కొందరు ప్రముఖ కళాకారులు పాల్గొంటారు. సత్యానంద్ సంభాషణలు, చక్రవర్తి సంగీతం, పుష్పాల గోపీకృష్ణ ఛాయ, కోదండం శిల్పం, బాబు సాహసాలు, సీను నృత్యాలు, కోటగిరి గోపాలరావు కూర్పు నిర్వహిస్తున్నారు. "సెప్టెంబర్ 7 నుండి నెల రోజుల పాటు నిర్విరామంగా జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది" అన్నారు ఈ చిత్రాన్ని సమర్పించే కె. సి. ఎన్. చంద్రశేఖర్.



దుస్తులు మితంగా వేసుకుంటాను కాబట్టి ఆ పేరు పెట్టుకున్నాను.


కృష్ణా ఆర్ట్ క్రియేషన్స్ ద్వితీయ చిత్రంలో సుమన్

"సుమన్ హీరో అనగానే కరాటే, జూడో లాంటి ఫైట్స్‌కి కొదవ ఉండదు కదా? సెంటిమెంట్ కూడా ఉన్న కథను సిద్ధం చేశాం" అన్నారు బి. గోపాలరెడ్డి. "తాండవ కృష్ణుడు" అనంతరం ఈయన సమర్పించే పై సంస్థ ద్వితీయ చిత్రానికి బి. మురళీ కృష్ణారెడ్డి నిర్మాత. "సాంగ్స్ అన్నీ సెప్టెంబరులో రికార్డ్ చేసి, షూటింగ్ ప్రారంభిస్తాం" అన్నారు డైరెక్టర్ పి. చంద్రశేఖరరెడ్డి.

"ఎదురులేని మొనగాళ్ళు" శ్యామలగౌరి




మోహన్‌బాబు, "పాపికొండలు"




ఇది ప్రేమవ్యూహంలో చిక్కుకున్న ఓ అభిమన్యుని ప్రేమకథ!
కె.నరసింహనాయుడు
దాసరి నారాయణరావు
యువచిత్ర
VAMSEE PUBS
అభిమన్యుడు
నిర్మాత: కె.మురారి
సంగీతం: కె.వి.మహదేవన్; కెమెరా: కె.శ్రీహరి


శ్రీలక్ష్మీప్రసన్న పిక్చర్స్
నిర్మాత:
దర్శకత్వం:
మోహన్‌బాబు. యమ్. కె.యస్.ఆర్.దాస్
LA PUBS



ఉష ఆ రోజంతా అతని కోసం ఎదురుచూస్తూనే గడిపింది బాంక్‌లో !

అంతకుముందురోజు అతనలా హఠాత్తుగా వెళ్ళిపోయాక ఆమె మనసు పరిపరివిధాలుగా ఆలోచించసాగింది.

ఎందుకలా వెళ్ళిపోయేడు ? తనేమయినా కోపం కలిగేలా ప్రవర్తించిందా ? లేక అతని మూడ్స్ అలా త్వరత్వరగా మారిపోవడం అతని తత్వమా ?

అరుణ, శాంతి ఆమె దగ్గరికొచ్చారు.

"ఇవాళ ఓవర్‌టైమ్ చేయాలనుకుంటున్నారా ?" నవ్వుతూ అడిగింది అరుణ.

ఉష ఆలోచనల్లో నుంచి తేరుకుని వారితోబాటు బయటకు నడిచింది.

శాంతి వెళ్ళిపోవడంతో తామిద్దరే మిగిలారు బస్‌స్టాప్ దగ్గర.

"ఏమిటి ? దీర్ఘంగా ఆలోచిస్తున్నారు ?" అడిగింది అరుణ.

ఉష సిగ్గుపడింది తన పరధ్యానానికి.

"ఓ విషయం గురించి ఆలోచిస్తున్నాను" అంది నిజం చెప్పేసూ.

"ఏన్నీ ప్రాబ్లెమ్ ?"

"ఊహూ, అదేంకాదు. జస్ట్ అయామ్ వర్రీడ్."

(గత సంచిక తరువాయి)

"అయితే మా ఇంటికెళ్దాం పదండి ! కాసేపు కబుర్లు చెప్పుకున్నాక వెళ్దురుగాని."

ఉష మారు మాట్లాడకుండా ఆమెతో పాటు బయల్దేరింది.

ఇల్లు చేరుకునేసరికి గేటుదగ్గర ఎదురుచూస్తున్న ఓ ఆరేళ్ళ పాప పరుగుతోవచ్చి అరుణను చుట్టేసుకుంది.

"మమ్మీ ..."

పాపను ఎత్తుకుని ముద్దుపెట్టుకుంది అరుణ.

"ఆంటీకి నమస్తే చెయ్—"

"నమస్తే ఆంటీ—" ఉషను చూచి నమస్కారం చేసింది పాప.

"నమస్తే— నీ పేరేంటి?" అడిగింది ఉష.

"కవిత !"

అందరూ లోపలకు నడిచారు.

కాంపౌండ్‌లో నాలుగు వాటాలున్నాయ్. ఒకదాంట్లో అరుణ ఉంటోంది.

ముగ్గురూ కలసి బిస్కెట్లు తిని 'టీ' తాగారు.

కవిత కాంపౌండ్‌లోనే మిగతా పిల్లలతో ఆడుకోడానికి పరుగెత్తింది.

"మిమ్మల్నో విషయం అడగవచ్చా ?" అంది ఉష అరుణతో.

"ఎందుకడక్కూడదు ?"

"ఈ పాప— మీ పాపేనా ?"

"అవును !" నవ్వుతూ అందామె.

"అంటే... మీకు... పెళ్ళయిందా ?"

"చాలా కాలం కిందటే అయింది —"

"అయితే మరి ..."

"మీరేం అడగాలనుకుంటున్నారో నాకు తెలుసులే ! విజయ్‌తో ఎందుకు తిరుగుతున్నావ్ అని కదూ ? నేను మా ఆయనను వదిలేశాను."

ఉష తెల్లబోయింది. నోట్లోంచి మాట పెగల్లేదు.

"వాడొక మృగం ! డబ్బంటే పడిచచ్చే నికృష్టుడు తీసుకున్న కట్నం చాలక ఇంకా ఇంకా డబ్బు తెమ్మనీ, వస్తువులు తెమ్మనీ వేధించుకు తినేవాడు. వాడికి తోడు వాళ్ళమ్మ, వాళ్ళ చెల్లెళ్ళు — అందరూ కలిసి నన్ను చిత్ర హింసలు పెడుతూండేవారు. ఆ పరిస్థితుల్లో నా ప్రాణానికే రక్షణలేదని తెలుసుకుని నేనే వాడిని వదిలేసి మా ఇంటికొచ్చేశాను. ఈ ఉద్యోగం దొరికింది అదృష్టవశాత్తూ. ఇప్పుడు విజయ్‌తో స్నేహం అయింది. అతనికి నా గురించి అంతా చెప్పాను— అయినా నన్ను చేసుకుంటానని పట్టుబట్టాడు. త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నాం —"

ఉష చాలాసేపు ఆశ్చర్యం నుంచి తేరుకోలేకపోయింది.

"మరి మీరిలా వచ్చేశాక మీభర్త మిమ్మల్ని తీసుకెళ్ళడానికి ప్రయత్నించలేదా ?"

"వాడికెందుకా బాధ ? నన్ను వదిలించుకుంటే మళ్ళీ కట్నం కానుకలు తీసుకుని పెళ్ళి చేసుకోవచ్చుగదాని ఆలోచనలో వున్నాడు. అందుకే వెంటనే విడాకులు కావాలని కోర్టుకెక్కాడు. త్వరలో అదికూడా సెటిలయిపోతుంది లెండి ! కానీ తమాషా చూశారా ! వాడెంతో రోగ్ అనేందుకు చక్కటి కారణం ! నేను బాంక్‌లో పని చేస్తున్నానని తెలుసుకుని ఈ మధ్య— అంటే పదిహేను రోజుల క్రితం ఇక్కడికొచ్చాడు.

జరిగిందేదో జరిగిపోయింది ! ఇంటికి రమ్మని అడిగాడు ! ఎందుకో తెలుసా ? నాకొచ్చే జీతంకోసం అన్నమాట ! నామీద ప్రేమకాదు !"

"మరి మీరేమన్నారు ?"

"నోర్మూసుకుని బయటకు పొమ్మన్నాను. లేపోతే అందరినీ పిలిచి బయటకు గెంటిస్తానని చెప్పాను.—

అప్పుడు గానీ వెళ్ళలేదు—"

ఉష అదంతా జరిగిందంటే నమ్మలేక పోతోంది.

'అంత ధైర్యం ఎలాగు కలుగుతుంది ఓ స్త్రీకి ? భర్త వదిలివేసిన స్త్రీలు కనబడుతూంటారు సాధారణంగా ! నరిక్కడ అరుణే

జరిగిన కథ—14 : కృష్ణ అన్న, వదినలకు భారంగా ఉండటం ఇష్టంలేక ఉద్యోగాన్వేషణకై హైద్రాబాదు వెళుతాడు. ప్రసాద్ సహాయంతో అక్కడ దీపిక పత్రికాఫీసులో ఉద్యోగంలో చేరుతాడు. 'దీపిక' పత్రికాధిపతి రాజయ్య కూతురు జయలక్ష్మి కృష్ణతో స్నేహం చేయాలని ఉవ్విళ్ళూరుతుంది. కృష్ణ వేరే గది అద్దెకు తీసుకొని ప్రసాద్ ఇంటినుండి షిఫ్ట్ అయి వెళ్ళిపోతాడు. కృష్ణ సహోద్యోగిని ఉష అతనికి చేరువ కావాలని ఆరాటపడుతుంది. కృష్ణ ఆమెతో తన చరిత్ర మంచిదికాదని చెప్పి తనకు దూరంగా ఉండమని హెచ్చరిస్తాడు. రాజయ్య కూతురు జయలక్ష్మి కృష్ణను ఆకర్షించాలని చేసిన ప్రయత్నం విఫలమౌతుంది. ఉషకు బ్యాంక్‌లో ఇంటర్వ్యూ వచ్చింది. కృష్ణ 'దీపిక' ప్రెస్సులో రాత్రనక పగలనక పనిచేస్తూ ఉంటాడు. ఉషకు బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. రాజయ్య 'దీపిక' పత్రికను ఆపేస్తాడు. కృష్ణకు ఉద్యోగం ఊడింది. కృష్ణ, ఉషలు తమకు ఒకరిపై ఇంకొకరికి గల ప్రేమను ఎలా తెలియచెప్పాలా ! అని ఆలోచిస్తు ఉంటారు. కృష్ణ, ఉషలు పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకొంటారు. ఉష ఇంటికి వెళ్ళిన కృష్ణ వాళ్ళ ఫేమిలీ ఆల్బమ్‌లో సావిత్రి ఫోటో చూసి షాక్ తింటాడు. సావిత్రి ఉషకు అక్క అని తెలుసుకొని మనశ్శాంతిని కోల్పోతాడు.

భర్తను వదిలేసింది అతని రాక్షసత్వంతో విసిగి. ఎంతో గుండె నిబ్బరం కావాలి— తన పాపతోసహా భర్తను వదిలి వచ్చిందంటే— ఎంత ఆత్మ విశ్వాసం కావాలి? ఆ ఆత్మవిశ్వాసాన్ని ఈ సంఘం ఇస్తోందా? లేదే! అలాంటి స్త్రీలను సర్వనాశనం చేస్తుంది సంఘం! మరింకెక్కడి నుంచి ఆమెకా మనోబలం వచ్చింది?'

''ఏమిటాలోచిస్తున్నారు?'' అడిగింది అరుణ నవ్వుతూ.

''మీకింత ధైర్యం ఎలా కలిగిందా అని!'' తనూ నవ్వుతూ అంది ఉష.

''చిన్నప్పటినుంచీ పత్రికలు, న్యూస్



పేపర్లు చదవడం నాకు అలవాటు. అందులో ఎక్కువగా కనిపించే స్త్రీల ఆత్మహత్యలు నాకెంతో కలవరం కలిగించేవి. శీలం పోగొట్టుకుంటే ఆత్మహత్య! కట్నాలకోసం, లేదా మరో వస్తువుకోసం, భర్త హింసిస్తే ఆత్మహత్య! కోరుకున్నాడితో పెళ్ళి కాకపోతే ఆత్మహత్య! కోరుకున్నాడినే చేసుకుని, ఆ తరువాత వాడింకే ఆడదాన్నయినా చేరదీస్తే ఆత్మహత్య - భర్త తన శీలాన్ని శంకిస్తే ఆత్మహత్య — అన్నీ ఇవే కారణాలు — వీటన్నిటికీ ఆడదే చావాలి; ఒక్క మొగాడుకూడా ఆత్మహత్య చేసుకోడు! ఎందుకని? వాడికిలాంటి మూఢనమ్మకాలు లేవు. సెంటిమెంట్స్ లేవు. దయ్యా, దాక్షిణ్యం ఇవేమీలేవు. అందుకే వాడు ఆత్మహత్య చేసుకోడు. కానీ మన ఆడాళ్ళల్లో నూటికి తొంభయ్‌మందికి సరయిన చదువు లేదు. చదువున్నవాళ్ళకి ఆ పుస్తకాల పరిజ్ఞానం తప్పితే లోకజ్ఞానం లేదు. ఆలోచించే శక్తి లేదు, చచ్చేబదులు ఆ మగాడిని వదిలేసి మన బ్రతుకు మనం బ్రతుకుదాం అన్న ఆలోచన లేదు. కనీసం ఆ ప్రయత్నంకూడా లేదు.

అసలు ఆడదాన్ని మొగాడు 'శీలం' అనే పదంతో నరకంలోకి తోసేశాడు. ఆమె ఆ బురదలోనుంచి ఇన్ని యుగాలయినా అలాగే కూరుకుపోయి ఉంది, తనున్నది బురదలో అని తెలీదు. అందులోనుంచి లేచి బయటపడాలన్న ఆలోచన లేదు...'' ఆవేశంగా అందామె.

ఉష తెల్లబోయి వింటూండిపోయిందామె మాటలు.

''చివరకు నాకే భర్త, అత్తమామల రాక్షసత్వం ఎదురయేసరికి సహించలేకపోయాను. శక్తి ఉన్నంతవరకూ వారి రాక్షసత్వాన్ని ఎదుర్కొన్నాను. వారిలో మార్పు రాదు అని తెలుసుకున్న మరుక్షణం ఆ నరకంనుంచి బయటపడ్డాను.

నాకేమనిపించిందో తెలుసా?

అలాంటి కర్కోటకుడయిన భర్త దగ్గర పడి ఉండడంకంటె, వ్యభిచారం చేసుకుని పొట్టపోసుకోవడం మంచిదనిపించింది. అవునా, కాదా నువ్వే చెప్పు! అలాంటి భర్త దగ్గరపడి వుండాల్సిన అవసరం ఏమిటి? కేవలం తిండి కోసం! మరి వ్యభిచారమూ తిండికోసమే! ఏమిటి తేడా?''

ఉష టైమ్ చూచుకుని బయల్దేరడానికి సిద్ధపడింది.

''మీకు బాగా బోర్ కొట్టేశాను కదూ?'' అంది అరుణ నవ్వుతూ.

''లేదు – ఆలోచించవలేశారు.''

ఉష ఇంటికి చేరుకుంది. ఆమెకు సావిత్రి గుర్తుకొచ్చింది. ఆత్మహత్య చేసుకోవడం అక్క తప్పా ? ఏమీ అర్థం కావటం లేదామెకి. మర్నాడు సాయంత్రం వరకూ కృష్ణ కోసమే ఎదురుచూస్తూ కూర్చుంది బాంక్‌లో. సాయంత్రం అయిదు దాటుతుండగా వచ్చాడతను.

''నిన్నటి నుంచీ చూస్తున్నాను మీ కోసం'' ఆనందంతో అందామె.

అతను బలవంతంగా చిరునవ్వు నవ్వాడు.

''ఇలా కూర్చోండి!'' అందామె.

అతను ఆమె పక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

''స్కూల్లో జాయినయరా?'' అడిగిందామె.

''ఊహు! లేదు!''

''ఎందుకని ?'' ఆశ్చర్యంతో అడిగింది.

అతను మాట్లాడలేదు.

ఆమెకు లోలోపల ఏదో భయం వేసింది.

అతనిలో ఏదో మార్పు కనబడుతూనే ఉంది.

ఏం జరుగబోతోంది ?

''మీరింకెంతసేపుండాలి ఇక్కడ ?'' అడిగాడతను.

''ఇంకో పదినిమిషాలు !''

అతను మళ్ళీ మౌనం వహించాడు.

ఆమె తన పని చూసుకోసాగింది.

టైము అయిదున్నర అయిపోయింది.

''ముహూర్తం కనుక్కొచ్చారా ?'' లేచి నిలబడుతూ అందామె.

''ఊహు!''

ఈసారి 'ఎందుకని' అని అడగలేదు.

అడిగినప్పుడు అతను మళ్ళీ జవాబివ్వకుండా మౌనం వహిస్తాడేమోనని భయం.

ఇద్దరూ రోడ్డుమీద కొచ్చారు.

''మా ఇంటికెళ్దామా ?'' అడిగిందామె.

''మీతో ఓ విషయం మాట్లాడాలి—కాసేపు

జీవితం - సెంటిమెంట్

పబ్లిక్ గార్డెన్‌లో కూర్చుందాం.'' బెరుగ్గా అన్నాడతను.

ఆమెలో కలవరపాటు ప్రారంభమయిపోయింది

పెదాలమీద చిరునవ్వు మాయమయింది.

ఏం మాట్లాడాలనుకుంటున్నాడతను ? అంత అర్జంటుగా మాట్లాడాల్సిన ఆ విషయం ఏమయి వుంటుంది ?

ఒకవేళ తను పెళ్ళికి ఏమయినా అడ్డంకు లొచ్చాయా ?

అతని అన్నా వదినలు అడ్డు చెప్పారా ?

లేక మరింకేదయినా సమస్యా ?

''పదండి...'' అందామె.

ఆటోలో ఇద్దరూ గార్డెన్ చేరుకున్నారు.

''ఏమిటి మాట్లాడాలన్నారు ?'' ఓ చోట కూర్చోగానే ఆత్రుత పట్టలేక అడిగిందామె.

''నేను చెప్పేది విని మీరు నన్ను అసహ్యించుకుంటారని నాకు తెలుసు. ఇంక జన్మలో ఎప్పటికీ నన్ను చూడడానికి ఇష్టపడరనికూడా తెలుసు, అయినా రాత్రంతా ఆలోచించి ఈ నిజం మీకుచెప్పాలనే నిర్ణయించుకున్నాను.

మీకు ఈ నిజం తెలియకుండా దాచి మిమ్మల్ని నేను దక్కించుకోగలను. నా జీవితం నాశనం అవకుండా కాపాడుకోవచ్చు. కానీ ఎంత కాలం ? ఏదొకరోజు నిజం బయట పడక మానదు. అప్పుడు మీ దృష్టిలో పొందే నీచత్వం కంటే ఇప్పుడే అన్నీ మీకు తెలియ జేయటం మంచిదనిపించింది. అదీగాకుండా మీ దగ్గర ఓ నిజాన్ని దాచటం నాకు సాధ్యం కాని పని ! ఎంతో కాలం అబద్ధాలతో జీవించాను. చివరకు ఆ జీవితం నుంచి విముక్తి పొందాను. ఇప్పుడు మళ్ళీ ఆ బ్రతుకుని ఎందుకు ఆహ్వానించాలి ? అందుకే అంతా చెప్పేస్తాను...''

అతని మాటలు వింటూంటే ఉష మొఖం పాలిపోయింది. గుండెలు వేగంగా కొట్టుకోసాగినయ్. బొమ్మలా చలనం లేకుండా అతని వంక చూస్తూండిపోయింది.

''నిన్న మీరు మీ ఇంట్లో ఫొటో ఆల్బమ్ చూపించారు నాకు! అందులో మీ అక్కయ్య ఫొటో చూసేవరకూ నాకు తెలీదు — మీరు సావిత్రి చెల్లెలని. నాకు మతిపోయినట్లయింది. మీకోసారి చెప్పాను గుర్తుందా ?

నా చరిత్ర వింటే నన్ను అభిమానించి నందుకు మీరే పశ్చాత్తాపడతారని ! ఆ చరిత్ర సావిత్రి ఉషగారూ !

మీ అక్కయ్య ఆత్మహత్య చేసుకోడానికి ఓ రోగ్ చేసిన మోసం కారణమని మీరన్నారు చూడండి !

ఆ రోగ్‌ని నేనే !

నేనే ఆమె అందానికి మోజుపడి, మాయ మాటలతో ఆమెను వలలో వేసుకున్నాను.

అలా ఎందరో అమ్మాయిలను అలాంటి మాయలతోనే సొంతం చేసుకున్నాను.

కానీ సావిత్రికి ఆ విషయం తెలీదు.

నేను తనను ప్రేమించడం నిజమని నమ్మింది. తనూ నన్ను గాఢంగా ప్రేమించింది. తనను తప్పకుండా పెళ్ళి చేసుకుంటానన్నమాట తీసుకుని నాకు తన సర్వస్వం అర్పించింది.

తర్వాత నేను పెళ్ళి చేసుకోనని చెప్తే ఆమె బాధపడేదేమో– లేదా జీవితాంతం అవివాహితగానే మిగిలిపోయేదేమో !

కానీ నేను తనను ప్రేమించడం అంతా నటననీ, నాకు సావిత్రిలాంటి అమ్మాయిలు చాలా మంది ఉన్నారనీ తెలుసుకున్నాక ఆమె ఆ నిజం భరించలేకపోయింది. ఆ షాక్‌కి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది. అసలే ఆడపిల్లా అలా ప్రవర్తిస్తుందని నాకు తెలీదు.


సావిత్రికంటే ముందు మా చెల్లెలే మరో వ్యక్తి మోసానికి గురి అయి ఆత్మహత్య చేసుకున్నప్పుడు నేను కళ్ళు తెరిచాను, నేను సావిత్రికి తలపెట్టిన అన్యాయానికి పశ్చాత్తాపపడ్డాను. ఆమెను వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని వైజాగ్ చేరుకునేసరికే ఆమె ఆత్మహత్య చేసుకుంది...''

కన్నీటిని కర్చీఫ్‌తో తుడుచుకున్నాడతను.

ఉష నిశ్చేష్టురాలయింది.

కోపం, ఉక్రోషం, బాధ అన్నీ మిళితమయి ఎటూ తెలీని అయోమయ స్థితి.

''సావిత్రి ఆత్మహత్య నాకు జీవితం మీదే విరక్తి కలిగించింది ఉషా! నామీద నాకే రోత పుట్టింది. నన్ను నేను మర్చిపోయే ప్రయత్నంలో ఉండగా మీరు కనిపించారు. నన్ను మళ్ళీ మామూలు మనిషిని చేశారు. నాకు తెలీకుండానే నా గుండెల్లో నిండిపోయేరు. మీ సాన్నిధ్యంలో



గతం అంతా ఓ పీడకలగా మర్చిపోగలనని ఆశ పడ్డాను—

ఇదే మీకు చెప్పాలనుకున్న విషయం!

ఇప్పుడు మీరేం చేసినా సమ్మతిమే! నన్ను క్షమించమనీ వివాహం చేసుకొమ్మనీ అడిగే అర్హత నాకు లేదు,''

అతను తల వంచుకుని కూర్చున్నాడు.

ఉషకు అతనివంక చూడబుద్ధి కావటం లేదు.

అతని నుంచి దూరంగా పారిపోవాలనుంది.

మరోసారి అతని మొఖం చూడకూడదనీ ఉంది.

అతనితో ఏమీ మాట్లాడాలనిపించడంలేదు.

ముందు తనకు ఏకాంతం కావాలి.

ఇప్పుడేమీ ఆలోచించే స్థితిలో లేదు తను.

అసలు ఇదంతా నిజమని నమ్మబుద్ధి కావడంలేదు.

తన అక్కయ్యను ఆత్మహత్యకు గురిచేసిన వ్యక్తినే తనూ ప్రేమించిందా?

అతను లేనిదే తన జీవితమే లేదనుకుంటుందా?

అతనినే వివాహం చేసుకుని అతనికి తన జీవితం పంచబోతూందా?

నిజమే! అతనంటే అసహ్యంగా ఉంది.

ఇంక అతనిని చూడకూడదనీ ఉంది.

సావిత్రి గుర్తుకొచ్చింది ఉషకి.

ఆరోజు ఆమె ఇంట్లో ఫాన్‌కి తాడు కట్టి ఉరి వేసుకుని వేలాడుతూండగా తను చూసిన దృశ్యం గుర్తుకొచ్చింది.

తన తల్లి ఆ దృశ్యం చూస్తూనే స్పృహ తప్పటమూ గుర్తుకొచ్చింది.

ఎవరో ఒకతను చేసిన మోసానికే ఆమె ప్రాణం తీసుకుందన్న విషయం తెలిసినప్పుడు వాడిని తన చేతులతో చంపాలని అనిపించడమూ గుర్తుకొచ్చింది.

లేచి నిలబడింది ఉష.

అతను కదలిక లేకుండా, అలాగే కూర్చున్నాడు.

ఆమె నెమ్మదిగా అక్కడి నుండి వచ్చేస్తూన్నా అతను నోరు మెదపలేదు.

ఉష రోడ్డుమీదకొచ్చి రిక్షాలో ఇంటికి బయల్దేరింది.

కృష్ణ పూర్తిగా కృంగిపోయాడు.

ఇంక తామిద్దరూ కలుసుకోరు.

ఒకరికొకరు ఏమీకారు! అంతే!

ఒక్కసారిగా, నిస్సత్తువ ఆవహించింద తనిని.

అక్కడే గడ్డిమీద ఒరిగిపోయాడు.

''ఏమిటలా ఉన్నావివాళ?'' అడిగింది శాంతి లంచ్‌బ్రేక్‌లో.

ఉష బలవంతంగా నవ్వింది.

''ఎలా వున్నాను?''

''వర్ణించడం నాకు చేతకాదుగానీ రోజూలా మాత్రం లేవు...''

''అవును!'' వప్పుకుంటూ అంది ఉష.

''సంథింగ్ రాంగ్?''

''యస్...''

''ఏం జరిగింది?''

ఉష ఏమీ మాట్లాడలేదు.


''చెప్పటం ఇబ్బందిగా ఉంటే మానెయ్! నో కంపల్షన్...'' అంది శాంతి.

''చెప్పకూడదనికాదు. కానీ ఇంకోసారి చెప్తాను...''

''అయితే ఇంక ఆ సింపథిటిక్ ఫోజ్ తీసెయ్!...'' నవ్వుతూ అందామె.

ఉష నవ్వేసింది.

సాయంత్రం వరకూ ఆమె తన తక్కనే ఉండడంతో ఉష కొంతవరకూ తన మనసులోని ఆలోచనలను పక్కకు నెట్టివేయగలిగింది. బాంక్ నుంచి ఇంటికి బయల్దేరేసరికి ఒక్కసారిగా మనసంతా విషాదం నిండిపోయింది. ఆ రోజంతా మళ్ళీ అతను తనకోసం వస్తాడేమోనని ఎదురు చూస్తూనే ఉందామె. అలా వస్తే తన మనసులోని కోపమంతా వెళ్ళగక్కాలనీ— మరోసారి తన కోసం రాకుండా చేయాలనీ అనుకుంది.



ఇటీవల విజయవాడ రోటరీక్లబ్బు అధ్యక్షులు డాక్టర్ జంధ్యాల శంకర్, కవి సామ్రాట్ పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారికి పుష్పకిరీట సన్మానం చేసిన అనంతరం ప్రసంగిస్తున్న శ్రీ శాస్త్రి. శ్రీ పి. వి. సత్యనారాయణమూర్తి, శ్రీ హనుమాన్‌గుప్తగారలను కూడా చిత్రంలో చూడవచ్చు.

కానీ అతను రాకపోవడంతో — ఇంక అతను రాడని తెలిసిపోయింది.

అతనిని పూర్తిగా మర్చిపోవాలనీ, అతని మీద ఎలాంటి జాలీ ఉండకూడదనీ తను నిశ్చయించుకుంది.

ఆ నిర్ణయం తీసుకున్నాకే రాత్రి తనకు నిద్ర పట్టింది.

తన అక్కయ్య ప్రాణం తీసినవాడి గురించి ఆలోచనలతో తన మనసు పాడుజేసుకోవడం వ్యర్థం!

అతనిలో ఎంత మార్పుయినా రానీ! చేసిన తప్పుకి అతనెంత పశ్చాత్తాప పడినా సరే —

తను మాత్రం అతనిని క్షమించడం అసాధ్యం.

ఎంత వద్దనుకున్నా ఆమె మనసులో అశాంతి దూరం కావడం లేదు. ఊహల్లో అతనితోపాటు ఎంతో దూరం ప్రయాణం చేసింది తను.

ఇప్పుడు అకస్మాత్తుగా వెనక్కురావడం ఎలా? అకస్మాత్తుగా ఆ ఊహల్ని చెరపడం ఎవరికి సాధ్యం ?

''ముహూర్తం సంగతి ఏమయినా కనుక్కున్నాడా అతను ?'' అడిగిందామె తల్లి.

ఉషకేం జవాబు చెప్పాలో తెలీలేదు.

కానీ ఏదొక అబద్ధం చెప్పాలి.

జరిగిందంతా ఆమెకు చెప్పి ఆమెను కూడా బాధపెట్టటం తన కిష్టం లేదు.

''పెళ్ళి కొద్దిరోజులు వాయిదాపడిందమ్మా!''

ఆమాటతో పిడుగు పడినట్లు కంపించి పోయిందామె.

తన పెద్ద కూతురు సావిత్రి ఆమె కళ్ళ ముందు మెదిలింది.

జీవితం—సెంటిమెంట్

''అతను మా స్నేహితురాలి అన్నయ్యమ్మా! నేనంటే ఎంతో ఇష్టం! నన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడమ్మా!''

అంది సంబరంగా ఆ రోజున.

తను ఆనందంగా పొంగిపోయింది.

ఆమె తన కిష్టమయిన వ్యక్తిని చేసుకుంటే ఇంక తనకంటె కావల్సిందేముంది ?

కానీ తన ఆనందం ఎంతకాలం నిలిచింది?

''అతను ఏదో చాలా ముఖ్యమయిన పని మీద ఉన్నాడమ్మా! కోర్టు చుట్టూ తిరుగుతున్నాడు. అందుకని పెళ్ళి ప్రస్తావానికి వాయిదా పడింది...''

తన గుండెల్లో రాయి పడినట్లయింది.

అదే మాట మరో రెండు మూడు సార్లు చెప్పింది సావిత్రి! అంతే! ఆ తరువాత ఇంక ఆ మాట చెప్పేందుకు మొఖం చెల్లక తనే మిగిలకుండా పోయింది.

ఇప్పుడు మళ్ళీ అదే మాట చెప్తోంది ఉష.

ఆమె గుండెలు వేగంగా కొట్టుకోసాగినయ్. కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

అక్కడే కుప్పగా కూలిపోయింది.

''అమ్మా! ఏమిటలా అయిపోయావ్ ? ఏమయింది ?'' ఆతృతగా ఆమె దగ్గరకొచ్చి భుజం పట్టుకుని అడిగింది ఉష.

ఉష కళ్ళల్లోకి చూసిందామె.

''భగవంతుడా! అప్పుడు సావిత్రిని తీసుకెళ్ళిపోయావ్! ఆ దుఃఖం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాను. ఉషనే నా సర్వస్వంగా చూసుకుంటూ బ్రతుకుతున్నాను. దానిమీదే ఆశలన్నీ పెట్టుకున్నాను. ఇప్పుడు దానికేమయినా జరుగుతే నేనిక భరించలేను. దాంతోపాటు నేనూ ప్రాణం తీసుకోవడం తప్పితే మరో గత్యంతరం లేదు.''

లోలోపలే గొణుక్కోసాగిందామె.

''అమ్మా! ఏమిటలా చూస్తున్నావ్ ?'' భయంగా అడిగింది ఉష.

ఆమె చప్పున ఆ షాక్ నుంచి తేరుకుంది.

''ఏమీలేదమ్మా! కొంచెం కళ్ళు తిరిగినట్లనిపించింది! అంతే!'' సర్దుకుంటూ అందామె.

''అబ్బ! ఇంకేమయిందో అని హడలిపోయాను. అయినా నువ్వు ఊరికే ఎగ్జర్ట్ అవ్వకమ్మా! ఆఫీస్ నుంచి ఇంటికొచ్చాక నేను చూచుకుంటాగా ఇంట్లోపని.''

''పెళ్లి ఎందుకు వాయిదా పడింది ?'' వణుకుతూన్న స్వరంతో అడిగిందామె.

''మంచి ఉద్యోగం దొరికాక చేసుకోవచ్చని నేనే అన్నాను.''

ఆ మాట కొంత ఉపశమనం కలిగించిందామెకి.

కానీ ఆందోళన పూర్తిగా తగ్గలేదు.

ఏదో అపశ్రుతి కనిపిస్తోందామెకి బులో.

కొద్దిసేపు మౌనంగా ఉండిపోయిందామె.

తన మనసులో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న ఆలోచనలను ఉష కెలాచెప్పాలో తెలీటంలేదు.

కానీ తన అనుమానాలు వ్యక్తం చేయకపోతే మళ్లీ చరిత్ర పునరావృతం అవుతుందేమో!

ఉషను ముందే హెచ్చరించకపోతే ఆమె కూడా తనకు దక్కకుండా పోతుందేమో !

ఇద్దరూ మౌనంగా భోజనాలు ముగించారు.

అర్ధరాత్రివరకూ ఎవరికీ నిద్రపట్టలేదు.

ఉషకు కూడా నిద్రపట్టలేదని గ్రహించిన ఆమె ఆందోళన మరింత అధికమయింది.

''ఉషా!'' మంచం మీద నుంచీ లేచి కూర్చుంటూ పిలిచిందామె.

''ఏమిటమ్మా!''

''మీ పెళ్ళి తప్పకుండా జరుగుతుంది కదూ ?''

''ఎందుకు జరగదమ్మా! నీకు అదే ఆలోచన పట్టుకుందా ఏమిటి ? నేనే వాయిదా వేశానని చెప్తున్నాగా !''

''నా ఆదుర్దా అదికాదమ్మా! కానీ పెళ్ళి జరిగేవరకూ నువ్వు జాగ్రత్తగా ఉండాలి! ఏ పరిస్థితిలోనూ నిన్ను నువ్వు మర్చిపోకు! మనమున్న పరిస్థితిని మర్చిపోకు! అతనెంత మంచివాడయినా నువ్వు ఉండాల్సినంత దూరంలో ఉండు...''

ఉషకు ఆమె ఆవేదన అర్థమయి కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

''నాకు తెలుసమ్మా!'' అంది నెమ్మదిగా.

అప్పటికిగాని ఆమె మనసు శాంతించలేదు.

(ఇంకా వుంది)

పాఠకుని డైరీ

గోతిలో గుంట నక్క!

అమెరికాలో షరీఫ్ అనే వో మేధావి ఇళ్ళు అధికంగా వున్న వో చోట పీకలోతు గొయ్యి తవ్వుకు నందులో నిలబడి, గౌనులు తొడుక్కుపోయే అందమైన కాళ్ళు, పిక్కలు కల అమ్మాయిల అందాలు వీడియో కేమెరాతో టేపు తీస్తూ పట్టుబడ్డాడట. వోరి పిడుగా!

ముసలితనంలో ముద్దు ముచ్చట్లు!

జోహన్సుబర్గ్‌లోని వో చర్చిలో 40 ఏళ్ళు మదర్‌గా ఉంటున్న మదర్ సుపీరియర్ జాన్ లూడన్ క్లాస్ తన 63 వ ఏట యిహ మన్మధ బాణాలు తప్పించుకోలేక 72 ఏళ్ళ హేమిల్టనును పెళ్ళాడిందట. భార్య



పోయిన ఆ హేమిల్టనుగారు రోజూ చర్చికివచ్చి మౌనంగా కన్నీరు మున్నీరుగా వొదులుతుండే-వారట. ఆయన్ను వోదార్చడంతో ఆరంభమయిన పరిచయం ఆయన లేకపోతే జీవించలేని స్థితి కొచ్చిందటావిడ.

అమెరికాలో కుక్కల ఖర్చు!

అమెరికాలో రానానూ మనిషి ఖర్చు కన్నా కుక్కల ఖర్చే ఎక్కువవుతోందట. పోయిన ఏడు ఆ దేశంలో మొత్తం కుక్కల ఆహారాలు పది బిలియను డాలర్ల కిమ్మత్తువి అమ్ముడయ్యాయట. రోజ్ బ్రాండ్ ప్రాడక్ట్స్ అనే వో కంపెనీ జ్యాస్ ట్రీట్ అనే వో "బివరేజిని" కుక్కల కోసం తయారు చేసి "ఈ జ్యాస్ గొడ్డు మాంసపు సువాసనతో ఘుమ ఘుమలాడుతుంది" అని ప్రకటించారట.

అడ్డొచ్చి అసువులు బాసిన తల్లి!

తిరుచంగోడు (తమిళనాడు) కు చెందిన తిలకవతి అనే 16 ఏళ్ళ అమ్మాయిని, సెల్వి అనే 17 ఏళ్ళ అమాయయిని సుబ్రమణి అనే అతను ఎత్తుకుపోయాడట. ఆ ఇద్దరు పిల్లల తలిదండ్రులు, చుట్టాలూ చేరి పళనిసామి యింటిమీద

పడి, అతన్నాకు తెలీదు మొర్రో అని అంటున్నా చితక బాద నారంభిస్తే అతని తల్లి 60 ఏళ్ళ పళనియాయి అడ్డొచ్చిందట. ఆత్రంతో వారామెనో రెండు వుతికేసరి కామె అక్కడి కక్కడే పడి, చనిపోయిందట.

కంచే చేను మేస్తే!


అహమ్మదాబాదు వూరికి శివారులలో వున్న ప్రభుత్వమే నడుపుతున్న స్త్రీల హాస్టళ్ళలోని స్త్రీలను అక్కడి యాజమాన్యం ఝుళిపించి, బాధించి, బలవంతపెట్టి వ్యభిచారంలోకి దింపు తోందని, బిడ్‌హవ్ ఇండస్ట్రియల్ ఎస్టేటు సమీపంలోగల స్పెట్ హోమ్స్ ఫర్ వుమెన్‌లలో యీ వ్యభిచారం చాలా రహస్యంగా, చక్కగా సాగుతోందని కొందరు బయట పెట్టారని పత్రికలు కొన్ని వ్రాశాయి. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం వొప్పుకోలేదట-లేక!!

ఆదాయపు పన్ను కడతానన్న వెలయాలు!

ఫ్రాన్స్‌లో జాక్విలిన్ ట్రాప్లర్ అనే వో వేశ్య తమ వృత్తిని, తత్ ఆదాయాన్ని ప్రభుత్వం గుర్తించి, తమకు ఆదాయపు పన్ను కూడా విధించాలి అని ప్రభుత్వానికి విన్నవించిందట. ఈమె విన్నపం విన్న ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలలో నీ ఆదాయంమీద రెండు లక్షల 50 వేలు.(మన లెక్క) ఆదాయ పన్ను కట్టు అని నోటీసు పంపేసరికి ఆమె ఎగిరి గంతేసి అంత పన్ను కట్టాలంటే తను ఎంత సంపాదించి వుండాలనీ, అంత సంపాదించి వుండాలంటే తను రోజులో ఎన్ని గంటలు వ్యాపారంలో వుండి వుండాలనీ ఆశ్చర్యపోతూ, టాక్స్ వారికి బొత్తిగా ప్రపంచ జ్ఞానం లేకుండా తప్పు లెక్క వేశారన్నదట.

రష్యాలో విడాకులు!

సోవియట్ రష్యాలో ప్రపంచంలో కల్లా విడాకులు ఎక్కువనీ, పది శాతం పెళ్ళిళ్ళు వో ఏడాది కూడా కళ్ళ చూట్టం లేదనీ డేవిడ్ లేన్ అనే వో రచయిత అన్నారట. ఆయన రాసిన వో పుస్తకంలో. రష్యాలో విడాకులు 2.7 శాతం వున్నాయనీ, అమెరికాలో 2.2 శాతమేనని, ఇంగ్లండులో 0.6 శాతమనీ కూడా ఆయన అన్నారట. దీనికి కారణం స్త్రీ స్వాతంత్ర్యమేనని, దేశం ఎంత ముందంజలు వేస్తున్నా భర్త చెప్పిన మాట భార్య వినన్నాడు. ఆ స్త్రీ తన స్వాతంత్ర్యంలో వో పాలు త్యాగం చేయనినాడు, భర్త మీద మమత, అనురాగం ఏర్పరచుకోనినాడు యీ విడాకులు తప్పవని ఆయన అన్నారుట – సత్యంఖలు సర్వం. □



రూమ్ నెంబర్ థర్టీ ఎయిట్

శ్రీరామచంద్ర

రూమ్ నెంబర్ ముప్ఫై ఎనిమిది ఆ కాలేజీలోనే విశిష్టతను సంతరించుకొన్నది. ప్రతి సంవత్సరం బి.కాం. ఫైనలియర్ క్లాసులే జరిగే రూమ్ ముప్ఫై ఎనిమిదది. ఆ కాలేజీలో అన్నిటికన్నా పొడవాటి వరండా చివర్న వుండే రూమ్ ముప్ఫై ఎనిమిది. ఇది కార్నర్ క్లాసు. ఆ క్లాసులో ఓ పీరియడ్‌కూడా వుండని విద్యార్థి 'స్టూడెంట్' అనడానికి తగడు.



ప్రతి లెక్చరరూ తన లెక్చర్‌లో వుపయోగించే 'సంత', 'చేపల మార్కెట్' అన్న పదాలు ఆ క్లాసుకి లెక్చరర్లు పెట్టిన ముద్దు పేర్లు, 'గౌరవప్రదమైన' పేర్లు. క్లాసులోకి అడుగు పెట్టిన ప్రతి లెక్చరరూ 'అవర్ బెల్' మోగేంత వరకూ గుండెల్ని అరచేతిలో పెట్టుకొని పాఠాలు చెప్పటం ఆ క్లాసు 'నిత్య కార్యక్రమం'. మొదట అడుగుపెట్టేటప్పుడు ఎంతో బింకంగా, సీరియస్‌గా వుండే లెక్చరర్లు, బెల్ మోగిన తరువాత తలవంచుకొని, చెమటలు గక్కుతూ పరుగులాంటి నడకతో క్లాసునుంచి వెళ్ళటం ప్రతిరోజూ చూడొచ్చు. అందుకే ఆ రూముకో ప్రత్యేకతా, విశిష్టతాను.

అంతెందుకు ?

ఆరు నెల్లముందు ఓ ప్రిన్సిపాల్ ఆ కాలేజీకి కొత్తగా ట్రాన్సఫరయి వచ్చేడు. జాయిన్ అయిన మూడోరోజు ఆయన తన

రూముకు వెళ్తూ వరండాలోకి వినబడుతున్న అల్లరి గమనించి తలతిప్పి చూశాడు. ''ముప్పై ఎనిమిది'' అన్న నెంబర్ కనబడింది. డయాస్ పై లెక్చరర్ ఎవరూ లేరు. ప్రిన్సిపాల్ పై సర్దుకొని క్లాసులోకి అడుగుపెట్టాడు. అంతే క్లాసు మొత్తం ఒక్కసారిగా లేచి నిలబడి, ''గుడ్ మార్నింగ్ సార్ !'' అంటూ కోరస్ గా విష్ చేసింది. ఆయనకూడా మొహమాటంగా, 'గుడ్ మార్నింగ్ !, ప్లీజ్ సిడౌన్ !'' అంటూ వారి వినయవిధేతలకు ఆశ్చర్యంతో — ఆనందంతో వుక్కిరి బిక్కిరై డయాస్ ఎక్కి నిల్చొన్నాడు. ఆ తర్వాత జరిగిన సంఘటనలు ఆయన ఏ కాలేజీలోనూ ఫేస్ చేయలేదు— ఇకముందు 'ఫేస్' చేస్తాడో లేదోకూడా తెలీదు.

ఓ పేపర్ రాకెట్ ప్రిన్సిపాల్ తలను ముద్దుపెట్టుకొంటూ దూసుకెళ్ళి గడకు గుద్దుకొని రిఫ్లెక్టయి కిందపడింది. వెనుక బెంచీలనుంచి పిల్లికూతలు, కుక్క అరుపులు వినిపించేయి. బెంచీలపై 'మృదంగ నాదం' వినిపించింది. బాయ్సేదే ఈ అల్లరి అనుకొంటూ ఆయన అమ్మాయిలవైపు తిరిగి చూసాడో లేదో, అమ్మాయిలందరూ కిసుక్కుమని ఒక్కమారుగా నవ్వి తల వంచుకొన్నారు. ఓ అమ్మాయి నోట్లో చిటికెనవేలు పెట్టుకొని అందంగా బోలెడు సిగ్గుపడిపోయింది. ప్రిన్సిపాల్ గారికి క్లాసు మొత్తం ఓ మారు కళ్ళముందు గిర్రున తిరిగి నట్లనిపించింది.

''ఆహా! నవమన్మథుడు రా! అమ్మాయిలు ఈయన్ని చూస్తూనేసిగ్గుతో తలవంచేసారు(?)'' ఓ కొంటెకుర్రాడు కామెంట్ విసిరాడు — అతడు భాషా.

''హా! ఏమిటీ వైపరీత్యము! మా క్లాసు అమ్మాయిలు ఈ మన్మథుని వశంబైనారే! అయ్యారే! మా గతి ఏమిటి ?'' మరో స్టూడెంట్ రాని కన్నీళ్ళు తుడుచుకొంటూ భాషాభుజాల్ని పట్టుకొన్నాడు. అతడు కృష్ణాశాస్త్రి. ముద్దుగా తన పేరును కె.శాస్త్రిగా మార్చుకొని 'కొంటె శాస్త్రి'గా పేరుపడ్డవాడు.

''అయినా, మనల్ని చూస్తేనే, చురచురా ముఖాన్ని అష్టవంకరలు తిప్పే అమ్మాయిలు ప్రిన్సిపాల్ ని చూసి సిగ్గుపడి తలవంచేయడంలో అర్థమేమిట్రా అబ్బీ !'' కనుచివర్లలో అమ్మాయిలను చూస్తూ వాపోయాడు రెడ్డి— సుబ్బారెడ్డి.

ప్రిన్సిపాల్ కు కాళ్లు చేతులు పనిచేయటం మానేసాయి. ఓమారు క్లాసు మొత్తం కలయజూసి, ''మీ లెక్చరర్ ను ఇప్పుడే పంపిస్తాను, అంతవరకూ నిశ్శబ్దంగా వుండండి'' అంటూ ఏదో చాలా ముఖ్యమైన పని గుర్తుకొచ్చినట్లు పరుగులాంటి నడకతో బయటికి దూసుకెళ్లి పోయారు.

''ఒరేయ్ ! పాపం లేడిలా పరుగెడుతున్నా

మనమంతా!

ఎక్కడో ఎప్పుడో మనమంతా
అప్పుడప్పుడు వోడిపోతూనేవున్నాం.
లంచం ఇచ్చే సగం చేతులతో
లంచం పట్టే పుచ్చిన చేతులతో!
ఆత్మవంచనే ఆనందంగా
కల కాలం ఇలానే సాగుతుందనే చోట
మనమంతా
తాత్కాలికంగానైనా వోడిపోతున్నాం!

—నిఖిల్

డేరా ఈ మహానుభావుడు !'' గట్టిగా అరిచాడు రెడ్డి.

''లేడి ! ఆహా లేడి ! ఓహో లేడి ! ఏమిటీ లేడి పరుగు !'' అని క్లాసు మొత్తం కేకపెడుతూండటం వరండాకార్నర్ తిరుగుతూన్నంత వరకూ వినబడింది కొత్త ప్రిన్సిపాల్ కు.

ఆ తరువాత వరండా సర్వేరాయుళ్ళ చెమటలతో తడిసిన ముఖాన్ని కర్చీఫ్ తో తుడుచుకొంటూ గబగబా 'ప్రిన్సిపల్ గదిలోకి' ఆయన అడుగు పెట్టడం చూసేరు. అప్పుడే ఓ కుర్రాడరిచాడు. ''గురుడు ముప్పైఎనిమిది వెళ్లినట్టున్నాడ్రోయ్ !'' అని.

కోయిన్సిడెన్స్ అంటాం చూడండీ ! అది ఆయన పట్ల 'దయ' చూపించింది. ఆయన పేరేమో 'ఎల్. పొన్నయ్య ! ముప్పైఎనిమిది కెళ్ళాడు' 'లేడి' పొన్నయ్యగా మారిపోయాడు. ఇది జరిగిన తరువాత ప్రిన్సిపాల్ ''ముప్పైఎనిమిది కెళ్లడం'' అన్న మాటను తన డిక్షనరీలోంచి తీసేసాడు. అలాంటి క్లాసు ముప్పైఎనిమిది !

అదిగో…

ఆ కాలేజీకి ట్రాన్స్ ఫరయి వచ్చాడు నారాయణ్. అకౌంటెన్సీ తీసుకుంటాడతను. ప్రిన్సిపల్ గార్ని కలసి జాయినింగ్ రిపోర్టిచ్చాడు. ప్రిన్సిపాల్ గారి మేధాసంపద గొప్పది. ట్రాన్స్ ఫరయి వచ్చినా, కొత్తగా అప్పాయింట్ అయినా లెక్చరర్లకు ఓ టెస్ట్ జరిపేవాడు.

''బి.కాం. ఫైనలియర్ క్లాసుకు మొట్ట మొదటిసారిగా వెళ్ళిన లెక్చరరు నలభైఐదు నిమిషాలు క్లాసులో వుండి పాఠంచెప్పి అవర్ బెల్ మోగినతరువాత వచ్చాడంటే ఎఫిషియంట్ లెక్చరర్. అతను మొదటి 'గ్రేడ్'కు చెందివాడు. అతనిని ఆ క్లాసుకే పంపాలి. ముప్పై ఎనిమిషాలకే పరుగెత్తుకొచ్చేవాడు 'ఫిరవాలేదు' అతను రెండో 'గ్రేడ్'కు చెందినవాడు. అతన్ని సమయానుకూలంగా ఏ క్లాసుకైనా పంపొచ్చు. పావుగంటయినా కాకమునుపే పరుగెత్తుకొచ్చిన వాడు 'బ్యాడ్' మూడో 'గ్రేడ్'కు చెందివాడు. అతనికి ఫస్ట్ ఇయర్ క్లాసులే ఇవ్వాలి'' ఇవి ప్రిన్సిపాల్ ముప్పైఎనిమిదికెళ్లివచ్చిన తరువాత తీసుకొన్న నిర్ణయాలు, గ్రేడులున్నూ. ఆయన వచ్చి ఆరునెల్లయినా, ఇంతవరకూ ఐదుగురు లెక్చరర్లు ట్రాన్స్ ఫరయి వచ్చినా ఒక్కరూ రెండో గ్రేడ్ కూడా పొందలేదు. ఇక గత్యంతరం లేక వారినే ఆ క్లాసుకి తరిమారు. వారు ఏడుపొక్కటే తక్కువగా వెళ్లేరు.

నారాయణ లెక్చరర్లకు పరిచయం చేయబడ్డాడు. మిగతా లెక్చరర్లు నారాయణకు ముప్పైఎనిమిది గురించి, ప్రిన్సిపాల్ 'గ్రేడ్' గురించి, ఇంతవరకూ రెండో గ్రేడ్ కూడా ఎవ్వరూ పొందకపోవటం గురించి, ముప్పైఎనిమిది — భాషా, శాస్త్రి, రెడ్డిలను గురించి చెప్పేరు.

''చూడండి నారాయణగారూ ! మిమ్మల్ని రేపు ప్రిన్సిపాల్ పిలుస్తారు. బి. కాం. క్లాసు మర్నాడు తీసుకొమ్మని చెబుతాడు. మీరు మాత్రం ఒప్పుకోవద్దు. 'మొదటి రోజే ఫైనలియర్ లేమిట్సార్ !' అంటూ ఏదో ఓ కారణం చెప్పి మాన్పించుకోండి!'' కో లెక్చరర్ సలహా ఇచ్చాడు.

నారాయణ అప్పటికి తలవూపి మౌనంగా వుండిపోయేడు.

* * *

''గుడ్ మార్నింగ్ సార్ ! పిలిచారట !'' అడిగాడు నారాయణ ప్రిన్సిపాల్ రూమ్ లోకి అడుగుపెడ్తూ.

''గుడ్ మార్నింగ్! కూర్చోండి!'' అన్నారు ప్రిన్సిపాల్ చదువుతూన్న ఫైలు లోంచి తలెత్తి చూసి. ''మీరు బి. కాం. ఫైనలియర్ కు అకౌంటెన్సీ తీసుకోవాలి. కొత్తగా వచ్చారు కాబట్టి ఆ క్లాసు గురించి మీకు తెలుసుండకపోవచ్చు …''.

''కో లెక్చరర్స్ చెప్పారు సార్!'' నవ్వుతూ చెప్పాడు నారాయణ. ''నాకూ ఈ ఛాలెంజ్ ని ఫేస్ చెయ్యాలని వుంది. వాళ్ళకెప్పుడు పీరియడ్ వుంటుంది ?''

''రేపు రెండో పీరియడ్. మీకు ముందున్న లెక్చరరు * మూడు చాప్టర్లే జరిపేరు'' చెప్పారాయన. ఆయన కంఠంలో ఆశ్చర్యం తొంగి చూసింది.

''థాంక్యూ సార్! రేపు ఆ పీరియడ్ తీసుకొంటాను.'' లేచి నిలబడి చెప్పాడు నారాయణ. ''వస్తాను సార్ !''

ప్రిన్సిపల్ తలవూపేరు. నారాయణ వెళ్ళిపోయాడు. ప్రిన్సిపాల్ వెనుక నుంచి నారాయణను చూస్తూండిపోయారు. స్ప్రింగ్ డోర్స్ మూసుకొన్నాయి.

* * *

రూమ్ నెంబర్ థర్టీఎయిట్

''రేపు మన క్లాసుకి కొత్త లెక్చరర్ వస్తున్నాడంట !''

''ఆయన గురించి మనకేమీ తెలీదే ఎలా కనుక్కోవడం ?''

''ఐడియా !'' చెప్పాడు శాస్త్రి — కె. శాస్త్రి.

''ఏమిటి ?'' అడిగాడు భాషా.

''ఈరోజు ఇంటర్వెల్‌లో డిపార్ట్‌మెంట్ వైపు వెళ్దాం. సాధారణంగా ఎక్కువ మంది లెక్చరర్లుండరు. ఆ కొత్త లెక్చరర్‌ని చూసొద్దాం.''

''రైట్ !'' చెప్పాడు రెడ్డి.

''ముగ్గురం వెళ్ళటం ఎందుకు? ఎవరైనా ఒక్కరే వెళ్తే బాగుంటుంది.'' భాషా చెప్పాడు. 'బాగుంటుంది' అన్న పదాన్ని నొక్కి పలుకుతూ.

''శాస్త్రి వెళతాడు !'' చెప్పేడు రెడ్డి.

''అలాగే !''

*   *   *

''భలే తమాషా జరిగింది బాస్ ! నేనేమో ఆయన దగ్గరకెళ్ళానా. ఎవరో కొత్త లెక్చరర్ అనుకొన్నాడు గాబోలు నన్ను చూస్తూనే విష్ చేసేడు. నేనూ విష్ చేసి లెక్చరర్ హోదాలోనే జవాబిచ్చాను. నా పేరడిగాడు. చెప్పాను. అలా మాట్లాడుతూ, మాట్లాడుతూంటే చెప్పేడు. పేరు 'నారాయణ' తిరుపతినుంచి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చేడట !'' చాక్లెట్ నములుతూ చెప్పేడు శాస్త్రి.

''గుడ్ ! మనం ముగ్గురం రేపు తొమ్మిది కంతా కాలేజీలో వుండాలి. బై నైన్ వుయ్ షుడ్ బి హియర్. రైట్ ?'' చెప్పాడు రెడ్డి భాషా, శాస్త్రిలను చూస్తూ. యిద్దరూ తలూపేరు.

*   *   *

రెండవ పీరియడ్ బెల్ మోగింది. అమ్మాయిలు, అబ్బాయిలు. క్లాసు రూమ్స్ మారుతున్నారు. వరండా మొత్తం 'సర్వే రాయుళ్ళకు' 'కనుల పండుగగా' వుంది. అమ్మాయిల్ని చూస్తూ కామెంట్ విసురుతున్నారు కొందరు. మరి కొందరు కార్నర్‌లో నిలబడి వచ్చిపోయే అమ్మాయిల్ని ''హల్లో !'' అంటూ పలకరించి, వారి చురుక్కుమని చూసే చూపులను చూసి సంతోషపడిపోతున్నారు. కొందరు చాలా సిన్సియర్ విద్యార్థుల్లా దారి వదలి, అమ్మాయిలు వెళ్తూంటే సడన్‌గా అడ్డంగా నిలబడేరు.

రూమ్ నెంబర్ ముప్ఫై ఎనిమిది బయట ఒక్కరుకూడా లేరు !

ఆ రోజు అదో పెద్ద సస్పెన్సయిపోయింది స్టూడెంట్సుకు. ప్రతి ఒక్కరూ క్లాసులోకి తొంగి చూసి వెళ్ళిపోతున్నారు. తెలిసిన స్టూడెంట్ వుంటే పిలిచి విషయమేమిటని అడుగుతున్నారు. కొత్త లెక్చరర్ వస్తున్నాడని వాళ్ళా నవ్వుతూ చెబుతున్నారు. కాలేజీ వాతావరణం ముప్ఫై ఎనిమిది ముందు ఓ సరికొత్త రూపుదిద్దుకొంది.

శాస్త్రి బయిటకు వచ్చి చూసాడు. దూరంగా నారాయణ వస్తున్నాడు.

''లెక్చరర్ వస్తున్నాడ్రోయ్ !'' క్లాసులోకి వెళుతూ గట్టిగా అరిచి చెప్పాడు శాస్త్రి. అమ్మాయిల గుసగుసలు, అబ్బాయిల అల్లర్లు సర్దుకొన్నాయి.

శాస్త్రి, రెడ్డి భాషాలు కడపటి డెస్క్‌పై కూర్చొన్నారు. శాస్త్రి రాకెట్‌లు తయారు చేస్తున్నాడు. రెడ్డి భాషావైపు చూశాడు. ''నేను రెడీ !'' అన్నట్లుగా చిన్నగా నవ్వాడు భాషా. సూది పడినా వినిపించేంత నిశ్శబ్దం క్లాసులో నెలకొన్నది. నారాయణ వస్తున్నాడు. బూట్ల శబ్దం 'టక్, టక్'మని వినిపిస్తూంది.

నారాయణకు అనుమానం కలిగి మెల్లగా క్లాసులోకి తొంగి చూసేడు.

''స్టూడెంట్స్ వున్నారు !''

''కో లెక్చరర్స్ చెప్పినట్లు వీళ్ళేం అల్లరి చేసేవాళ్ళుగా కనిపించటంలేదే !'' తనలో తాను ఆలోచించుకొంటూ క్లాసులోకి అడుగుపెట్టాడు నారాయణ.

''గుడ్ మార్నింగ్ 'సార్ !'' అందరూ కోరస్‌గా విష్ చేసేరు.

''గుడ్‌మార్నింగ్ ప్లీజ్ సిడౌన్ !'' విష్ చేసి చెప్పాడు. ''నా పేరు నారాయణ. ఈ కాలేజీకి కొత్తగా ట్రాన్సఫరయి వచ్చాను. మీకు అకౌంటెన్సీ తీసుకొంటాను...''

''వైద్యో నారాయణో హరీ !'' రెడ్డి వెనుక బెంచీనుంచి అరిచేడు.

''హూ ఈజ్ దట్ !'' -నారాయణ ఆ వైపుగా చూశేడు.

రివ్వున ఒకటి వెంబడి మరొక రాకెట్ అతనిమీదుగా దూసుకెళ్ళింది. నారాయణకు తాను అంతవరకూ అనుకొన్న మాటలు వట్టివని తేలిపోయాయి.


''...మీరు రాకెట్‌లు విసిరినంత మాత్రాన నాకేమీ ఒరిగేదిలేదు'' అన్నాడు నారాయణ బోర్డువైపు తిరుగుతూ.

''ఎదురుగా చూడు !'' బోర్డుపైన రాతల్ని చదివి అప్రయత్నంగా వెనుకవైపు తిరిగాడు. దూరంగా గోడపై ''పక్కవైపు చూడు !'' అని పెద్ద అక్షరాలతో రాసివుంది. నారాయణ ఆశ్చర్యంతో తిరిగి చూసాడు. ''నీ వెనుక చూడు !'' అని వుందక్కడ. నారాయణకు అర్థమైపోయింది. తన్ను వెర్రివెధవాయి చేయటానికి అలా రాసిపెట్టేరు. నారాయణ తిరుగ బోతూంటే రెడ్డి లేచి నిలబడి అడిగాడు, ''ఏం సార్ ! దిక్కులు చూస్తున్నారు !'' అతని కంఠంలో వ్యంగ్యం తొణకిసలాడింది.

''పాపం ! మేష్టారుగారికి మొదటి క్లాసు కదా ! అన్ని దిక్కులవైపు చూసి దణ్ణం పెట్టుకొంటున్నాడు !'' శాస్త్రి కామెంట్ విసిరేడు.

గొల్లుమని నవ్వేరు స్టూడెంట్స్ అందరూ.

''సైలెన్స్ ! సైలెన్స్ !'' గట్టిగా అరిచాననుకొన్నాడు నారాయణ. కాని మాటలు గొంతు దాటి రాలేదు. నిస్సహాయంగా చూస్తూండిపోయేడు. కొద్ది క్షణాలు మాత్రమే. వెంటనే తెప్పరిల్లి, ''మీరిలా అల్లరి చేస్తూంటే పాఠం తీస్కోవటం జరుగదు. ఇప్పుడే నేను వెళ్ళిపోవాల్సి వస్తుంది !'' గట్టిగా చెప్పాడు.



''ప్చ్! పాపం రా!' నారాయణ చాలా బాధపడిపోతున్నాడు!''

వెనుక బెంచీనుంచి ఏడుస్తున్నట్లు ఎక్కిళ్ళు వినిపించేయి. నారాయణకు ఈ అనుభవాలు కొత్త.

నారాయణ అటెండర్ సర్క్యులర్ తేవటంతో దానిని తీసుకొని చదవబోయాడు.

''నారాయణా! ఆ సర్క్యులర్ ఏమిటి?'' సుబ్బారెడ్డి లేచి నిలబడి అడిగాడు.

నారాయణకు కోపం తన్నుకొచ్చింది. ఒక్క క్షణంలో మామూలుగా మారిపోయాడు. నిదానంగా, స్పష్టంగా అడిగేడు సుబ్బారెడ్డిని చూస్తూ! — ''ఓ లెక్చరర్ అనే గౌరవంకూడా మీకు లేదా?''

''మేము మిమ్మల్నేమీ అడగలేద్సార్! ఆ అటెండర్ని అడిగాం, శాస్త్రి నిలబడి చెప్పాడు. ''కావాలంటే అటెండర్ని అడగండి! అతని పేరూ నారాయణే!''

నారాయణ అటెండర్ వైపు చూసేడు. 'అవున'న్నట్టు తలూపాడు. నారాయణ మౌనంగా ఒక్క క్షణం వుండిపోయాడు. సర్క్యులర్ చదివి వినిపించాడు.

''తన ఐదేళ్ళ సర్వీసు ఎందుకూ కొరగాదా? కాదు. తన ప్రతిభను ఇక్కడే చూపాలి. వీళ్ళను తన దారిలోకి రప్పించుకోవాలి. తాను వాళ్ళ మార్గంలోనే వెళ్ళి, మెల్లగా వాళ్ళను తన వైపు తిప్పుకోవాలి:

'తేనె కావాలనుకొన్నవాడు తేనెపట్టును చెడగొట్టడు!''

నారాయణ పెన్నును జేబులో పెట్టుకుంటూ దృఢనిశ్చయానికొచ్చాడు.

''డియర్ ఫ్రెండ్స్!'' అన్నాడు నారాయణ క్లాసు మొత్తం కలయజూస్తూ.

ఒక్కసారిగా నిశ్శబ్దం నెలకొన్నది. ఇంత వరకూ ఏ లెక్చరరూ వాళ్ళని అలా సంబోధించలేదు. ''స్టూడెంట్స్!'' అని అంటూండేవాళ్ళే. వారికి పిలుపు కొత్త. అందుకేగామోలు అమ్మాయిలుకూడా ఆశ్చర్యచకితులై నిశ్శబ్దంగా వుండిపోయేరు.

''... మీకందరికీ నా పేరు ముందే చెప్పాను. క్లాసులో అడుగు పెట్టేంతవరకూ అకౌంటెన్సీ జరపాలన్న నిర్ణయంతోనే వచ్చాను. కాని నేను మీకు కొత్త. నాకు మీరు కొత్త. మీతో పరిచయం చేసుకోకుండా పాఠం జరుపుదామనుకొన్న నా నిర్ణయం తప్పే...'' మొదట తన తప్పును చెప్పకుండా చెప్పడం... ఇదే నారాయణ పాటించింది.

''...మీలాగే నేనూ ఒకప్పుడు విద్యార్థినే. ఇంతకన్న ఎక్కువ అల్లరి మా క్లాసులోనూ వుండేదే! మా లెక్చరర్లుకూడా మా మీద కోప్పడేవాళ్ళే. అయినా వారు కోపంలోకూడా జోకులు విసిరేవారు...

... ఈ రోజు నేను పాఠం చెప్పబోవటం లేదు. మాకు వచ్చిన లెక్చరర్లగూర్చి చెబుతాను. అకౌంటెన్సీకి ఓ లెక్చరరు వచ్చేవారు. ఆయన చాలా తమాషాగా మాట్లాడేవాడు. ఆయన తీసుకొన్న మొదటిక్లాసులో మన రాష్ట్రంలోని వివిధ రకాలు మాట్లాడేవారినిగూర్చి చెప్పేరు. ఆయన షర్ట్ను ఏమనేవారో తెలుసా?...''

''సొగ్గుడ్డ!'' నారాయణ కొద్ది క్షణాల తర్వాత చెప్పాడు.

ఒక్క పెట్టున నవ్వారు విద్యార్థులందరూ.

''ఓ మారు మేం వరండాలో తిరుగుతూంటే దగ్గరకు రమ్మని పిలిచేరు. మేం వెళ్ళగానే ''వై ఆర్ యు రొటేటింగ్ ఇన్ ది వరండా?'' అంటూ కోపంగా అడిగేరు. ''రొటేటింగ్ ఏమిట్సార్'' అంటే, తెలుగులో మనం ఏమంటాం? వరండాలో ఎందుకు తిరుగుతున్నావ్? అనే కదా! తిరుగుటకు ఆంగ్లంలో రొటేటింగ్ కాదా' అనేవారు. ఫీజు కట్టేశారా? అనడానికి వారేమడిగేవారో తెలుసా?...''

''హేవ్యు 'బైడ్' ది ఫీజ్! కరెక్టేనా సార్!'' శాస్త్రి లేచి నిలబడి అడిగాడు. అతని ముఖంలో నారాయణ పట్లున్న చులకనభావం ఈమారు కనబళ్లేదు.

''కరెక్ట్! ఆయనకు ఇంగ్లీష్ రాదనుకోబోయేరు. ఆయన మాట్లాడుతూంటే గంటల తరబడి అలాగే వింటూ వుండిపోవాలని పిస్తుంది!''

''త్రిమూర్తుల్ని పరిచయం చెసుకోవాలనుంది!'' అన్నాడు నారాయణ, 'త్రిమూర్తుల్ని' అనే పదాన్ని వత్తి పలుకుతూ.

''త్రిమూర్తులా వారెవరుసార్!''

నారాయణ నవ్వుతూ వెనుక బెంచీ వైపు చూపుడు వేలు చూపించాడు. శాస్త్రి, రెడ్డి, భాషా లేచి నిలబడి తమ పేర్లు చెప్పేరు. బెల్ మోగింది. నారాయణ ''థాంక్యూ ఫ్రెండ్స్!'' అంటూ బయటకు నడిచాడు.

* * *

''వి ఆర్ వెరీ సారీ సార్! క్లాసులో అలా బిహేవ్ చేసినందుకు సిగ్గుపడుతున్నాం'', శాస్త్రి చెప్పాడు.

''ఇట్సాల్ రైట్! క్లాసులోనే చెప్పానుకదా అది నా తప్పేనని. ఆ మాత్రం అల్లరిక్లాసులో వుండాలయ్యా! అన్నిరకాలుగా సంతోషంగా వుండగలిగే రోజులు కాలేజీ రోజులే కదా! ఒక్కవిషయం చదువుగూర్చి మరిచిపోకూడదు. అది చాలా ముఖ్యం!''


* * *

నారాయణ కామర్స్ డిపార్ట్మెంట్ బయట నిల్చొన్నాడు. అమ్మాయిలు మాట్లాడుకొంటూ, నవ్వుకుంటూ వెళుతున్నారు. నారాయణను చూసి విష్ చేసి వెళ్లేరు శాస్త్రి, రెడ్డి, భాషా. వాళ్లకు కొద్దిగా ముందుగా అటెండర్ వెళుతున్నాడు. అతను కామర్స్ డిపార్ట్మెంట్ అటెండర్. నారాయణకు అప్పుడు కలిగిందో ఆలోచన...

''సుబ్బా! ఇలారా ఓమారు!'' గట్టిగా కేకేసి పిలిచాడు నారాయణ.

సుబ్బారెడ్డి టక్కున నిలిచాడు. ముందు వెళుతున్న అమ్మాయిలు తిరిగి చూసారు. శాస్త్రి రెడ్డి ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసేరు, ''నిన్నేనా?'' అన్నట్లు. ''కాదేమో!'' రెడ్డి తలూపుతూ అడుగు ముందుకు వేసాడు.

''సుబ్బా! నిన్నే, ఓమారిలా రా!'' నారాయణ మరోమారు పిలిచాడు. రెడ్డి గిరుక్కున తిరిగాడు. శాస్త్రి, భాషా అతని వెనుకగా వెళ్లేరు. నారాయణ వరండా కొసను



చూస్తున్నాడు. అమ్మాయిలు ఏం జరుగుతుందో అన్నట్లు నిలబడిపోయేరు!

''నన్నేనా మీరు పిలిచింది!'' రెడ్డి కరకుగా చూస్తూ అడిగేడు.

నారాయణ అప్పుడే వాళ్ళను చూసిన వాడిలా, ''హల్లో ఏమిటి మీరంటున్నది?'' అడిగ్గేడు.

''నన్నేనా మీరు ''సుబ్బా'' అని పిలిచింది!'' ఈసారి రెడ్డి కంఠంలో కోపం మరోమెట్టు ఎక్కింది.

''నిన్నా! కాదే! అదిగో ఆ అటెండర్ సుబ్బయ్యను పిలిచాను!'' చేయి చూపిస్తూ, ఆశ్చర్యాన్ని నటిస్తూ చెప్పాడు.

రెడ్డి ముఖంలో కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు. ముందు రోజు జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది అతనికి— తాము ''నారాయణా'' అని లెక్చరర్‌ని పిలిచి అటెండర్‌ని పిలిచామని చెప్పడం—నారాయణ ముఖం అదోలా మారడం..

అతని ముఖంలో కొద్దికొద్దిగా ప్రసన్నత చేకూర్తూంది. ''టిట్ ఫర్ టాట్.'' అడిగాడతను. మిత్రుల మధ్య జరిగే పోట్లాటలలో ఎంత వేడుక వుంటుందో, ఇంకొకడు తన్ను 'చీట్' చేస్తే కలిగే ఓ విధమైన 'ఇది' అతని కంఠంలో తొంగిచూసింది.

రూమ్ నెంబర్ థర్టీఎయిట్

నారాయణ చిన్నగా నవ్వాడు. ''ప్రతి లెక్చరరూ ఒకప్పుడు స్టూడెంటే. లెక్చరర్ అయిన తరువాత అతన్ని ఇన్సల్ట్ చేసేటప్పుడు అతనికి తన స్టూడెంట్ డేస్ గుర్తుకు రావు. కాని నిన్న మీ క్లాసులో జరిగిన సంఘటన ఆ సమయంలో నాకు కోపం తెప్పించినా, అదే సమయంలో నన్ను ఆలోచింపజేసింది. ఈ రోజు అటెండర్ వెళుతూండటం, వెనుక మీరు వెళుతూండటం నేను స్టూడెంట్‌లా బిహేవ్ చేయటం ... నేనలా ఎందుకు ప్రవర్తించినానో నాకు తెలీదు'' నారాయణ కంఠంలో ఓ విధమైన అస్పష్టత కనబడింది.

వాతావరణం తేలికగా అన్పించింది నల్గురికీ.

''డియర్ సార్!'' అన్నాడు రెడ్డి. మీతో మా పరిచయం జీవితంలో మాకు ఓ గుర్తుంచుకో దగ్గది ఇంతవరకూ ఇంకొకళ్ళను మేము అల్లరి పెట్టేవారం కాని మమ్మల్ని ఎవరూ అల్లరి పెట్టిందిలేదు. మీరు ఈ రోజు నన్ను అలా పిలిచినా నా కెందుకో కోపం రావటంలేదు. నా వల్ల ఇంకొకరికేర్పడ్డ అనుభవాలే నాకూ కలగటం కారణమేమో?''

''డియర్ ఫ్రెండ్!'' అంటూ నారాయణ ముగ్గురికి షేక్‌హాండ్ ఇస్తూ మృదువుగా నొక్కి వదిలాడు.

* * *

తర్వాతెప్పుడూ నారాయణకు ''ముప్పై ఎనిమిది'' అంటే ఎంత ప్రీతో నారాయణంటే స్టూడెంట్స్‌క్కూడా అంతే కలిగింది. అతని క్లాసు ఉల్లాసంగా గడిచిపోయేది.

ఓ రోజు అతను క్లాసు డోర్ పైనుండే గ్లాస్ వెంటిలేటర్‌మీద ఓ చిన్ని అందాల బాలుడు పిల్లనగ్రోవితో, బోసినోటితో నవ్వుతూ వున్న పోస్టర్ అతికించివుండటం గమనించాడు.

''తేనెను కావాలనుకొన్నవాడు తేనెపట్టును చెడగొట్టడు!'' తనలో తాను అనుకొన్నాడు.


ఇప్పటికీ ఆ కాలేజీలో ఆ కార్నర్ క్లాసు వుంది. డోర్‌పైన చిరునవ్వుల చిన్నారి పాప ఇప్పుడూ మనం వెళ్తే నవ్వుతూ స్వాగతం పలుకుతుంది. దానికున్న ప్రత్యేకత, విశిష్టతా యిప్పుడూ వుంది! ★











శ్రీమద్భగవద్గీత

భారతీయ సాహిత్యాకాశంలో జిగిమాయని వెలుగుపుంజం భగవద్గీత! ప్రపంచ సాహిత్య సంపదలో ఆణిముత్యం హృషీకేశుని దివ్యోపదేశం! ఏ ఇతర గ్రంథానికీ లేని ప్రాశస్త్యం, ప్రాచుర్యం, ప్రమాణం, ప్రాణం గీతాగోవిందానికి ఉండడం అచ్చెరువొందించే అక్షరసత్యం కొన్ని వందల సంవత్సరాలుగా సార్వత్రికంగా సత్యాన్ని తత్వాన్ని పుంజుకొని అనితర సాధ్యంగా అసాధ్యంగా నిత్యనూతనంగా వికసిస్తున్న మానవ జీవన ప్రసూనం అనంత పార్థసారథ్యం. భారతీయ నేపథ్యంలోని ధర్మ సౌందర్యం. వైదిక సంప్రదాయంలోని నిష్ఠాగరిష్ఠం. గీతకు ఎనలేని వైశిష్ట్యాన్ని, శ్రేష్ఠత్వాన్ని ఆపాదించి పెట్టాయన్న భావన తిరుగులేనిది.

వేద సంస్కృతికి ఆయువు చతుర్వేదసారము. ప్రాణవాయువు వేదవ్యాస నుత శాస్త్రము. పురాణము ప్రోత్సాహము ఇతిహాసము ఆచరణా మార్గము. ఈ ప్రమాణాల ప్రోక్త పరమ పురుషుడైనా సామాన్య మానవుడైనా ప్రమాణీకరించిన శక్తిమాత్రం మహత్తరమైనది మాన్య మానవ భావ ప్రకటన పరమేశ్వర వరప్రసాదమే! వేదవ్యాసుడొకడే అయినా వేదవ్యాస పీఠాధిపతులు పరపరంగా ఉన్నా చతుర్వేదాలు, అష్టాదశ పురాణాలు, వేదాంగాలు, భారత భాగవతాది ఇతిహాసాలు సృష్టించబడడం సామాన్యమైన విషయంకాదు. మానవాత్మ స్పందించి మానవ జాతి సంస్కృతి పరిరక్షణకోసం ధర్మరాజ్యాన్ని, సమాజ హితవును, లోక కల్యాణాన్ని విడమరచి చెప్పడం పురాకృత సుకృత పరమాత్మ వరప్రసాదం. అక్షరరక్తి అక్షర శక్తనని గుర్తించడం సంస్కారమే!

భగవద్గీత భారతములోని భీష్మ పర్వములోనిది. ఏడువందల శ్లోకాలు ఉన్న మోక్ష సప్తశతి ఇది! సాక్షాత్తు భగవంతుడే గానము చేసినదని చెప్పబడుతున్నది కావున భగవద్గీత అనిపిలువబడుతున్నది. భగవత్ శబ్దము విస్తృతార్థము కలది మానవునికి మాధవునికి సంబంధించినది ఇహానికి పరానికి అనువర్తించేది అధ్యాత్మిక తత్వానికి ఆముష్మిక సత్యానికి అనుబంధించబడినది కృష్ణోపదేశం ఇరవై నిమిషముల పాటు జరిగి ఉండవచ్చునని అంచనా. రణరంగమందే గీతను ఉపదేశించుటలో నిగూఢార్థము దాగి ఉన్నదని గ్రహించాలి క్లిష్ట పరిస్థితిలో నిబ్బరంగా ఉండాలని ఉద్బోధించేగీత కష్టసుఖాల తాకిడికి ధీటుగా నిలబడి సమ్యమనాన్ని ప్రదర్శించాలని నిర్దేశిస్తుంది. బాధపడి భయపడి సాధించేది ఏదీ ఉండదని నిశ్చింతగా నిశ్చయంగా తనవంతు కార్యక్రమాన్ని ఫలాపేక్ష రహితంగా నిర్వహించే ఆశావాదంలో ఆశయం నెరవేరుతుందని. కర్మఫలత్యాగంలోనే మోక్షానుభూతి సంప్రాప్తమవుతుందని శ్రీ కృష్ణపరమాత్ముడు ఫల్గుణునికి చేసిన యోగోపదేశం చెబుతుంది అందుకే అది తత్వజ్ఞాన సర్వస్వమైనది. వేదాంతసారమైనది భారతీయ వాఙ్మయంలో సూత్ర గ్రంథమై, వేద సంస్కృతికి ప్రమాణ సాక్ష్యాధారమై, సమాజ శ్రేయస్సే జాతి శ్రేయస్సుగా విపులీకరించే రాజ్యాంగ శాస్త్రమై, మానవజాతి ధర్మాన్ని ఉపదేశించే జ్ఞానదీపమై సర్వకాల సర్వదేశ కాలావస్థలయందు మొక్కవోని దివ్యతేజమై, తరగని వారసత్వపు మంత్ర ముగ్ధమై క్షణక్షణము విశ్వరూపాన్ని ప్రదర్శించుచున్న భగవద్వాణి నభూతోనభవిష్యతి! ఆచంద్ర తారార్కం అజరామరం!!

ప్రపంచంలోని ఎన్నో భాషలు గీతతల్లి ఒడిలో ఓలలాడినవి! ఎన్నో దేశాలవారు భాషాతీతమైన గీతాసారాన్ని అమృతంపుకరణి తనవితీర గ్రోలినారు! ఎన్ని అనువాదాలు, ఎన్ని వ్యాఖ్యానాలు, ఎన్నెన్ని వివరణలు, ఉపన్యాసాలు శతశత పరంపరలుగా వాఙ్మయ క్షేత్రంలో పూరబూస్తూనే ఉన్నాయి. ఇంకా ఉదయిస్తూనే ఉంటాయి. ఈ విచిత్ర ధృతికి, అనంత ఉద్ధృతికి కారణమేమిటన్నది ఆసక్తిని. అనురక్తిని కలిగిస్తుంది ఎందరో మహామహులన్నమాట మననం చేసుకోవాలి. మహర్షులు సెలవిచ్చినమాట నెనపుకు తెచ్చుకోవాలి. గీతలో ఉన్నది కవిత్వంకాదు. ధర్మసౌందర్యం! గీతలో ఉన్నది పరమాత్ముని ప్రార్థనకాదు నిరంతర సాధన! ఆ ఉపదేశం కేవలం పరమపురుషుని ఆలాపన కాదు. చరితార్థమైన జీవితాన్ని సాధించడానికి అనుకూలపడే గురూపదేశమది! ఆ ఉపదేశం పరంధాముని స్వోత్కర్షకాదు. పరమార్థాన్ని పండించే మనుగడకు వలసిన దీక్షా ప్రహసనమది! అందుకే అది ఆ బాలగోపాలము. అంతేకాదు అది అమూల్య కైవల్యము కూడ!

భగవద్గీత హిందూ మత గ్రంథమని భావించడం పొరపాటేనని నా అభిప్రాయం. సృష్టిలో ఏ ఇతర మత గ్రంథానికీ లేని శాస్త్రీయ దృక్పథం నిండుకొన్న గీతను శాస్త్ర గ్రంథమనడమే సముచితం నిస్సందేహంగా గత సయింటిఫిక్ మాన్యువల్! గీతలో శాస్త్రబద్ధమైన మానవ జాతి వివరణ ఉన్నది జంతు జాతులకు సంబంధించిన విశదీకరణ ఉన్నది. జీవజాతులకు ప్రకృతికి గల అన్యోన్యమైన సంబంధానికి సరియైన అర్థమిచ్చే శక్తి గీతకున్నది. పదార్థ జ్ఞానానికి తత్వ జ్ఞానానికి గల స్పష్టమైన విభేదాన్ని నిర్దిష్టంగా ప్రవచించే శక్తి గీతకున్నది. ఆత్మ శక్తికి క్షేత్రశక్తికి దివ్యశక్తికి క్షుద్రశక్తికి ఆలోచనాత్మకమైన ఆచరణా సమ్మతమైన శాస్త్రగత చర్చ గీతలో కనిపిస్తుంది. దైహిక ఆధ్యాత్మిక భౌతిక గుణాత్మక పరిమాణాత్మక పరిణామ ప్రవృత్తికి యోగ్యమైన శ్రేష్ఠమైన శాస్త్రభూత కర్మసాక్షి గీతలో కనిపిస్తుంది శక్తి నిత్యత్వ నియమం గీతలో ఉన్నదే! శక్తి వినిమయ సిద్ధాంతం గీతలో ఉన్నదే! చక్రీయ ప్రకృతి వలయాలు గీతలో ప్రస్తావించబడ్డాయి జీవపరిణామ భావనలు గీతలో పొందుపరచబడ్డాయి! భౌతిక పరిభాషలో క్వాంటమ్ మెకానిక్స్, దైహిక పరిభాషలో డెవలప్‌మెంటల్ మెకానిక్స్, మానసిక స్థాయిలో సైకియాట్రిక్స్, ఆధ్యాత్మిక సైకోట్రానిక్స్ – అన్నీ కూడ ప్రత్యక్షంగానో పరోక్షంగానో భగవద్గీతలో ప్రత్యక్షమవుతాయి!

అన్నింటికీ మించి గీతలో కర్తవ్యబోధ ఉంది. త్యాగ నిరతి ఉంది సాధన ఉంది కృషి ఉంది. దీక్ష ఉంది. లక్ష్యశుద్ధి ఉంది. తరతరాల అనుభవసారముంది. భారతీయ భావముంది.

"కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన.
మా కర్మఫల హేతుర్భూః మా తే సంగోస్త్వ కర్మణి"–

అన్నమాట జాతి మత కుల దేశాలకు అతీతమైనది. స్త్రీ పురుష సంబంధమైనది. త్రిగుణ మాత్రలకు అందనిది అరిషడ్వర్గాలకు అందుబాటులో లేనిది

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

నిద్దురలోనైనా వెన్నుతట్టి ధైర్యం చెబుతుందీ గీతా శ్లోకం! అందుకే అది భగవద్గీత!!

–డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

సీరియల్

దాగుడుమూతలు

కప్పగంతుల మల్లికార్జునరావు

(గత సంచిక తరువాయి)

పేరు సంపాదించటం ఎంత సులభం? వొక్క సినిమా సక్సెస్ అవుతే ఫేమొస్తుంది. ఎన్ని గొప్ప నవలా రాజాల్ని, కావ్య కన్యకల్ని, మహానాటకాల్ని, కథాకుసుమాల్ని సృష్టించి ఏంలాభం? యింతపేరూ రాదు, డబ్బూరాదు.

'డియర్ గోపీ,

నీకు పెళ్ళయిందా ?

పద్దెనిమిదేళ్ళ కన్నెని నేను.

నీ రచనలంటే, మాటలంటే పిచ్చి ప్రేమ

పెళ్ళి చేసుకోరాదూ నన్ను ? ప్లీజ్...

ఫోటో నచ్చితే, కట్నం ఎంత కావాలో రాయి.

మా నాన్నగారితోసహా వస్తాను.'

ఆ వుత్తర రచయిత్రి లావణ్య అందంగా వుంది.

ఆమె వుపయోగించిన వాళ్ళ నాన్నగారి లెటర్‌పేడ్‌వల్ల ఆమె గొప్ప ధనవంతుల బిడ్డని తెలుస్తోంది.

పెళ్ళి చేసుకోమంటోంది. ఎంత గొప్ప అవకాశం ?

కానీ... కాట్... తనకు పెళ్ళయిందే ?

జరిగిన కథ—6 : జనార్ధనంగారు తమ కుమార్తె పెళ్లి వైభవంగా చేయ సంకల్పించారు. పెళ్లికొడుకు రమేష్ స్నేహితులు కోరే కోరికలకు హద్దూ, పద్దూ లేకుండాపోయింది. జనార్ధనంగారు కూతురు సులోచన మొహంలో పెళ్లికూతురు మొహంలో వుండాల్సిన మెరుపు లేకపోవడం గుర్తిస్తారు. డాక్టరు సుధాకర్ పెళ్లికూతురుని తదేకంగా చూడటం, పరధ్యానంగా ఉండటం రమేశ్ స్నేహితులు గమనిస్తారు. రమేశ్‌కు ఈ విషయం చెపుతారు. వారందరిలో ఈ విషయం ఆలోచనలు రేకెత్తిస్తుంది. జరగాల్సిన పెళ్లి ఆగిపోయింది. అదే ముహూర్తానికి గోపీచంద్ సులోచనను పెళ్లి చేసుకోడానికి సిద్ధపడతాడు. గోపిచంద్, సులోచనల వివాహం జరిగిపోయింది. సులోచనను గోపీచంద్ తల్లితండ్రులు ఆప్యాయంగా తమలో కల్పుకొన్నారు. వారితోబాటు మూగి వెంకన్న బాబు వచ్చాడు. వెంకన్న బాబును తీసుకెళ్లను వచ్చిన రమేశ్ సులోచన మాటలతో పరాభవం చెంది వెళ్లిపోతాడు. సులోచన స్నేహితురాలు అరుంధతి తన భర్త కాంతారావుతో చెప్పి, గోపీచంద్‌కు సన్మానం చేయిస్తుంది సుప్రసిద్ధ సినీ దర్శకుడు శ్రీమన్నారాయణ నుంచి అర్జంటుగా రమ్మని కబురందుకున్న గోపీచంద్ సులోచనను వాల్తేరు బండెక్కించి తను మద్రాసు బండెక్కుతాడు. గోపీచంద్ నవల ఆధారంగా డైలాగులు కూడ అతనే రాసిన సినిమా సక్సెస్ అవుతుంది. భర్త నుంచి ఏ కబురూ లేక బాధ పడుతుంది సులోచన — గోపీచంద్ పూర్తి సినిమా వ్యామోహంలో పడిపోతాడు.

'ప్రియమైన శ్రీవారికి—'

ఉలిక్కిపడ్డాడు గోపీచంద్. ఆ వుత్తరాన్ని పక్కకుపెట్టి గబగబా మిగతావాటిని చూడటం పూర్తిచేసేడు. లావణ్యతోసహా సమాధానాలివ్వదల్చుకొన్న నలుగురు ఫేన్స్ వుత్తరాల్ని అవతలపెట్టి మిగతావాటి నన్నింటినీ చెత్తబుట్టలోకి తోసేడు.

'బాయ్. వో 'హాఫ్' పట్టుకురా'

'యస్సార్'

గోపీచంద్ బుర్ర వొక్కసారిగా స్తంభించి పోయినట్లయింది.

సులోచన నుంచి చాలా వుత్తరాలు వచ్చాయి. ప్రతిసారీ యింతే. మైండ్ అండ్ బాడీ పేరలైజ్ అయిపోయినట్లవుతుంది. ఏదో బలహీనత, దోషభావన...నరాలను నిర్వీర్యం చేస్తుంది.

ఉత్తరం చదవ్వాలనే వుంటుంది. కానీ చదవటానికి ధైర్యం చాలదు. వో 'హాఫ్' పడాల్సిందే.

బాయ్ సరంజామాతో లోపలికి వచ్చాడు.

బాయ్ పేరు శివరావ్. సినిమాల్లోకి చేరుదామని మద్రాస్‌కు వచ్చి కాస్తంత చదువు, మంచి పర్సనాలిటీ వుండటంవల్ల వో చిన్న హోటల్లో సర్వర్‌గా వుద్యోగం సంపాదించి క్రమంగా యీ పెద్ద హోటల్లోకి ప్రవేశించాడు 'బాయ్'గా.

శివ సర్వర్ అయ్యాక చాలా భాషలు నేర్చుకున్నాడు. ఏ భాషకు చెందిన కస్టమర్‌తో ఆ భాషలో మాట్లాడుతాడు. ఎవరి అభిరుచినిబట్టి అలాంటి మాటలు చెప్తాడు. మనసు ఎరిగి పనులు చేస్తాడు. నెలల తరబడి పర్మనెంట్‌గా వుంటుండటంవల్ల, గోపీచంద్ అడగగానే శివని అతని రూమ్‌కి అల్లాట్ చేసేరు.

గోపీచంద్‌కిప్పుడు శివ పర్సనల్ అటెండెంట్.

గోపీచంద్ అలవాట్లు శివకు తెల్సు. అతని చరిత్ర కొంత కూపీ లాగేడు— మాటల్లో పడేసి. అతని శక్తి తెల్సు. బలహీనతలు తెల్సు.

సృజనం — అతని శక్తి.

కానీ బలహీనతలు ?

సిగరెట్లు తాగటం, అప్పుడప్పుడు 'మందు' పుచ్చుకోటం యీ మధ్యే అలవాటయింది. స్త్రీకి చాలా దూరం. మందు కూడా అందరి ముందు పుచ్చుకోడు. రహస్యంగా రూములో తలుపులు బిగించుకొని పుచ్చుకొంటాడు. అదీ వో పద్ధతి ప్రకారం కాదు. హఠాత్తుగా ఆర్డర్ చేస్తాడు. యీ స్వల్ప బలహీనతలకు ఆధారభూతమైన అసలు బలహీనత ఏదో వుండి వుండాలి. అదేమిటి ? శివానికి తెలీదు.

అతను టేబిల్‌మీద అన్నీ సర్దేడు.

'శివా. లాక్ దట్ డోర్.'

ఎప్పుడూ యింతే. అతను తాగటం తనకు ప్రాణ సంకటం. తాగటానికి తనకి వేళాపాళా, సమయం సందర్భం వున్నాయి. డ్యూటీలో వుండి తాగటం తనకు యిష్టం లేదు. కాని తప్పదుగా ?

డోర్ లాక్ చేసేడు.

గోపీచంద్ రెండు గ్లాసులు నింపేడు.

'ప్లీజ్ సిట్‌డౌన్ హియర్ శివా.'

శివ గోపీచంద్ ఎదురుగ్గా కుర్చీలో కూర్చోబోతున్నాడు. ఫోన్ మోగింది.

శివ రిసీవ్ చేసుకోటానికి అటువైపు రెండడుగులు వేసేడు.

'శివా. ప్రొడ్యూసర్ ఫోను అయివుంటుంది. లేనని చెప్పెయ్.'

శివ ఫోన్ ఎత్తేడు.

'హలో:... సాబ్ కమ్రామే యిల్లియే సార్...'

'అలాగని చెప్పమన్నారా ? సాబ్ గదిలో లేకపోతే నువ్వాయన గదిలో ఎందుకున్నావ్ ?'

శివ బిత్తరపోయాడు ! తేలుకుట్టిన దొంగే !

'సరే. ఆయన వస్తే కెమెరామేన్ రామారావు ఫోన్ చేసేరని చెప్పు. మళ్లీ మరో గంటలో ఫోన్ చేస్తాను. అప్పుడైనా రూమ్‌లో వుండమను. అర్జంట్ విషయం. చెప్తావా ?'

'చెప్తాను సార్.'

అవతల ఫోను పెట్టేసిన శబ్దం. శివ ఫోను పెట్టేసేడు.

'ఎవరది ? డైరెక్టరా ? ప్రొడ్యూసరా ?'

'ఎవరూ కాదుసార్. కెమెరామేన్‌ట ! బొమ్మను పట్టేసినట్లు మన పొరపాటును పట్టేసి వాయించేసేడు.'

'ఎవరతను ? పేరు ?'

'రామారావుగారుట.''

'రామారావుగారు... ఐసీ... రామారావుగారా !'

ఎప్పుడూ పాటించే ఫార్మాలిటీస్ పాటించకుండా అమాంతం గ్లాసెత్తి తాగేసిన గోపీచంద్‌ను చూస్తే నవ్వొచ్చింది శివకు !

12

రామారావు ఫోను క్రెడిల్ చేసేడు.


అల్లంత దూరంలో సెట్‌కి అవతల కుర్చీల్లో కూర్చొని డైరెక్టరు, ప్రొడ్యూసర్, యింకా ఎవరో 'గెస్ట్సు' మాట్లాడుకొంటున్నారు. వారు తనని గమనిస్తుంటారని రామారావుకు తెల్సు. ఎందుకంటే తను వెళ్లింది గోపీచంద్‌కు ఫోను చెయ్యటానికని వారికి తెల్సు. గోపీచంద్‌కు తనకు బంధుత్వం వున్నదనీ తెల్సు. అయినా మనసులోని బాధ, ఆందోళనను మనసులోనే అణిచిపెట్టి వుంచలేకపోయాడు. ఏమీ జరుగనట్లు వాళ్లవద్దకు వెళ్లలేకపోయాడు.

నీరసంగా కుర్చీలో కూలబడ్డాడు.

మొదటి పిక్చర్ అయేటంతవరకు బాగానేవున్నాడు గోపీచంద్. తను సలహాలు యిచ్చేవాడు. అతనూ అడిగేవాడు. లోచనను గురించి తననుగురించి, చెప్పేవాడు.

'మీరుకూడా పెళ్లి చేసుకోండి రామారావుగారూ. అంత పుణ్యం పుట్టి నేనూ ఇక్కడే సెటిల్ అవుతే సులోచనకు తోడుగా వుంటారు మీరు.'

'అంటే – ఉద్యోగం వదిలేసి పిక్చర్ ఫీల్డులో సెటిల్ అయిపోవాలని వుందా మీకు ? తొందరపడి 'రిస్క్'లు తీసుకోకండి. ఉద్యోగాలు వదులుకొని వచ్చిన రచయితలు ఎవరూ బాగుపడలేదిక్కడ. అన్నట్లు మీరిక్కడికి వచ్చిన దగ్గరినుంచి యింటికే వెళ్లిరాలేదు. ఒకసారి వెళ్లివస్తే బాగుంటుందేమో ?'



అంకితం

నితాంతం — అత్యంత ప్రాణ సంకటంగా
నా నరాలన్నీ చిట్లిపోతున్నా,
శక్తికి మించిన ప్రసవవేదనలాంటి
వ్యథనెంతో అనుభవిస్తున్నా,
నాలో ఏదో క్రొత్త స్పందనాలతో
తళుక్కుమంటూన్న ఒక ఆశా తటిల్లత ...

ఆ ఆశా ప్రాభవమే
నా అంతరంగాన్ని సర్వదా
పువ్వులా నవ్వేలా చేసి
లోకం ముందు వేషధారిలా
ఆనందాన్ని నాతో నటింపజేస్తూ
ఒక నిర్దుష్టమైన జీవన గమనాన్ని
అజస్రం రహస్యంగా నిర్దేశిస్తున్నది
వజ్రం విరజిమ్మే కాంతి పుంజాలను
నాలో అజేయంగా ప్రభావితం చేస్తూ ఉన్నది...

అందుకే — వ్యధాకులిత చికాకుల ఈ లోకంలో
ఎంతటి బాధాకరమైన యాతనలైనా
హింసాయుత దంష్ట్రల
ఘాతుక చర్యలనైనా
కడు ఓరిమితో భరిస్తూనే
నాకు నేనై కాలిపోతూ
క్రొవ్వొత్తిలా జీవితాన్ని
కొనసాగిస్తూ
ఒకే ఒక్క మహత్తరమైన శక్తిని
దీక్షగా సృష్టించాలనుకున్నాను,
నవ్య ప్రపంచపు టావిర్భావానికి
సృష్టికర్తగా నిలిచిపోవాలని
ఎంతో తపనతో కాంక్షిస్తున్నాను...

ఆ దివ్యమైన వ్యూహంతోనే —
జాతి చైతన్యాన్ని రూపొందించే
రాత్రి రక్కసులను ధ్వంసం చేసే
మహోజ్జ్వలమైన మరో సూర్యుడికి
నా రక్తం ఓడి ఇప్పుడే
జన్మనిస్తున్నాను —

అచంచలమైన దీక్షా సాధనతో
ప్రతిభాన్వితుడిగా ఈ సరిక్రొత్త సూర్యుణ్ణి
లోకాని కొక కానుకగా
అత్యంత తేజోవంతంగా
ఘనంగా తీర్చిదిద్దుతున్నాను...
ఇదిగో కోటి ప్రభలు వెదజల్లే —
ఈ బహుమానం — మీకే...
స్వీకరించండి !

— బండి లక్ష్మీనరసింహారెడ్డి

దాగుడు మూతలు

'నేనూ అదే అనుకొంటున్నానండీ. సులోచన వాల్తేరులో వుందనుకోండి. అయినా వోసారి వెళ్లివద్దామనుకొంటున్నాను.'

అనటమేకానీ వెళ్ల లేదని రామారావుకు తెల్సు.

'సులోచన వుత్తరం రాసింది సార్. మీరు అసలు వుత్తరాలే రాయటంలేదట. అదేమిటి ? సినిమాల్లో ఎంత బిజీ అయినా మనం ఫేమిలీస్‌ని మర్చిపోకూడదు సార్. పెద్ద పెద్ద నటులను చూడండి, యీ విషయంలో వాళ్లని చూచి నేర్చుకోవాల్సినది ఎంతైనా వుంది.'

మొదటి పిక్చర్ సక్సెస్ అయ్యాక అతను తనని తప్పించుకు తిరగటం ఆరంభించాడు. తను పలకరిస్తే క్లుప్తంగా మాట్లాడి వెళ్లిపోయేవాడు.

'ఏం సార్ ? వూరెళ్లొచ్చారా ? వుద్యోగం ఏం చేసేరు ? సులోచన కోర్సు అయిపోయిందిగా ? పోనీ ఆమె నొకసారి యిక్కడికి తీసుకురాకూడదూ ? మా మదర్, సిస్టర్స్ వున్నారు సార్. రమ్మని నేను రాయనా పోనీ ?'

'వద్దు సార్. నేను వెళ్లి తీసుకొస్తాగా ?'

క్రమంగా అతను బిజీ అయిపోయాడు. తనూ బిజీ అయిపోయాడు. అయినా అతడిని వదలలేదు. ఫోన్‌లు చేస్తే లేడని చెప్పిస్తాడు. అది చిత్ర రంగంలో మామూలే. నిజంగా బిజీగా వుండి అలా ట్రిక్స్ ప్లే చేస్తున్నాడనుకొన్నాడు.

అతను స్క్రిప్ట్ రాసిన మరో రెండు సినిమాలకు తను కెమెరా మెన్‌గా పనిచేసేడు. కానీ తామిద్దరూ కలవటం పడలేదు. యీలోగా జనార్దనం అన్నయ్య వద్దనుంచి వుత్తరాలమీద వుత్తరాలు ...

ఏమిటిదంతా ?

ఇలా వుండగా యీ సినిమా షూటింగ్‌కని జనార్దనం వాళ్ల గ్రామాల దాపులకే వెళ్లేడు.

అక్కడ తెల్సిందతనికి —

గోపీచంద్‌ను వుద్యోగంలోనుంచి తీసేసేరు.

తల్లితండ్రులకి కాని, భార్యకుకాని కనీసం వుత్తరాలు కూడా రాయటంలేదు. ఎన్ని వుత్తరాలు రాసినా జవాబులేదు.

'గొప్పవాడు కావటానికి మార్గాలే లేనట్లు అనవసరంగా యీ సినిమా రంగంలోకి దించేవు. గొప్పవాడయ్యాడు. కానీ యిదేం గొప్ప ? భార్య, యిల్లు, ఏమీ పట్టకుండా వున్న మనిషి ఎంత గొప్పవాడయి ఎవరికి లాభం ? సులోచన సంసారం ఏమవుతుందోనని నాకు భయంగా వుందిరా ? నువ్వూ అక్కడే వుంటావుగా ? అతను అంత బిజీగావుండి ఏం చేస్తుంటాడు ? డబ్బు కన్పిస్తే అన్నీ ఆకర్షణలూ మాయలోకి లాగుతాయి. అలా మాయలో పడలేదుకదా అతను ?'

జనార్దనం భావన రానురాను అర్థమయింది.

సినిమా వాళ్లంటేనే దుర్గుణాల పుట్టలన్న భావనముంది. అందుకు తగ్గట్టే చాలామంది ప్రవర్తన వుంటుంది కూడా.

'అన్నయ్యా ! సినిమా రంగంలోకి పోయినవాళ్లంతా చెడిపోవాలన్న రూల్ లేదుగా ? నేనేం చెడిపోయాను ? అది నా వృత్తి. నా వృత్తి నేను చేసుకొంటున్నాను — అందరిలాగే. గోపీచంద్‌గారు నన్ను తప్పించుకొని తిరుగుతున్నారు. ఎందుకో ననుకొన్నాను. అందుకేదో కారణం వుందని యిప్పుడర్థమయింది. అతను నువ్వు భయపడుతున్నట్లు తాగుడుకు, స్త్రీలకు బానిస కాలేదనే అనుకొంటున్నాను. ఎందుకంటే సినిమా ఫీల్డులో మనిషి చెడినా బాగుపడినా నిముషంలో అందరికీ తెల్సిపోతుంది. పైగా గోపీచంద్ వొక్కసారిగా పేరుకొట్టేసేడు ? అతడి పతనాన్ని కోరే వ్యతిరేక శక్తులు అతడిలో వొక్క బలహీనత కన్పిస్తే స్కేండలైజ్ చేయటానికి పొంచి చూస్తుంటాయి.'

'ఏమో ! పెళ్లిలో అట్లాగయింది. పోనీ ఆ గండం ఎలాగోలాగు గట్టెక్కేంకదాని సంతోషిస్తుంటే యిలా అవుతోంది. నాకేం దిక్కు తోచకుండా వుంది.'

'లోచన ఏమంటుంది ?'

'అదేమంటుంది ? ఏమనగలదు ? గట్టిగా మనం ఏదన్నా అడిగితే ఏడుస్తుందేమోనని భయం. నువ్వే వాళ్ల సంసారాన్ని చక్కబర్చాలి.'

'అలాగే. కానీ నేన్రప్రాంతాలలో షూటింగ్ నిమిత్తం యింకా వో వారంపైనే వుంటాను— యీలోగా లోచనను వోసారి పిలిపించ కూడదూ ? నేను మాట్లాడతాను. చూడాలనికూడావుంది దాన్ని.'

'అలాగే పిలిపిస్తాను.'

సులోచన వచ్చింది. వాళ్ల సంసారంలో ఏమన్నా కలతలు వున్నాయేమోనని ప్రశ్నలు వేసేడు.

'బాబాయ్ నీ భావం నాకర్థమయింది. కానీ మా సంసారంలో ఎలాంటి పొరపొచ్చాలూ లేవు. ఆయన అన్నివిధాల వుత్తముడు. ఆయన తన యింట్లో మనుష్యుల్ని కూడా సంస్కారవంతులుగానే తీర్చిదిద్దుకొన్నాడు. ఆయనకు మద్రాసుకు మీ నుంచి పిలుపువచ్చిందాకా అంతా బాగానేవుంది. ఆ తర్వాత ఏంజరిగిందో నాకు తెలియదు. ఏంజరిగినా అది మద్రాసులోనే జరిగివుండాలి.'

'అతను మిమ్మల్ని మద్రాసుకు తీసుకెళ్తామంటే మీరుకాని ఎప్పుడైనా రామన్నారా ? నువ్వేకానక్కర్లేదు. మీ అత్తగారు, మామగారు...'

'మద్రాసు వెళ్లేక ఆయన అసలు వొక్కసారైనా తిరిగి యింటి కొస్తేగా ? మా మామగారికి రాసిన వుత్తరాల్లోకాని, నాకురాసిన ఉత్తరాలలోకాని ఆయన అసలు ఆ ప్రసక్తే తీసుకురాలేదు. నేనే ఆ విషయం చాలాసార్లు రాసేను. ఆయనను వదిలి మేం వుండలేం బాబాయ్. ఆయనతో నేను చెప్పేనని స్వయంగా చెప్పవూ ? మద్రాసుకు వచ్చి ఆయనతో వుండటానికి మేమంతా సిద్ధంగా వున్నాం బాబాయ్.'

'అతను నీకు కాని, తండ్రికి కాని డబ్బు ఎప్పుడైనా పంపేడా ?'

'మొదట్లో తండ్రి పేర కొన్నివేలు వొకేసారి పంపేడు. ఆ తర్వాత డబ్బు ఆయన పంపుతానని రాసినా మేము ఆయన వస్తే అదే పదివేలని రాసేము. ఆ తర్వాత డబ్బు ప్రసక్తి కూడా లేదు.'

'అన్నట్టు పెళ్లయ్యాక మీతోపాటు వో మూగ కుర్రాడు వచ్చాడు కదా ? అతనెక్కడ వుంటున్నాడు ?'

'ఓ ! నీకింకా అతడు గుర్తున్నాడే ! వెంకన్నబాబు ఎవరోకాదు— తప్పిపోయిన పెండ్లికొడుకు తండ్రికి స్వయానా మేనల్లుడే. ఎందుకో వాడికి ఆయనంటే గౌరవం ప్రేమ ఏర్పడింది. మా వెంట వచ్చాడు. కానీ వాళ్ళు అతడికోసం గొడవచేసేరు. చివరికాయన వాడిని అంగవికలుల కోసం ఏర్పాటైన స్కూల్లో చేర్పేసి వచ్చాడు. తప్పిపోయిన మామగారు అప్పుడప్పుడు వచ్చి కోర్టులో కేసు పెడ్తానంటూ మమ్మల్ని బెదిరించి పోతుంటాడు. వెంకన్నబాబు వెనుక ఆస్తి వుంది. దాన్ని కాజెయ్యాలని ఆయన పన్నాగం. వాడు చదువుకొని ప్రయోజకుడు కావటం వాళ్ల కెవరికీ యిష్టంలేదు. వాడంటే ఆయనకెంతో యిష్టం. పరబ్రహ్మ మూర్తిగారు మాటిమాటికివచ్చి మమ్మల్ని, వాడిని బెదిరిస్తున్నాడని చెప్పు వాడి విషయంగానైనా వస్తారేమో !'

'దిగులుపడకమ్మా. అతడితో నేను మద్రాసు వెళ్లగానే మాట్లాడుతాగా ? అసలు విషయం తెల్సుకొంటాగా ? అతను స్వభావ సిద్ధంగా మంచివాడు. ఆకర్షణలకు, ఆశకు బానిసయ్యే మనిషికాదు. ఆదర్శాలకు కట్టుబడిన మనిషి. అందుకే, డబ్బుంలేకాని ఆ ఆదర్శాలు రాణించవన్న వుద్దేశ్యంతో యీ రంగంలోకి దింపేను నేను. కానీ యిలా జరుగుతుందనుకోలేదు. నీ సంసారాన్ని చక్కదిద్దే పూచీనాది. నువ్వు నిశ్చింతగా వుండు.'

అభయమిచ్చాడు సులోచనకు. కానీ ...

'సర్. డ్రింక్ ! మీరిక్కడే కూర్చుండిపోయారేమిటి ? డైరెక్టర్‌గారు ప్రొడ్యూసర్‌గారు పిలుస్తున్నారు. సీన్‌కూడా రెడీ అయింది' అసిస్టెంట్ కెమెరామెన్ వచ్చి చెప్పేడు.

'ఆల్‌రైట్ ! కమింగ్ ... '

జనార్దనంగారి వూరి దగ్గర షూట్ చేసిన సినిమాలో కొంచెం పేచ్‌వర్క్ మిగిలింది. స్టూడియోలో నాలుగురోజుల వర్క్.

'ఏంటి రామంగారూ ! గోపీగారు మీ బంధువుటగా ? ఏంటి అట్లాగయిపోయారు — ఫోనులో మాట్లాడగానే ?'

సినిమావాళ్లు ఆవలిస్తే పేగులు లెక్కపెడ్తారు. కాస్తంత వుంటే గంపంత చేసి స్కేండల్స్ సృష్టిస్తారు. కొందరికదో సర్దా అవుతే మరికొందరికి ప్రొఫెషన్ ! యీ ప్రొడ్యూసర్ మొదటి తరహా మనిషి.

'ఏం లేదండి. రూమ్‌లో లేడు.'

'రూమ్‌లో ఆయన లేకపోతే ఎవరితో మాట్లాడుతున్నారు ? ఆయన హోటల్ గదిలోకదా వుంటున్నారు ? అన్నట్లు అతనికి భార్యకు పడటంలేదని చెప్పకొంటున్నారేంటి — ఫీల్డులో. అసలు అతను పెళ్లే ... '

అంటే అప్పుడే అతడి వ్యక్తిగత జీవితం గురించిన చర్చలు ఆరంభమయ్యాయన్న మాట ! అంటే అతను చాలా పెద్దవాడయినట్లు లెక్క !

'ఆ విషయాలన్నీ మనకెందుకులెండి ! డైలాగులు బాగా రాస్తాడు. మనం ఎలా కావాలంటే అలా రాసిస్తాడు. మనక్కావల్సిం దంతవరకే. అన్నట్లు రామంగారూ ... మన సినిమాలో డైలాగులు ఎలా వున్నయంటారు ? జనంలో పేలిపోవూ ?'


చాలా పాత క్రైమ్ సెంటిమెంట్ కథ అది. అలాంటి కథను డైలాగులు రాయటానికి గోపీచంద్ అంగీకరించవల్సిందికాదు. అతని రచనల్లోని ఆదర్శాలకు యీ కథ చెప్పే నీతికి హస్తిమ శకాంతరంవుంది. అయినా ఎందుకొప్పకొన్నాడు ? పేరు కోసమా ?

షూటింగ్ జరుగుతున్నప్పుడు ప్రతిదృశ్యాన్ని చూస్తూ అలా ఎన్నోసార్లు అనుకొన్నాడు రామారావు.

'పేలటం ! అలాగ యిలాగునా ? బ్రహ్మాండంగా పేలిపోవూ ?'

'అందుకేనయ్యా. మన నెక్స్‌ట్ పిక్చర్‌కు కూడా ఆయనచేతే మాటలు రాయిద్దామనుకొంటున్నాను. అన్నట్లు మంచి కథేమైనా వుందేమో కనుక్కోరాదూ ? అతనిప్పుడు బిజీ మనిషి అయ్యాడు గదా ? అందుకని కాస్త మీ రెకమెండేషన్ ... '

నవ్వాలో ఏడవ్వాలో తెలీలేదు రామారావుకు !



దాగుడు మూతలు

శ్రీమన్నారాయణ ఫోను క్రేడిల్ చేసి సిగరెట్ కోసం జేబులు వెతుక్కొన్నాడు. అతను ఎప్పుడూ సిగరెట్లు తాగడు. చిరాకుకాని, కోపంకాని వచ్చినప్పుడు మాత్రమే తాగుతాడు.

ప్రొడ్యూసర్ తన జేబులోనుంచి పెట్టె తీసి అందించాడు. సిగరెట్టు తీసి ముట్టించి గట్టిగా వో దమ్ములాగి పొగ వదిలేడు.

'విన్నావుగా ? యిదీ వీళ్ల ధోరణి ! అవకాశం యిచ్చిందాకా మనల్ని 'బంత' అని అంతని పొగుడుతారు. మన చుట్టూ తిరుగుతారు. కాస్త పేరు రాగానే తాటిచెట్టెక్కి కూర్చుంటారు. ఆయనగారికి కథ డిస్కషన్‌కు టైమ్ లేదుట. షెడ్యూల్ చూచి చెప్తాడుట ! పెద్ద హీరో అనుకొంటున్నట్లుంది. ఛఛ... యీ కొత్తవాళ్లకన్నా పాతవాళ్లే నయం. ఎంతసేపు డిస్కస్ చేయమంటే అంతసేపు చేస్తారు. ఎన్నిసార్లు మార్చి రాయమంటే అన్నిసార్లు రాస్తారు. కసురుకొన్నా నవ్వి జోక్‌లేస్తారుకాని కోప్పడరు. బాధపెట్టుకోరు. యీ కుర్రకారు అలా కాదే ? సరుకు తక్కువ. పోజు లెక్కువ. మా పాత రచయితను పిలిపించండి. గోపీచంద్ వద్దు.'

ప్రొడ్యూసర్ నీరుకారిపోయాడు.

పాత రచయిత అని డైరెక్టరంటున్న రచయిత పిక్చర్లు లేక తన పల్లెటూరుకు వెళ్లిపోయాడు. అరవై అయిదేళ్ల ముసలాడు.

ఆయన కథలు పాత చింతకాయ పచ్చడిలా వుంటాయి. ఆ కథ సినిమా తీస్తే తను తుండుగుడ్డ నెత్తినేసుకోవాల్సిందే !

'మనిషిని పంపిస్తారో, లేకపోతే టెలిగ్రాం యిచ్చి పిలిపిస్తారో, రెండు రోజుల్లోగా యిక్కడ వుండాలి ఆయన. అన్నట్లు ఆయన అడ్రస్ తెల్సుగా ? పిలిపించండి.'

శ్రీమన్నారాయణ ఆర్డర్ జారీచేసి వెళ్లిపోయాడు.

ప్రొడ్యూసర్ ఆలోచనలో పడ్డాడు.

'నెత్తురుకూడు' ప్రొడ్యూసర్ కాదు అతను. జూనియర్ పార్టనర్. ఆ సినిమా సక్సెస్ అయింది. కానీ అసలు ప్రొడ్యూసర్‌కి యితనికీ లాభాల పంపకం దగ్గర తగాదాలొచ్చాయి. చీలిపోయారు. పెద్ద ప్రొడ్యూసర్ భారీ ఎత్తున సినిమా తియ్యటానికి మరో పెద్ద డైరెక్టర్‌ను వెతుక్కొంటూ వెళ్లేడు. ఇతనికి సినిమా తియ్యాలని వుంది. కానీ డబ్బు ఎక్కువలేదు. భారీ సినిమాలు తియ్యలేడు. బడ్జెట్ సినిమా తియ్యాలని వుంది. శ్రీమన్నారాయణను పట్టుకొన్నాడు. గోపీచంద్, అతను కల్సి మరో నెత్తురుకూడు తీస్తారని అతని ఆశ. కానీ వ్యవహారం మొదట్లోనే యిలా అయిందేమిటి ?

గోపీచంద్ యిప్పుడు 'ఫైల్'లో వున్నాడు. పేరు వుంది. పైగా అతడిశక్తి సంపదలు తనకు తెల్సు. 'నెత్తురుకూడు' డిస్కషన్స్ తను ఫాలో అయ్యాడు. షూటింగ్ ఫాలో అయ్యాడు. గోపీచంద్ సలహాలే 'క్లిక్' అయ్యాయి సినిమాలో. అలాంటి వ్యక్తుల్ని బాగా వాడుకోటం తెల్సు శ్రీమన్నారాయణకు. పాత రైటర్, ఆయనా కలిస్తే తన నెత్తిన గుడ్డే ! తనకి మిగిలేది బూడిదే.

యిలా ఆలోచిస్తూండగా అతనికి వో ఆలోచన వచ్చింది. టైం చూసుకొన్నాడు. గోపీచంద్ ఇచ్చిన అరగంట గడువయింది.

హోటల్ రూమ్‌కు ఫోను చేసేడు.

'ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్... గ్... గ్...'

'నేను హోటల్ బాయ్‌నండీ. గోపీచంద్‌గారు లేరు.'

తక్కువ ఫోను పెట్టేసేడు అవతలి వ్యక్తి—శివం నవ్వుకొన్నాడు. నాయుడు మళ్లీ ఫోన్ చేసేడు. అదే సమాధానం... కానీ... యీసారి జాగ్రత్తగా అవతలి మాటల్ని, ఆ వెనుక వచ్చే శబ్దాన్ని పరీక్షించాడు.

టాక్సీ చేసుకొని నేరుగా హోటల్‌కెళ్లేడు.

అప్పుడే బయటికి వొచ్చి గోపీచంద్ రూమ్‌ను లాక్‌చేస్తున్నాడు శివ. నాయుడిని చూసి బిత్తరపోయాడు.

నాయుడు శివని చూసి నవ్వేడు. జేబులోనుంచి నోటు వొకటి తీసేడు.

'ఏం సంగతి ? మందులో వున్నారా ?'

'ఊ. రహస్యమండీ. యింతకు ముందు ఫోను చేసింది మీరేనా ?'

'ఊ.'

'అంతకు ముందు. అదే నన్ను చీవాట్లు వేసింది ?'

'నేను కాదులే. కానీ అంత రహస్యం ఎందుకు ? తాగితే తప్పేంటి ?'

'నాకు తెలియదండీ. కానీ ఆయన ఎప్పుడూ తాగడు. ఎప్పుడో హఠాత్తుగా బుద్ధి పుడుతుంది. నేనాయనకు కంపెనీ.'

'యిప్పుడేం చేస్తున్నారాయన ?'

'ఏం చేస్తారండి ? నిద్ర పోతున్నారు. మరో గంట తర్వాత లేస్తారు. ఆ తర్వాత అంతా మామూలే'

'అయితే ఫర్వాలేదు. నేను వెయిట్ చేస్తాను. కానీ ఆయన లేవగానే నేనే మాట్లాడాలి. తెల్సిందా ?'

తలూపేడు శివ !

... ...

... ...

శివ అలా చెప్తున్నప్పుడు నిజానికి గదిలో గోపీచంద్ నిద్ర పోవటం లేదు. శివను తలుపేసుకొని వెళ్లమని పంపించి సులోచన నుంచి వచ్చిన వుత్తరాన్ని తీసేడు. దాన్ని చదవటానికి కావాల్సిన ధైర్యం యిప్పుడు తనకి వచ్చింది. గిల్టీగా ఫీలయే స్థితిని అతని కడుపులోకి దిగిన పదార్థం పోగొట్టింది.

'ప్రియమైన శ్రీవారికి—

మీ దర్శన భాగ్యం లేకపోయినా మీ పేరును ప్రతి రోజూ ఏదో పత్రికలో చూచే భాగ్యం లభిస్తూనే వుంది. మీ నుంచి వుత్తరాలు లేకపోయినా మీ గురించిన సమాచారం జనులందరితోపాటు మాకు తెలుస్తూనే వుంది. మీరు పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొంటూ రోజు రోజుకీ గొప్పవారవుతున్నందుకు సంతోషిస్తూనే వున్నాం.

కానీ మేమేం పాపం చేసేమని మా పట్ల యీ వుదాసీనత ?

అన్నన్ని డైలాగులు రాస్తున్నారే ? తండ్రికో, తల్లికో, తోబుట్టువులకో, భార్యకో, వొక్క రెండు లైనులు వుత్తరం రాసే వ్యవధి లేదా ? లేక మీరు రాసే ప్రతి అక్షరం డబ్బు సంపాదించాలన్న నియమం పెట్టుకొన్నారా ?

మా వల్ల ఏదైనా పొరపాటు జరిగిందా ? మీ మనసుకు కష్టం కలిగించే మాట ఏమన్నా అన్నానా ? ఏదన్నా అలాంటిపని చేసేనా ? ఉన్నట్టుండి — మద్రాసుకు వెళ్లగానే హఠాత్తుగా మీరెందుకు మారిపోయారు ?

ఏమండీ,

యిన్నాళ్లు మీ నాన్నగారు మీ కొస్తున్న పేరును చూచి సంతోషించారండీ. 'నా కొడుకు గొప్పవాడయ్యాడని' పొంగిపోయాడు. మీరు రాసిన మొదటి సినిమాను చూస్తూ సినిమాహాల్లో ఆయన ఆనందంతో ఎలా నాట్యంచేసేరో తెల్సా ? కానీ యిప్పుడాయన మీకొచ్చే పేరును మాత్రమే చూచి సంతోషించలేకపోతున్నాడు. మిమ్మల్ని చూడాలని ఆవేదనపడుతున్నాడు. మీ కష్టాలలోకాని సుఖాలలోకాని, మంచిలోకాని, చెడులోకాని, ఆత్మీయులైన తల్లిదండ్రి, తోబుట్టువులు, భార్యా భాగం పంచుకోవాలనుకోటం తప్పాండీ ?

మాకు మీ డబ్బు ప్రధానంకాదండీ. మీరు కావాలి.

వొక్కసారి వచ్చి మా కళ్లకు విందుచేసి పోరూ ?

లేక మేమే అక్కడికి రావటానికి అనుమతి యివ్వరూ ?

మీ మనసు వున్నతం. మీరు వున్నతం—

అయివుండీ మాకీ మానసిక ఘోష ఏమిటండీ ?

మిమ్మల్ని గురించిన యీ సస్పెన్సుతో మేం బతకలేమండీ—

మమ్మల్ని కనికరించండి. ప్లీజ్...ప్లీజ్...ప్లీజ్...

కన్నీళ్లతో— మీ లోచన.'

వొకటి—రెండు—మూడుసార్లు చదివేడావుత్తరాన్ని.

కన్నీళ్లు కారిపోతున్నాయి అతని చెంపల మీదగుండా.

'నేనేంచెయ్యను లోచనా ? నేను దోషిని. భ్రష్టుడిని. పతితుడిని...' అతను హిస్టీరిక్‌గా ఆ మాటల్ని అంటూ ఆ వుత్తరాన్ని ముద్దు పెట్టుకోసాగేడు.

'ఐలౌయూ లోచనా. నాకు నువ్వంటే అయిష్టంలేదు. కానీ... కానీ...' అతను ఆ వుత్తరాన్ని ముద్దులతో ముంచెత్తేడు.


అలసిపోయిందాకా అలాచేసి హఠాత్తుగా ఆ వుత్తరాన్ని చించేడు —ముక్కలు ముక్కలు చేసి పారేసేడు.


దిండులో మొహం దాచుకొని పడుకొన్నాడు.

మత్తు అతడిని క్రమంగా మింగేసింది !

మరోగంట తర్వాత మత్తు తొలిగింది. లేచి మొహం కడుక్కొని మామూలు మనిషయ్యాడు.

'సర్. నాయుడుగారుట. ప్రొడ్యూసర్ ...'





దాగుడు మూతలు

నాయుడు కోరిన కోరిక వినగానే మనసు ఆనందంతో ఎగిరింది. అయినా వెంటనే రెస్పాన్స్ యివ్వలేదు. నాయుడే మాట్లాడేడు.

'సర్. నెత్తురుకూడు సినిమా ఎవరి ప్రతిభవల్ల అలా తయారయిందో నాకు తెల్సు సార్. కానీ డైరెక్టర్‌గారు అంతా తన ప్రతిభేనంటాడు. పైగా రచయితగా మిమ్మల్నొద్దని ఆ పాత రైటర్ని పిలిపించమన్నాడు. అప్పుడొచ్చింది సార్ నాకీ ఆలోచన. గోపీచంద్‌గారూ నేను చిన్న ప్రొడ్యూసర్‌ని. మీరు పెద్ద రైటరు. నాకు మీ శక్తిమీద నమ్మకం వుంది. మీ చేతిలో పెడ్తే నా డబ్బు భద్రంగా వుంటుంది. మీరు కాదనకూడదు. నాకీ సహాయం చేసిపెట్టాలి.'

చాలాసేపు గదిలో నిశ్శబ్దం తాండవించింది.

'చేసి పెడ్తాననుకొందాం ... కానీ నాకేం లాభం? నా చేతిలో రాయాల్సిన స్క్రిప్ట్సు చాలావున్నాయే!'

'మీకేం కావాలో అడగండి. మీకు లాభంలేని పనిని నేనెందుకు చేయమంటాను? శ్రీమన్నారాయణగారిచ్చినంత డబ్బు యిస్తాను.'

'అదెలాగూ యిస్తారు. డబ్బు సంగతికాదు నేనంటోంది. పిక్చర్‌ని నా యిష్టం వచ్చినట్లు తీస్తాను. మీరు ఎటువంటి జోక్యం కలుగచేసుకోకూడదు. మీరేకాదు ఎవరూ ఏ విషయంలోనూ జోక్యం కలుగచేసుకోకూడదు. అంతా నేను చెప్పినట్లు చెయ్యాలి. నన్ను ఏ విషయంలోనూ ప్రశ్నించకూడదు. అంత నమ్మకం నా మీదవుందా మీకు?'

'వుంది. కానీ డబ్బు ...'

'మీ డబ్బు పెరుగుతుందో, తరుగుతుందో నేను చెప్పలేను. అయితే వొక్కటి మాత్రం చెప్పగలను. 'నెత్తురుకూడు' ఎన్నిరోజు లాడింది.'

'యాభై రోజులు.

'అది అసలు వందరోజులు పైగా ఆడివుండాల్సింది. కేవలం నా స్టోరీని బేస్ చేసుకొని యథాతథంగా తీయకపోవటంవల్ల యాభై రోజులు నష్టం వచ్చింది. యీ సినిమా ఆడితే వందరోజులు ఆడుతుంది. ఇంటర్‌నేషనల్ ఫేమ్ వస్తుంది. ఫ్లాప్ అవుతుంది మధ్యేమార్గం వుండదు. యిందుకు మీ కిష్టమైతేనే రిస్క్ తీసుకోండి. నేను మీకు ఆర్థికంగా చెయ్యగల సాయం వొక్కటే. నా రెమ్యూనరేషన్‌ని పిక్చర్ సక్సెస్ కాకపోతే అడగను. ఈ కండిషన్స్‌కు మీకు అంగీకారమైతే మిగతా విషయాలు మాట్లాడుకొందాం' సిగరెట్ వెలిగించి చైర్‌లో జారగిలబడ్డాడు గోపీచంద్.

నాయుడు ఆలోచనలో పడ్డాడు. అయిదు...పది... పావుగంట... పాతపచ్చడా? కొత్తపచ్చడా? సినిమా రంగంలో కొత్తపచ్చడే ఆరోగ్యంగా వుంది.

'ఆల్‌రైట్ డైరెక్టర్ సాబ్. మనమధ్య వొప్పందాన్ని సెలబ్రేట్ చేసుకొందామా?' బేగ్‌లోనుంచి ఫారిన్ విస్కీ బాటిల్ తీసి టేబిల్‌మీద వుంచుతూ అన్నాడు ఆయన.

ఉలిక్కిపడ్డాడు గోపీచంద్!

'సారీ. నేను తాగనని మీకు తెలియదా?'

'సార్. నేను ప్రొడ్యూసర్‌ని. నా సినిమాకు మీరు దర్శకులు. మన మధ్య రహస్యాలుంటే సినిమా బాగుండదు సార్. మీరు ఎప్పుడూ శారీరికంగా, మానసికంగా కులాసాగా ఆనందంగా వుండటం నాకు ముఖ్యం. నేను గంటకు పైగా మీకోసం బయట వెయిట్ చేస్తున్నాను. అంతకు ముందు రెండుసార్లు ఫోను చేసేను.'

'ఓ! ఐ సీ!'

గోపీచంద్ బాటిల్‌ని చేతిలోకి తీసుకొని లేచాడు.

'ఆల్‌రైట్. లెటజ్ సెలబ్రేట్ దిస్ అకేషన్ ఇన్ ఏ న్యూ వే న్యూ ఫేషన్. న్యూ వేవ్— దిసీజ్' అంటూ బాటిల్‌ను సింక్‌కేసి కొట్టేడు. బాటిల్ తునకలయింది. ద్రవం సింక్‌లో పడింది.

'సార్...'

'ఆగండి నాయుడుగారూ. నన్నడ్డగించకండి. నాకు దర్శక పదవినిచ్చారు మీరు. నేను ఈ పదవిని పవిత్రంగా భావిస్తున్నాను. నేను తియ్యబోయే సినిమా కూడా అంత పవిత్రంగా వుంటుంది.


అంత పవిత్రమైన సినిమాను మనోనేత్రంతో ముందుగ దర్శించగల నేర్పు, శక్తి నాకు రావాలంటే నేను యింతవరకు చేసిన దోషాలకు పరిహారం పొందాలి. నా మనస్సు క్షాళనం కావాలి. అందు కిదొక్కటే మార్గం.'

అతను పగిలిన గాజుముక్కను ఎడం వేతిలోకి గుచ్చుకొన్నాడు. రక్తం చిమ్మింది.

'నెత్తురుకూడు' విష సమానమాన్నాను నవలలో. ఆ విషాన్నే ఆ సినిమా ద్వారా తియ్యగా జనం మనసుల్లోకి ఇన్‌జెక్ట్ చేసేను. ఆ పాప ప్రక్షాళన జరుగుతోందిప్పుడు. కాగితం తీసుకోండి. నా రక్తంతో మీ కాంట్రాక్టు మీద సంతకం పెడ్తాను.'

నాయుడుకు నోట మాట రాలేదు.

'ఆశ్చర్యపోకండి నాయుడుగారూ. మీకు నా చర్య అర్థంకాక పోవచ్చు. కానీ నా అంతరాత్మకు తెల్సు— యీ చర్య వెనుకగల అంత రార్థం. దాన్ని మీకు విశదపర్చి చెప్పను. కానీ మీరుకానీ, మరెవరుకాని,





ధర్మపథం

—బులుసు వేంకట రమణయ్య



మారిపోతున్న పేర్లు

పేర్లు మారిపోతూ ఉండడం మానవులలోనే కాకుండా ప్రదేశాల విషయంలో కూడా కానవస్తుంది. మొదట అర్థవంతంగా ఏదో ఒక పేరు ఏర్పడితే అది క్రమ పరిణామాలు పొంది ఏదో ఒక నామంతో స్థిరపడిపోతుంది. ఇలా పేర్లు మారిపోవడం వల్ల అసలు విషయం తెలియకుండా పోతున్నది.

ఆంధ్ర విష్ణు దేవుని క్షేత్రమయిన శ్రీకాకుళం ప్రాచీనమైనది. శ్రీకృష్ణ దేవరాయలు ఆ దేవుని పూజించాడు. ఆ పేరే ఉత్తరాంధ్రలో జిల్లా కేంద్ర-మైన శ్రీకాకుళానికి కూడా ఉన్నది. ఇక్కడ కోటీశ్వరస్వామి దేవాలయం ఉన్నది. కాని ఆంధ్ర విష్ణువు ఆలయం లేదు. దీనికి పేరు ఎలా వచ్చింది? అనే ఆలోచన ఒకప్పుడు కలగగా- వివరాల కోసం ప్రయత్నించడం జరిగింది. దానివల్ల ఇది మొదటి పేరు కాదనీ, కాలక్రమాన మారుతూ వచ్చి శ్రీకాకుళంగా స్థిరపడిపోయిందనీ విపులంగా తెలిసింది.

నిజాం నవాబు ప్రభుత్వ కాలంలో ఇది ఒక ముఖ్య స్థలం. ఆయన ప్రతినిధి ఇక్కడ ఉండి, ఆ ప్రాంతా-లను పాలించేవాడు. వివిధ స్థలాలలో వసూలు చేసిన పన్నుల పైకం సంచులలో పోసి, వాటి మీద సీలు వేసి, సముద్దార్లు ఇక్కడికి పంపే-వారు. వాటి శిఖలపై గల సీళ్లను ఇక్కడ ఖోల్ చేసి, అంటే-విప్పి సొమ్మును లెఖ్ఖించి ఖజానా గృహంలో భద్ర పరచేవారు. శిఖను ఖోల్ చెయ్యడం వల్ల దీనికి శిఖాఖోల్ అనే పేరు వచ్చింది. తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం వారు చాలాపేర్లను మార్చి-నట్లే దీనిని చికాకోల్‌గా మార్చారు. చికాకోల్ అని ఆంగ్లంలో దీనికి ముద్ర పడింది. ఆ ప్రాంతీయులు శ్రిగాకుళంగా దీనిని మార్చి వేసి, చాలా-కాలం వరకూ ఈ విధంగానే వ్యవహ-రించేవారు. భారత దేశానికి స్వాతం-త్ర్యం వచ్చిన తర్వాత చాలా స్థలాల పేర్లు మార్చి వేయబడినవి. బెజవాడ విజయవాడగా మారిపోయిన విషయం అందరికీ తెలుసు. ఇప్పుడూ బెజవాడ అనే పేరు వాడుకలో కాన వస్తూ ఉన్నది. అలాగే శ్రిగాకుళం శ్రీకాకుళంగా మారిపోయింది. అంతే-కాని, దీని మొదటి పేరు శిఖాఖోల్‌గాని శ్రీకాకుళం కానే కాదు. ఇలాగే స్థల విషయంలోనే కాకుండా ఇతర విషయాల్లో కూడా పేర్లు మార్పు చెందడం సర్వ సాధారణమైన ధర్మంగా ఉంటున్నది. □

నా ఎదుట కానీ, సెట్‌లో కానీ త్రాగరాదు. నా సినిమాకు సంబంధించిన కార్యం వరకు, అందులో పనిచేసే ప్రతి వొక్కరు పవిత్రంగా వుండాలి. ఇది నా రెండో కండిషన్.'

'వొప్పుకొంటున్నానండిబాబూ. ముందు ఆ చేతికి కట్టు కట్టుకోండి.'

'మీరే కట్టండి— ఆ రక్షాకంకణం, రక్షాబంధనం'.

నాయుడు కట్టుకట్టేడు.

యింతలో ఫోన్ మోగింది. నాయుడే అందుకొన్నాడు.

'ఎవరో రామారావుగారుట ...'

పేరు చెప్పగానే గోపీచంద్ మొహంలో కళ వచ్చింది.

'యిది మంచి శకునం ప్రొడూసర్‌గారూ. ఫోను యిలా యివ్వండి! ఫోను తీసుకొని మౌత్‌పీస్ మూసేడు.

'అన్నట్లు యీ రామారావు గారెవరో తెల్సా? నా భార్యకు బంధువు. నన్ను చిత్రసీమకు పరిచయం చేసిన వ్యక్తి. 'వెత్తురుకూడు'కు అసిస్టెంట్ కెమెరా మేన్. ఇప్పుడు ప్రసిద్ధ కెమెరా దర్శకుడు. మన చిత్రానికి యీయనే ఛాయాగ్రాహకుడు. చెప్పనా ?'

'చెప్పండి !'

'రామారావుగారా ... నమస్కారం సార్. నేను గోపీచంద్‌ని. యీమధ్య మన వూళ్లవైపు ఔట్‌డోర్ వెళ్లేరుటగదా ? మా మామయ్యగారిని కల్సేరా ? బాగున్నారా ? సులోచనని కూడా కలిసేరా ? వెరీగుడ్ సర్. . ఆ ఆ... ఆమె నుంచి యివాళే వుత్తరం వచ్చింది. సులోచనను, మావాళ్లను అందరినీ యిక్కడికి షిఫ్ట్ చేద్దామనుకొంటున్నాను. ఎన్నాళ్ళు యీహోటల్ మెతుకులు తింటూ ఈ బ్రహ్మచారి బ్రతుకుఇక బ్రతకలేను సార్? మీరూ త్వరగా పెళ్ళి చేసేసుకోండిసార్. కల్సే సర్దాగా వుందాం.'

మాట్లాడుతూనే వున్నాడు గోపీచంద్. అవతల వింటున్న రామారావు తన చెవుల్ని తనే నమ్మలేకపోతున్నాడు.

'యిల్లొకటి చూడండి సార్. మీకు దగ్గరగా వుంటే మీ అమ్మగారి తోడు, అండదండలూ వుంటాయి కదా ? అలాగే... మీరు యిల్లు చూడగానే నేను వెళ్లి మా వాళ్లను పిల్చుకు వస్తాను. అలాగని యివ్వాళే సులోచనకు వుత్తరం రాస్తున్నాను.'

'కలా ? సినిమా మాయా ?' అర్థం కాలేదు రామారావుకు.

'అన్నట్లు రామారావుగారూ. మరో న్యూస్. మన ప్రొడ్యూసర్ గారొకాయన— నాయుడుగారు... ఆ ఆ... ఆయనే... వో సినిమా తీద్దామనుకొంటున్నారు. నాకు దర్శకత్వం ఛాన్సిచ్చారు... అంగీకరించాను. అప్పుడే ఎవరికీ చెప్పకండి. యిప్పుడే వొప్పందం అయింది. మీదే మొదటి ఫోను. మీకే చెప్పేను. యింకెవరికీ చెప్పను. మీకైనా ఎందుకు చెప్పానంటే ... యూ ఆర్ ది కెమెరా మేన్ ఫర్ ది.పిక్చర్. మీరే. కాదనక అంగీకరించాలి. ఓ ... థేంక్యూ. నాయుడుగారొచ్చి మాట్లాడుతారు. ఊ... యిల్లు సంగతి మర్చిపోరుగా ? సులోచనకు వుత్తరం రాస్తున్నా. యిప్పుడే ...'

ఆ ప్రవాహం అలా సాగుతూనేవుంది !

(ఇంకా వుంది)

మనిషి చచ్చిపోయాడు

పాలడుగు వెంకటేశ్వరరావు



సూర్యుడు మండి పోతూన్నాడు. ఆకాశంలో

వూరికి పెడగా వున్న ఆ ఆఫీసు ముందు ఒక పెద్ద చింత చెట్టు వుంది. ఆ చింతచెట్టు క్రిందొక కాకా హొటల్ వుంది. ఆ హొటల్ ముందు బల్లల మీద కూర్చుని వేడి వేడిగా పకోడీలు తింటూ, టీలు తాగుతున్నారు, ఆఫీసు జవానులు లంచ్ ఇంటర్వల్ అవగానే కాకా హొటల్ ఖాళీ అయింది. రోడ్డు మీద పోతూ ఎండకి జడిసి, ఇన్ని మంచి నీళ్ళు-తాగుదామనొచ్చి కూర్చున్న, ఒకరిద్దరు పాసింజర్లు మిగిలారు. బరువుగా అడుగులు వేసుకుంటూ హొటలు దగ్గరికి వచ్చి, ఉస్సురంటూ కూర్చుని, బరువుగా నిట్టూర్చాడు, నాగయ్య. నాగయ్య మొహం నిండా చమట పట్టి వుంది. కాళ్ళకి ఎర్రగా దుమ్ము పట్టివుంది. కళ్ళనిండా నిరాశ గూడు కట్టుకుని వుంది. చూపుల్లో దిగులు వుంది. కండువాతో మొహాన్నపట్టిన చమటని తుడుచు-కున్నాడు నాగయ్య.

కుండలోంచి గ్లాసునిండా చల్లని మంచి నీళ్ళు తెచ్చి, నాగయ్యకి అందిస్తూ, 'నాగయ్యా! ఇదేనా రావటం?' అని అడిగాడు, హొటల్ ప్రొప్రయిటర్, కం సర్వర్, కం క్లీనర్, కం కుక్, కుప్పసామి.

'ఆఁ కుప్పస్వామీ! బాగా వుండావా?' – అని గ్లాసు అందుకుని నీళ్ళు గటగటా తాగేశాడు నాగయ్య-

'ఇంకాకావాలా?'

తల వూపాడు, కావాలని నాగయ్య.

ఇంకొక గ్లాసుడు నీళ్ళు గొంతులో పోస్కొగాని, నాగయ్య దాహం తీరలేదు.

ఏమన్నా తింటావా? తీసుకురానా?'

వద్దులే. ఇప్పటికే నీ బాకీ ముప్పయి రూపాయలయింది.

'అయితే అయిందిలే నీ బిల్లు వచ్చాక, బాకీలు తీర్చవా ఏంటీ? రోజులు ఎల్లకాలమూ ఒక్కలాగే వుండవుతే నాగయ్యా.'

'కుప్పసామి! ఆఫీసుకి వెళ్ళి పని చూసుకుని వస్తానయ్యా. పనయిన తర్వాత వచ్చి, ఏమన్నా తింటాలే!' అని లేచి ఆఫీసు వయిపుకి సాగిపోయాడు నాగయ్య.

ఆ బిల్లు కోసం అక్కడికి నాగయ్య రావటం అది ఇరవయ్యోసారి. ఎంతో ఆశతో వస్తాడు. నిరాశతో క్రుంగిపోయి తిరిగి వెళ్ళి పోతాడు. ఆశపట్టి లాగుతోంది. నిరాశ క్రుంగదీసి నడుం విరగ్గొడు-తుంది. ఆశ నిరాశల మధ్యన నలిగి పోతూ మధ్యంలో కండెలాగా తిరుగుతాడు నాగయ్య. నాగయ్యది, అక్కడికి పధిహేను మైళ్ళ దూరంలో వున్న పల్లెటూరు. ఆ వూర్నించి ఇక్కడికి రావాలంటే రెండు బస్సులు మారాలి. నానా అవస్థపడి రావాలి. వూరికి ప్రక్కనే వుందిగదా అని, ఆ ఆఫీసు ఆధ్వర్యంలో ఒక చిన్న వంతెన నిర్మాణాన్ని చేపట్టాడు నాగయ్య. పని యొక్క విలువ రెండున్నర వేల రూపాయలు. వడ్డీకి అప్పుతెచ్చి నాలుగు రూపాయలు మిగుల్తయ్యన్న ఆశతో, కష్టపడి పని పూర్తి చేశాడు. పని పూర్తయి పదిహేను

నెలలయింది. లేబరు మోసం చేశారు రెండువేలు వదిలే_గాని పనవలేదు ఆ అప్పు మీద వడ్డీ పాపంలాగా పెరిగి పోతూ వుంది. అందు వలన, బిల్లు తీసుకుని అప్పు తీర్చేసి, చేతులు కడుక్కుందామని, కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నాడు నాగయ్య. మిగలకపోతే, పోయింది చేతులు కాలకుండా బయట పడితే, అదే పదివేలు! ఇంటి దగ్గర పెద్ద సంసారం, చాలీ చాలని ఆదాయం వుక్కిరి బిక్కిరి చేసే ఖర్చులు. ఆ పయిన, క్రింది మధ్య తరగతి' మనస్తత్వాల ఆరాట పోరాటాలు పిల్లలకి నచ్చచెప్పటం చాలా కష్టంగా అన్పిస్తుంది. ఇంటి ఇల్లాలిది పెద్దచెయ్యి. ఆర్జనకీ ఖర్చులకీ ఎక్కడా పొంతన కుదరటం గగనంగా అవుతుంది. అయోమయంగా వుంది.

తన కష్ట సుఖాలన్నీకుప్పుసామికి ఏకరువు పెట్టి, నిట్టూరుస్తాడు నాగయ్య. పొట్ట చేత పట్టుకుని రాష్ట్రం ఎల్లల్ని దాటి వచ్చిన కుప్పుసామి ఆలోచనల తీరే వేరు. నాగయ్యకి లౌకికం తెలీదని విచారిస్తాడు కుప్పుసామి.

'బరువు.' బరువు కావాలి. ఈ రోజుల్లో బరువు పెట్టందే కాగితాలు కదలవు. టీ తాగటానికి వచ్చి, కబుర్లు చెప్పుకుంటున్న జనం మాటల్ని బట్టి కుప్పుసామి సర్వం గ్రహించాడు. వ్యవహారాల తీరు తెన్నుల్ని ఆకళింపు చేసుకున్నాడు.

'నాగయ్యా! ఇంత అమాయకుడివి! పరిస్థితుల్ని ఇప్పటికయినా గ్రహించవు. నువ్వు ఎట్లా బ్రతుకుతున్నావయ్యా ఈ లోకంలో!'- జాలిగా అంటాడు కుప్పుసామి.

'నాకర్థంగావటం లేదు కుప్పుసామి!'

'నాగయ్యా. అసలు కంటే వడ్డీ ముద్దు. జీతం కంటే లంచమే ప్రియాతి ప్రియమయింది న్యాయంగా మిగిలిన లాభం కంటే, నీళ్ల కాఫీలిచ్చి, సంపాదించిందే అపూర్వమయినది! వైటుమనీకంటే బ్లాకు మనీ ఎంతో ముచ్చటగా అన్పిస్తుంది. ఈ రోజు - ఇదయ్యా మన పద్ధతుల తీరూ.!'

'అంటే?!'

'మన వ్యవస్థ బాగా కుళ్లిపోయింది. కుష్టు రోగంతో చెడిపోయి వుంది.'

-బాగు చేసుకొనటాన్కి ప్రయత్నించాలి, మనం. జనం మారాలి. మనం మారాలి. దేశం మారాలి.

'భేష్ బాగానే వుంది నాగయ్యా. కానీ, ఎవరయ్యా ఈ జనాల్ని మార్చగలిగేదీ?'

'మనమే!'

'చాలా బాగుంది. అంతటి బాధ్యతలు మోయటానికి మనమెంతటి వారం? మన ఓపిక ఏపాటిదీ?'

'అలా అనుకోకూడదు. ఈ బాధ్యత మనలో ప్రతీ ఒక్కరిదీనూ. కాదనగలమా?'

'నాగయ్యా. మన సంభాషణ దారి తప్పుతూ వుంది. పాయింట్‌కొస్తాను. నీ బిల్లు పాసయి నీకు డబ్బు అందాలంటే, నువ్వు ఇన్నిసార్లు తిరగనవసరం లేదు. ఒక రెండు వందలు, శంభులింగం మొహాన్న కొట్టి ఇంటి దగ్గర కూర్చో. అంతే.

'నేను గాంధీగారి శిష్యుడ్ని. ఆ పని ఛస్తే చెయ్యను, కుప్పుసామి'

'అయితే నీ బిల్లు రాదు. కావాలంటే రాసిస్తాను-స్టాంపు పేపరు కొని తెచ్చుకో.'

'చాలా అన్యాయంగా మాట్లాడుతున్నావు కుప్పుసామి. న్యాయం అంటూ వుండాలి. పాప పుణ్యాలు వున్నాయి.'

'నీకు అన్యాయం జరగడం చూడలేకే, నేను నోరు తెరచి చెప్పాల్సి వచ్చింది నాగయ్యా. ఇలాగ పిచ్చిగా తిరుగుతూ, బిల్లు చేతికి రాక, ఆ వడ్డీ అలాగ పెరిగిపోయి, చివరికి ఏమవుతుందో నీకు తెలుసా, నాగయ్యా! ఆలోచిస్తున్నావా లేదా?'

నాగయ్య గమ్మునుండి పోయి శూన్యంలోకి చూస్తాడు. దిగులుగానిట్టూరుస్తాడు

నాగయ్యని గురించిన ఆలోచనల్తో నిలబడిపోయిన, కుప్పుసామి కస్టమర్ రాకతో ఈ లోకంలోకి వచ్చాడు.

'ఏయ్! కుప్పుసామీ! కాఫీ ' శంభులింగం పక్కికిలిస్తూ, బల్లమీద కూర్చుని కాలరు సర్దుకున్నాడు. గండు మొహం. బండ పెదాలు. లావుపాటి జాంకాయ ముక్కు. చికిలి కళ్ళు. ఎత్తు పళ్ళు. ఏనుగు యొక్క చెవులు. వేషం వేసి నిలబెడితే మారీచుడులాగా వుంటాడు శంభులింగం.

శంభులింగానికి కాఫీ కలిపి ఇచ్చి-'శంభులింగంగారూ! నాగయ్య వచ్చాడు; కనపడలేదా?' అని అడిగాడు కుప్పుసామి. శంభులింగం వికటంగా నవ్వి'- వచ్చాడయ్యా. సుత్తి కేసు. అబ్బ ఆ బోరు పడలేకే నేను ఇలా పరుగెత్తుకుని వచ్చాను' అన్నాడు.

బురద

ఎదుటి వాడిపై
బురద
చల్లాలనే
దురాలోచనలో –
తన చేతికే
ముందా బురద
అంటుతుందన్న
అసలు నిజాన్ని–
మరచి పోతుంది
మనిషిలోని
మూర్ఖత్వం!

– కొల్లూ రంగారావు

'పాపం! అమాయకుడు. ఇంక చాలు గాని అతని పని చేసి పంపించండి'

'కుప్పుసామి! నాగయ్య సంగతి నీకేం తెలుసయ్యా? ఎంతసేపూ గానుగెద్దులాగా తిరగటమే గాని, దారికి రాడు గదా' అప్పటికీ సిగ్గు విడిచి చెప్పాను కూడా వినిపించుకుంటేనా? పెడసరం మనిషి

'అతని తత్వం అది. పాలిచ్చే నాలుగు గేదెల్లో, ఒకటి వట్టిపోయిందనుకుని అతన్ని వదిలించుకోకూడదా? అది న్యాయం గదా'

'అది నా తత్త్వమే కాదు కుప్పుసామీ! పద్ధతి పద్ధతే మరి! నేను చాలా స్ట్రిక్టు మనిషిని'

'ఇది చాలా అన్యాయం లింగం బాబూ! ఆ అమాయకుడు అన్యాయమయిపోతాడు. ఆ పాపం మూట గట్టుకుంటావా?'

'కుప్పుసామి! ఇంక చాలు ఇప్పటికే అధిక ప్రసంగం అయింది' అని దులపరించుకుని వెళ్లిపోయాడు శంభులింగం '

ఆ సాయంత్రం, ఆఫీసు నిర్మానుష్యం అయిపోయాక, నీరసంగా వచ్చి హొటలు బల్ల మీద కూర్చున్నాడు నాగయ్య

'నాగయ్యా! పని ఎంత వరకు అయింది?' అని కుప్పుసామి అడిగాడు.

నాగయ్య సమాధానం చెప్పలేదు.

'అన్నా! ఈ రాత్రికి నన్ను ఇక్కడ పడుకోనిస్తావా?'- చాలాసేపటికి నోరు పెగల్చుకుని, దీనంగా అడిగాడు నాగయ్య

'అదేమంత భాగ్యం! అలాగే వుండు నాగయ్యా '

బలవంతం చేసి,, తను వండుకున్నదాంట్లో, ఇంత పెట్టి నాగయ్యకి కూడా బల్లమీద ప్రక్క వేశాడు కుప్పుసామి.

ఆఫీసరుగారు కేంపు నుంచి రేపు వస్తారట ఆయన్ని కలిసిగాని తిరిగి వూరికి పోడు నాగయ్య అప్పు ఇచ్చిన షావుకారు గొంత మీద కూర్చున్నాడట. ఎలాగయినా సరే బిల్లు తీసుకుని, ఆ బాకీ తీర్చెయ్యకపోతే వూళ్లో, పరువు నిలిచేటట్టు లేదు. అసలే సంసారం ఆర్థికంగా చితికిపోయి వుంది కొడుకులు, చెప్పిన మాట వినకుండా ఎదురు తిరుగుతున్నారు వాళ్లకి సరయిన చదువులు చెప్పించలేకపోయాడు. కట్నం తేలేదని మొగుడు కొట్టి తరిమేయగా, పెద్ద కూతురు పుట్టిల్లు చేరింది. ఆ తర్వాత పిల్ల, పెళ్లికి ఎదిగి వచ్చి కూర్చుని రెండేళ్లయింది తుఫానులకి రెండేళ్లనుంచీ వ్యవసాయం నడుం విరిచింది వ్యాపారంలోకి దిగాడు దాని చందం ఇలాగయింది సంసారం బేలన్సు తప్పింది. బండి, చక్రాలు వూడిపోయి కూలిపోయే దశలో వుంది మొదటి నించీ నీతి నిజాయితీతో బ్రతికాడు. దేశానికి స్వాతంత్ర్యం తేవటానికి లాఠీ దెబ్బలు తిని జైలుకి వెళ్లాడు బ్రతుకు బాటకి యాపు రేఖలు దిద్దుకోవలసిన సమయంలో, స్వార్థాన్ని అవతలకి త్రోసి, అమూల్యమయిన సమయాన్ని, దేశం కోసం అర్పించాడు ఉద్యమ ప్రవాహంలో పడి కొట్టుకునిపోయి, చివరికి వద్దునబడేసరికి, సమస్యలు చుట్టు ముట్టాయి

విజేతలైన 'శ్రీశ్రీ వారసులు'

మహాకవి శ్రీశ్రీ స్మృతి చిహ్నంగా 'సాంస్కృతీ సమాఖ్య' (యువ సాహితీ వికాస వేదిక) ఆంధ్రప్రదేశ్‌వారు నిర్వహించిన 1984 వ సంవత్సరం కవితల పోటీలో రాష్ట్ర వ్యాప్తంగా యువ కవులు పాల్గొన్నారు. భావ, భావం, శైలి, శిల్పం, ప్రయోజనం అన్న అంశాల కనుగుణంగా రచనలను విశ్లేషణ చేసిన న్యాయ నిర్ణేతలుగా సర్వశ్రీ ఆరుద్ర, ఆవంత్స సోమసుందర్, అద్దేపల్లి రామమోహనరావుగార్లు వ్యవహరించారు.

ప్రథమ బహుమతి . శ్రీ కళ్యాణ రామచంద్ర – హైదరాబాదు (వీలునామా), శ్రీ ముదివేడు ప్రభాకరరావు – తిరుపతి (సామాన్యుడు రక్షకుడైతే), శ్రీ కొల్లూరి వెంకటేశ్వర్లు – తెనాలి (శవ సంభగులు)

ద్వితీయ బహుమతి : శ్రీ తియ్యగూర సీతారామిరెడ్డి – మోదుకూరు (నాలో నేనే), శ్రీమతి చిల్లర భవానీ దేవి – హైదరాబాదు (సృష్టిలో మనిషి), కుమారి ఒదనాపురం భారతి – హైదరాబాదు (వంచనాశిల్పం)

తృతీయ బహుమతి : శ్రీ కొణకంచి రామకృష్ణ – ఖమ్మం (వీరలక్షణం), కుమారి అన్నే విజయశ్రీ – ముదునూరు (వేదనా విజృంభణ)

సమాఖ్య దశాబ్ది కాలంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన వారి సంఖ్య వీరిలో 128 అయినట్లు, ఈ పోటీలో పాల్గొన్న కవులందరికీ సమాఖ్య ధృవీకరణ పత్రాలు పంపించినట్లు సమాఖ్య రాష్ట్ర

అవీ ఇవీ అన్నీ

కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీ వి. శిరీష్‌కుమార్ తెలియ చేస్తున్నారు.

"మధుర" ఆవిష్కరణోత్సవం

సాహితీ సమితి, వరంగల్లు వారి ఆధ్వర్యంలో ఇటీవల వర్ధమాన కవి, సమీక్షకుడు అయిన శ్రీ టి. శ్రీరంగస్వామిగారి 'మధుర' కవితా సంపుటి ఆవిష్కరణోత్సవం జరిగినది. సుప్రసిద్ధ విమర్శకుడు, సాహితీవేత్త డా కోవెల సంపత్కుమారాచార్య సంపుటిని ఆవిష్కరించారు. అష్టావధాని శ్రీ ఐ. కిషన్‌రావు సభకి అధ్యక్షత వహించారు. శ్రీ కె. ఎస్. ఆర్. జి. ప్రసాద్ రచయితకు శాలువతో సత్కారం చేశారు.

మధుర కవితా సంపుటిని పరిచయం చేస్తూ శ్రీ వరిగొండ కాంతారావు, శ్రీశ్రీ దాస్యం లక్ష్మయ్య, శ్రీ యం. రత్నాకరరావు, కుమారి భండారు విజయగార్లు ప్రసంగించారు. శ్రీ టి. శ్రీ రంగస్వామి తమ గురువు శ్రీ వరవరస్వామిని సత్కరించారు.

ఈ సభకు ముఖ్య అతిథిగా వచ్చిన శ్రీ వి. వెంకటప్పయ్య కవి యొక్క సాహితీ సేవను కొనియాడారు.

శ్రీ మనోహరాచారి, శ్రీ తాళ్ళపల్లి రామస్వామిగార్లు కవిని పూలమాలాలంకృతులను చేశారు. ప్రముఖ కవి శ్రీ కాళోజీగార్ల సందేశాన్ని శ్రీ శ్రీనివాసరావు చదివి వినిపించారు. రచయిత ఉచిత రీతిని తన కృతజ్ఞతలు తెల్పుకున్నారు. సమావేశానికి తొలుత సంస్థ అధ్యక్షులు శ్రీ నమిలికొండ బాలకిషన్ స్వాగతం పలుకగా, సంయుక్త కార్యదర్శి శ్రీ నిధి కృతజ్ఞతలు చెప్పారు

నెల్లూరులో అక్కినేని జన్మదినోత్సవం

నెల్లూరు అక్కినేని ఆర్ట్స్ అసోసియేషన్‌వారు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు జన్మదినోత్సవాన్ని, నెల్లూరు టౌన్ హాలులో అతివైభవంగా జరుప నిశ్చయించినారు. ఈ సందర్భంగా సెప్టెంబరు 19, 20 తేదీలలో అఖిల భారత స్థాయిలో ఏక పాత్రాభినయం, జానపద నృత్యములు, రికార్డు డ్యాన్సులలోను మరియు శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం, సినిమా పాటలలోను పోటీలు నిర్వహిస్తారు. పై పోటీలకు న్యాయ నిర్ణేతలుగా, సినీ నృత్య దర్శకులు, సినీ సంగీత దర్శకులు వ్యవహరింతురు వివరములకు- సెక్రెటరీ, అక్కినేని ఆర్ట్స్ అసోసియేషన్, నియర్ అనితాహాల్, నెల్లూరు-534 003కి రాయాలి ☐

సంసారం గుదిబండలాగా అయింది ఉక్కిరిబిక్కిరిగా వుంది.

తన సోదంతా, ఆ రాత్రి పూట, బల్ల మీద పడుకుని, కుప్పుసామిని చెప్పుకున్నాడు, నాగయ్య. ఆ వుండటం తనకి చేతనయిన విధంగా, నాగయ్యకి ధయిర్యం చెప్పి, అతన్ని ఓదార్చి, నిట్టూర్చాడు కుప్పుసామి ఆ వుండటం నాలుగు రోజులు వుండాల్సి వచ్చింది. నాలుగోనాడు, ధాం ధాం అంటూ ఆఫీసుకి వచ్చాడు ఆఫీసరు.

అది తెలిసి కొండంత బలం రాగా, ఆఫీసరుని కలవటానికి వెళ్ళి వస్తానని చెప్పి వెళ్ళిన, నాగయ్య కోసం నిరీక్షించాడు కుప్పుసామి. ఆ పగలల్లా ఆఫీసులోనే వుండిపోయాడు నాగయ్య. కుప్పుసామికి కనపడనేలేదు. ఏమయిందోనని ఆత్రంగా ఎదురు చూసిన కుప్పుసామికి ఏ కబురూ తెలియలేదు.

చీకటి పడింది.

'ఏమయ్యాడబ్బా మనిషీ?' అని, చాలాసార్లు అనుకున్నాడు కుప్పుసామి.

భోజనం చేసి, బల్ల మీద పక్క పరచుకుంటూ, నాగయ్య గురించే విచారంగా ఆలోచనలు చేసాడు. బలవంతాన పడుకుని కంటి మీదకి నిద్ర తెచ్చుకోవటానికి చాలాసేపు ప్రయత్నించాడు.

'కుప్పుసామీ! కుప్పుసామీ!' నాగయ్య పిలుపుకి పులిక్కి పడి లేచి కూర్చున్నాడు. కుప్పుసామి.

'నాగయ్యా! ఏమయిపోయావ్?! దా. కూర్చో.' ఆదరంగా అన్నాడు కుప్పుసామి.

'కాదులే. నేను వెళ్ళిపోతున్నా.'

'ఏమయింది, నీ పని?'

మనిషి చచ్చిపోయాడు

'ఇదుగో. నీ బాకీ క్రింద ఈ గడియారం వుంచుకో. చాలా పాతది అనుకో. అయినా ముప్పయి రూపాయలు చేస్తుందిలే. సరిపెట్టుకో కుప్పుసామీ'

'నీ పని ఏమయిందంటే, బాకీ సంగతి మాట్లాడతావేమయ్యా?!'

పదే పదే కుప్పుసామి రెక్కించిన మీదట, జరిగిన సంగతి చెప్పాడు నాగయ్య.

ఆసలు, ఆఫీసరూ శంభులింగమూ ఒకటి! శంభులింగం చెవిలో ఏదో చెప్పగా విని, ఆఫీసరు ధాం ధాం అని ఎగిరి పడ్డాడు! బిల్లూ లేదు, గిల్లూ లేదు. నీ దిక్కున్నచోట చెప్పుకో- అని కసిరి కొట్టాడు. జవానుని పిలిచి బయటకి నెట్టించాడు న గయ్యని!

'థూత్! వీళ్ళ బ్రతుకులు తగలబడ!' అని కసి దీరా బూతులు తిట్టాడు కుప్పుస్వామి.

'అన్నా! నేను వెళ్ళివస్తాను. ఈ తమ్ముడ్ని మర్చిపోకు' అన్నాడు నాగయ్య గాద్గికంగా పోదువుగానిలే'- అని కుప్పుసామి అంటూ వుండగానే- వెళ్ళిపోయాడు నాగయ్య!

నిట్టూర్చి, బూతులు తిట్టుకున్నాడు కుప్పుసామి సరిగా నిద్ర పట్టలేదు. తెల్లవారు జామున కలత నిద్రలో ఆ ఆఫీసు తగలబడిపోతున్నట్టూ, ఆ మంటల్లో శంభులింగమూ, ఆఫీసరూ కాలిపోతూ ఆర్తనాదాలు చేస్తూ దీనంగా విలపిస్తూ వున్నట్టూ, కలలు గన్నాడు, కుప్పుసామి.

భళ్ళున తెల్లవారింది. పొద్దు నడినెత్తికెక్కింది

ఆఫీసు వెనుక వున్న నూతి దగ్గరికి- మనిషి చచ్చిపోయాడు మనిషి చచ్చిపోయాడు- అనుకుంటూ జనం పరుగులు దీసి వెళ్తుండగా, తనూ వెళ్ళాడు కుప్పుసామి.

అప్పటికే శవాన్ని నూతిలోంచి బయటికి తీసి, పడుకోబెట్టారు. చుట్టూ ఆఫీసు జనాలు గుమికూడి గుసగుసగా కబుర్లు చెప్పుకుంటున్నారు వాళ్ళ మధ్యలో శంభులింగాన్నీ, ఆ ఆఫీసర్నీ గుర్తుపట్టాడు కుప్పుసామి. అడ్డుగా నిల్చున్న జనాల్ని తొలగించుకుని, మెడని రిక్కించి చూసాడు కుప్పుసామి

బాగా వుబ్బి భయంకరంగా అయిన నాగయ్య శవాన్ని చూసి, ఉలిక్కి పడ్డాడు కుప్పుసామి. కడుపులో దేవినట్లయింది. నరాల్ని భయంకరంగా మెలి దిప్పినట్లనిపించింది మనస్సుని కత్తుల్తో ముక్కలు ముక్కలుగా కోసినట్లు బాధ పెనవేసింది. గిజ గిజ కొట్టుకున్నాడు.

'మీ బ్రతుకులు బండలుగాను మీ నోళ్ళల్లో మట్టిగొట్ట మీ యమ్మా కడుపులుగాల! ఎందుకురా మీ బ్రతుకులూ? సాటి మనిషిని చంపిన ఈ పాపం ఊరికే పోదురా ఒరేయ్ మీరు దిక్కు లేని చావు ఛస్తారా. వెధవ నాయాళ్ళలారా! థూ.!' అని శివమెత్తినట్లు గంతులు వేసి, బంద బూతులు తిట్టాడు కుప్పుసామి. అక్కడ చేరిన ఏ ఒక్కడి నోరూ, తెరుచుకుని అతన్ని సమాధాన పరచటానికి ప్రయత్నం చేసే సాహసం చేయలేదు.

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

నేతాజీ సహచరుడు :

ఎప్పుడో, ఎక్కడో కొన్నాళ్ళు ప్రజాసేవలో కలిసి పనిచేసిన వ్యక్తి దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత హటాత్తుగా ప్రత్యక్షమయితే కలిగే ఆనందపు పులకరింపు ఎలాటిదో కొందరికే అనుభవైకవేద్యం. అలాటి మహదానందం ఆగస్టు 22 న కలిగింది విచిత్ర పరిస్థితులలో. శ్రీ రామకుమార్ కమల్ నేతాజీ సుభాష్‌చంద్రబోస అనుయాయి. నేతాజీ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికయిన పిదప, ప్రజల విశ్వాసాన్ని



సంఘ సేవకుడు శ్రీ డా. శివశంకర్‌తో కరచాలనం చేస్తున్న శ్రీ డా. రామకుమార్ కమల్ మధ్యన వున్నవారు బొంతపల్లి యోగాశ్రమం అధ్యక్షులు స్వామి సచ్చిదానంద సరస్వతి.

చూరగొనడానికి భారత పర్యటన జరుపుతూ మద్రాసుకు వచ్చినప్పుడు రామకుమార్ కమల్ కూడ వెంట ఉన్నారు. స్వచ్ఛంద సేవకుడుగా తర్వాత పాండిచ్చేరిలోను ఉన్నారు. ఈ లోగా ద్వితీయ ప్రపంచ సంగ్రామం ప్రారంభమయింది నేతాజీకి తక్కిన వారితో అభిప్రాయభేదాలు వచ్చాయి ఆయన అజ్ఞాతవాసం చేయడం, ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించడం చారిత్రక సంఘటనలు. రామకుమార్ కమల్ ఆయన వెంటే ఉన్నారు. ఆజాద్ హింద్ ఫౌజులో కొన్ని పదవులు నిర్వహించారు. యుద్ధానంతరం భూలాభాయి దేశాయి పుణ్యాన కారాగారంనుంచి విముక్తులైన ఆజాద్ హింద్ వీరులలో రామకుమార్ ఒకరు, దేశం స్వతంత్రమైంది. తక్కిన ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికులలాగే ఆయనా ఏదో జీవికలో గడిపాడు పదేళ్ళపాటు. హోమియోపతి నేర్చారు, మరొకటి మరొకటి నేర్చారు. 1958 నుంచి ఏడున్నర సంవత్సరాలపాటు కాలి నడకన భారతదేశం, చైనా, రష్యా, ఆఫ్ఘనిస్తాన్ మున్నగు దేశాలు తిరిగారు – 30 వేల కిలో మీటర్లు కైలాస పర్వతం మీద తక్కినవారు చలికి తట్టుకోలేక చర్మ వస్త్రాలు ధరిస్తే, సాధారణమైన కాశ్మీర్ శాలువా కప్పుకొని కాలక్షేపం చేశారు వెళ్ళిన చోటెల్లా భారతీయ సంస్కృతిని, యోగ విద్యను ప్రదర్శించి వేల మందిని నెచ్చెలులుగా చేసుకొన్నారు. అక్కడి భాషలు నేర్చారు చైనాలోని వివిధ మాండలికాలు, సోవియట్ యూనియన్‌లోని వివిధ భాషలు ధారాళంగా మాట్లాడగలరు పర్యటన సమాప్తమయిన పిదప పెక్కేళ్ళు యోగాభ్యాసం చేస్తూ, హోమియో ఆయుర్వేద వైద్యం చేస్తూ గడిపారు దేశంలో అన్ని రంగాలలోను కరాళ నృత్యం చేస్తున్న అవినీతిని చూస్తూ ఊరికే ఉండలేకపోయారు ఏమైనా చేయాలి. నేతాజీ ఆశించిన వాటిని ప్రచారం చేయాలి. యువకులను నీతివైపు మళ్ళించాలి – అనే సంకల్పంతో ఆచార్య వినోబాభావే నిర్యాణంనాడు "భారత్ దళ్" అనే సంస్థ స్థాపించారు. ఇది ఆధ్యాత్మిక రాజకీయ సంస్థ. ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ, హర్యానా, జమ్ము – కాశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, బిహార్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లలో భారత్ దళ్ శాఖలు స్థాపించారు. అఖండ భారతం, అఖండజాతి, ఒకేదేశం, ఒకే హృదయం, ఒకే గురు, ఒకే రాజ్యాంగం, ఒకే భగవంతుడు ఈ సంస్థ లక్ష్యం. సంపత్తి, శక్తి (అధికారం) వికేంద్రీకరణం ఆశయం.

ఏక రాష్ట్ర, ఏక హృదయ
ఏక నిశాన్,
ఏక సం విధాన ఏక పరి
పూర్ణ భగవాన్.

బాధామయమైన దేశమంతటా పరచుకొని వున్న దోపిడిని, అన్యాయాన్ని సమూలంగా తొలగించాలి. సమప్రేమ మార్గంలో నడచి, అందరినీ కౌగలించుకోవాలి. భారతదేశ వాసులంతా ఒక్కటే ఇది ఏకతా నినాదం భారత జనని తన సంతతిని ఇప్పుడు ఒక్కటికమ్మని పిలుస్తూంది – అని ఈ సంస్థ పిలుపు.

దుఖీ దేశ భూపర్ ఛాయా
శోషణ అన్యాయమిటానాహై,
ప్రేమ పంథ సమతా కేచల్ కర్
సభీకో గలేల గానాహై

నేతాజీ ఇంకా బతికి వున్నారనే నమ్మకంపైన ఈ సంస్థ స్థాపితమైంది. 1948 నేషనాలిటీ చట్టం ప్రకారం భారతదేశం ఏదో విధంగా బ్రిటిష్ పాలనలో వున్నట్టే, భారత రాజ్యాంగంలోని 366, 371, 372, 373, 393, 395, సూత్రాలు ఇంకా సంశయాస్పదాలు పార్లమెంటు వాటినింకా సవరించలేదు – అంటారు రామకుమార్ కమల్ పొడవుకు తగ్గలావున్న కండలు తిరిగిన వ్యక్తి. గొప్ప వక్త. ఎనిమిది దశాబ్దాలు దాటినా ఖంగున మోగే కంఠం ఉర్దూ, హిందీ ఆంగ్లాది భాషలలో చక్కని కవిత చెబుతారు. శ్రావ్యంగా పాడుతారు. మంచి సంభాషణ చతురులు తమ అనుభవాలను చెబుతూ వివిధ భాషల కవితలు గుప్పిస్తూ గంటల తరబడి గోష్ఠులు నడుపగలరు. బిజనౌర్ జిల్లా మిరాపూరలో జన్మించారు. నూతన భారత వర్షం అనే భారత చరిత్రను రచించారు. ప్రస్తుతం జనం 57 శాతం దారిద్ర్య రేఖకు కింద వుండగా, 20 శాతం పరభాగ్యోపజీవులు పెరుగగా సుభిక్షం ఏముంది? – ఇక్కడి ప్రముఖ నాయకుల అపార సంపద విదేశ ధనాగారాలలో భద్రంగా వుండగా మనదేశం వసుంధర ఎలా అవుతుంది? రోజుకు కొన్ని లక్షల ఆవులు ఆహుతి అయిపోతుండగా పశు సంపద ఎలా వర్ధిల్లుతుంది? – అంటారు. వందేమాతరం జాతీయ గీతం కాకపోయింది. ప్రిన్స్ ఆఫ్‌వేల్స్ వచ్చినప్పుడు స్వామి భక్తితో రవీంద్రుడు చెప్పిన స్వాగతం కావడంకన్నా దౌర్భాగ్యం ఏముంది? – అంటారు. దేశంలో పెచ్చు పెరిగిన అవినీతిని రూపుమాపి దోపిడిని, దుష్ట శక్తిని అణచివేయడానికే భగవత్ప్రేరణతో ఈ ఆధ్యాత్మిక, రాజకీయ పార్టీ భారత్ దళ్‌ను స్థాపించానన్నారు ఆంధ్రప్రదేశ్‌లో దీని అధ్యక్షులు బొంతపల్లి యోగాశ్రమం స్వామి సచ్చిదానంద సరస్వతి. ఉపాధ్యక్షులు శ్రీ చమన్‌లాల్ అగర్వాల్ (ఖాన్ అబ్దుల్ గప్ఫార్‌ఖాన్ మాజీ పి. ఎ.) డాక్టర్ రామకుమార్ కమల్‌వెంట మీరట్ కమిషనర్ భారత్ దళ్ తాత్కాలికాధ్యక్షులు శ్రీ దినేశ్ కుమార్ భట్‌నగర్, కురుక్షేత్ర భారత్ దళ్ అధ్యక్షుడు శ్రీ పరమవీర చౌహాన్ వున్నారు అగర్వాల్ ఎం. ఎ. ఎకనిమిక్స్ ఉత్తీర్ణులు. వైద్య శాస్త్రంలోను ప్రవేశం వుంది. మందుల దుకాణం వుంది చౌహాన్ వ్యవసాయదారు పాపాలు చేయడం మానవ సహజం. కాని భగవంతుని పాదాలు నమ్మి పశ్చాత్తాపపడాలి అలా కాకపోతే, నరకంలో పడుతావు – అంటూ రామకుమార్ చక్కని శ్లేషతో ఒక దోహా చెప్పారు

పాపకరేతో పాపకర్
పా పకరే గతిహోమ్,
జోతూ పా పకరే న హీం
నరక్ మితే తో యే.

ఇంతటి రాజకీయ కల్లోలంలో భారత్‌దళ్ లక్ష్యం ఎలా నెరవేరుతుందో చెప్పలేముగాని, దాని లక్ష్య శుద్ధిని మాత్రం శంకించలేము

ఉపశ్రుతి :

ప్రాథమికోపాధ్యాయులదీ, పత్రికారచయితలదీ ఒక్కటే మనస్తత్వం అన్నారు సహ పత్రికా రచయిత శ్రీ ఎ వి ప్రసాద్. ఎలా? అని అడిగాను. ప్రతి పెద్ద నాయకుడు తనవద్ద ఓనమాలు నేర్చుకున్నాడంటాడు ప్రాథమోపాధ్యాయుడు ప్రతి పెద్ద నాయకుడూ న్యూస్ వేయమని తనను బతిమాలాడంటాడు పత్రికారచయిత – అన్నారు శ్రీ ప్రసాద్

ఉత్తరాలు

(4 వ పేజీ తరువాయి)

హరించి నిరంకుశంగా పాలన సాగిస్తున్న విదేశ దురాక్రమణ దారులను శివాజీ ఎదిరించి, ఆటంకాలనెన్నిటిలో ఎదుర్కొని స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించగల్గాడు. స్వాతంత్ర వీరుడైన శివాజీ జాతీయ వాదులకు, దేశ భక్తులకు ఆదర్శప్రాయుడైనాడు కనుకనే ఆయన జయంతిని దేశ ప్రజలు జరుపుకుంటున్నారు. ఆయన విషయంలో సంకుచిత మత దురభిమాన ప్రసక్తి తీసుకొని రావడం అసంగతం. హిందులతోబాటు ముస్లిములను కూడా కొన్ని ముఖ్యమైన పదవులలో శివాజీ నియమించుకొన్నట్లు ఏ పాటి చారిత్రక పరిజ్ఞానమున్నవారికైనా తెలియకపోదు. మహమ్మదీయ మత గ్రంథమైన ఖురాన్ పట్ల మహమ్మదీయ మహిళల పట్ల ఆయన చూపిన పవిత్ర దృక్పధాన్ని ఆ మతస్థులే మెచ్చుకోక తప్పలేదు.

దేశ స్వాతంత్రాన్ని అపహరించి దేశ ప్రజలను బానిసత్వ శృంఖలాలలో బంధించిన విదేశీ దురాక్రమణదారుల వారసత్వానికి చెందినవాడై అదే పద్ధతిలో దేశీయులను బాధించిన ఔరంగజేబును అతని కర్కశపాలననుండి ప్రజలను విముక్తం చేయడానికై యత్నించి కృతకృత్యుడైన శివాజీతో పోల్చడం నక్కతో నాగలోకాన్ని పోల్చినట్లవుతుంది. చరిత్ర చాటి చెప్తున్న వాస్తవాలను నిర్లక్ష్యం చేయడంవల్ల సెక్యులరిజం వృద్ధిపొందదని శ్రీ జవహర్ గ్రహించడం మంచిది.

యమ్. ప్రభాకరరావు, విజయవాడ.

* * *

17–8–84 నాటి ఉత్తరాల శీర్షికలో 'జవహర్ హైదరాబాద్‌గారి ఉత్తరము చదివి ఈ లెటర్ వ్రాయకుండ వుండలేక పోతున్నాను. రా. స్వ. సం. శివసేనను, ఛత్రపతి శివాజీను మతోన్మాది, మతోన్మాది సంస్థలు అన్నారు రా. స్వ. సం. లాటి స్వచ్ఛంద సంస్థ గురించి మాట్లాడడానికి అతనికేం అర్హత వుంది. పైగా 'దుబాషి' గారిని కూడా వచ్చి మతోన్మాధి అన్నారు. ఔరంగజేబు దేశ భక్తుడా! భారత దేశాన్ని ఎన్ని విధాల కొల్లగొట్టాడు. అతనికి, శివాజికి ఏమి పోలిక? శివాజి మహా దేశభక్తుడు.

ఆ మాటలు కొస్తే హైదరాబాదులో అల్లర్లు ఎవరు సృష్టించారు? ప్రార్ధనలు జరిపిన తరువాత అమానుష కృత్యాలు చేయమని ఏ మత గ్రంథాల్లో వున్నాయో 'జవహర్' గారిని అడగండి.

విజయ కుమారి, చిత్తూరు.

మతోన్మాదం అంటే?

వార పత్రికలో (17-8-84) హైదరాబాదు నుండి శ్రీ జవహరు అనువారు జై దుబాషీగారి వ్యాఖ్యలు గూర్చి విమర్శిస్తూ, శ్రీ శివాజిని గూర్చి కొన్ని వాక్యములు ప్రకటించారు మనసుకు వ్యధకల్గి ఈ విషయాన్ని వ్రాస్తున్నాను.

భీవాండి కలహాలముల వెనుక ఎవరి హస్తమున్నదో బయల్పడింది. హాజీ మస్తాన్‌లు, యూసఫ్ పటేల్, కరీమ్ అల్లా వారి అనువాయులు జరిపిన మారణకాండ. దాదాగిరి. కాని దానికి మతకలహాల రంగు పులమడం అవివేకం. అవి వారి అనుయాయులు సృష్టించిన మతకలహాలు, కాని అనవసరంగ ఆర్ యస్. యస్. పేరు ఇరికించడం ఒక అలవాటు. శివసేన వారు ఛత్రపతి శివాజి జన్మదినోత్సవం జరపడం, అందులో వేలాది ప్రజలు పాల్గొనడం జరిగుండొచ్చు. కాని వాస్తవాలు తెలిసికొనుకుండ అభాండాలు వేయడం అంత మంచిదికాదు. పత్రికలలో వ్రాతలు, చెప్పుడు మాటలు కాదు. వాస్తవాన్ని పరిశీలించి దోషులను నిర్ణయించవచ్చు.

శివాజీ తన 16 వ ఏట స్వరాజ్య పాలనకు కొద్దిమంది మిత్రులతో కలిసి పూనుకున్నాడు. అటువంటప్పుడు అతని దగ్గర అంగబలమెంత? బీజాపూరు ఆదిల్‌షాహి బలమెంత? కొద్దిపాటి సహవాసులతో వేలకు వేల సంఖ్యగల శత్రువులతో మైదానములో పోరాడగలడా? కార్య సాధనకై యుద్ధనీతితో పొంచియుండి శత్రువుపై దెబ్బ తీయడం తప్పు కాదు చరిత్ర తిరిగేస్తే, మన దేశ పతనానికి మనమే, ధరయుద్ధమే కారణం అయినదని ద్యోతకమౌతుంది. పృధ్వీరాజు, మహమ్మద్ ఘోరిని ఓడించి ఎన్ని సార్లు ప్రాణభిక్ష పెట్టలేదు. కాని చివరకు జరిగినదేమి? పృధ్వీరాజు తన ప్రాణాలను కోల్పోవుటయే గాక, దేశము పరాధీనమునకు అంకురార్పణ జరిగింది.

గత చరిత్ర నుండి అనుభవం గడించినందుననే శ్రీ శివాజి, శత్రువును జయించుటకు వలయు యుద్ధనీతి, నైపుణ్యం సాధించారు. కాని ధైర్యం, ధ్యేయనిష్ఠ, చిత్తశుద్ధి కావాలి.

శివాజి మతోన్మాదికాదా? అన్నారు. మతోన్మాదం అంటే నిర్వచనం ఏమిటి? పరులు, నీమతాన్ని ధర్మాన్ని నాశనం చేస్తుంటే చూస్తు ఉరుకుంటే మత సహనం, దాన్ని ఎదిరిస్తే మతోన్మాదమా? అదివారే చెప్పాలి దేవాలయాల ధ్వసం గోవులను చంపడం బలవన్మతాంతరీకరణం విశేషంగా జరిగే ఆ దినాలలో తిరిగి అలాంటివి జరుగకుండ చూడడం మతోన్మాదమా? ఇతరులు వచ్చి, నీ యింట్లో నుంచి నిన్ను గెంటి వేస్తుంటే అడ్డుపడడం అన్నది దౌర్జన్యమా? శ్రీ శివాజి పరాయి పాలకులు చేస్తున్న ధర్మహానిని, ప్రతిఘటించి స్వరాజ్య స్వధర్మ స్వజాతి రక్షణకు పూనుకున్నారు.

ఛత్రపతి శివాజి అన్యమతస్తులను కూడ సమానంగా చూచేవారు. ఎన్నో దర్గాలకు, యినాములు యిచ్చారు. ఎందరో ముస్లింలను తన సైన్యంలో పెద్ద పెద్ద హొదాలు యిచ్చి చేర్చుకున్నారు. యితరులను ఎప్పుడు ద్వేషించలేదు. వారి సైన్యంలో సిద్దిహలాల్, నూర్‌ఖాన్, నౌకాదళంలో, సిద్ది సంబత సిద్దిమిస్రీ, మరియు దౌలత్‌ఖాన్‌లున్నారు.

చివరగ జయంతులు జరుపుటకు దైవసమానులా? అన్నారు. మరి అటువంటప్పుడు ప్రస్తుతము జాతీయ నాయకుల జయంతుల, వర్ధంతులు ఎందుకు చేస్తున్నట్లు?

శివాజి ఒక్క మహారాష్ట్రకు చెందిన వాడు కాదు. యావత్ భారత దేశమునకు చెందిన మహామనిషి. అతనిలోని స్వాతంత్ర్య పిపాస నేటి యువతరానికి ఎంతైన అవసరం." అని శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ చెప్పారు. మరి యిటువంటి మహామనిషి జయంతి జరుపుట తప్పా? అది మతోన్మాదమా?

యం. పద్మనాభాచార్యు, కర్నూలు. □

Printed and Published by S. Nageswara Rao at The Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3. Editor : S Radhakrishna.

చెమటకాయల బాధనుండి ఉపశమనానికి టాల్కం పౌడర్ కాదు నైసిల్ కావాలి!



నైసిల్ వాడండి



చెమటకాయల బాధనుండి శీఘ్ర ఉపశమనం పొందండి.



నైసిల్ చెమటకాయల బాధనుండి ప్రతిదశలోనూ ఉపశమనాన్నిచ్చేందుకై ప్రత్యేకించి రూపొందించబడిన ఔషధయుక్త పౌడర్. ఇది దురదను, మంటను, చిరచిరను వెంటనే ఉపశమింపజేస్తుంది. టాల్కం పౌడర్లవలెకాక ఇది క్రిమిచర్యను అరికట్టి బాధ ప్రబలకుండ చేస్తుంది.

నైసిల్ – చెమటకాయల బాధనుండి ఉపశమనానికి నమ్మకమైన, నిరపాయకరమైన మార్గం.


2 ప్యాక్ లలో లభిస్తుంది–'బ్లూ' మరియు 'శాండల్ వుడ్'


1. అతిగా వచ్చే చెమటను ఆపుతుంది. 2. చెమటను పీలుస్తుంది.
3. దుర్గంధకారక క్రిములను ధ్వంసం చేస్తుంది. 4, శరీరానికి హాయినిస్తుంది.

మంచి ఆరోగ్యానికి మూలస్థానం

గ్లాక్సో

VIMAL WORSTED SUITING Chairman





చైర్‌మెన్

చైర్‌మెన్
మీరు సాధించిన విజయాలకి,
మీ ప్రగతికి మరో చిహ్నం. మీరు చేసే ప్రతి పని,
మీ వ్యక్తిత్వానికి ప్రతిబింబం, ఎన్నో
విజయాలను సాధించి, దిన దినం ప్రగతి సాధిస్తున్న
పురుషులకు వారి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే
అద్భుతమైన సూటింగ్—విమల్ చైర్ మెన్.

VIMAL®
A RELIANCE PRODUCT

వర్‌స్టెడ్ సూటింగ్స్

ప్రగతి పథంలో మరో ముందడుగు

INTERNATIONAL FILM STAR: KABIR BEDI

Mudra: A: RTI:1778 TEL.